ఆదివారం
13-1-2019
కరీంనగర్
• వెల. రూ.8.00
• సంపుటి 8 • సంచిక 199
• పేజీలు : 16 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



తాత్కాలిక సీజేగా ఆర్‌ఎస్ చౌహాన్!

రాధాకృష్ణన్ బదిలీ నేపథ్యంలో అత్యంత సీనియర్‌గా ఉన్న చౌహాన్‌కు అవకాశం
తెలంగాణ సీజేగా ప్రమాణంచేసిన పది రోజులకే రాధాకృష్ణన్ బదిలీ

2



మహా కూటమితో వారికి ఓటమే!

బలహీన ప్రభుత్వం ఏర్పాటుకే విపక్షాలు ఏకం
దేశ చరిత్రలో మచ్చలేని ప్రభుత్వం మాది
చౌకీదార్ ఎవ్వరినీ వదిలిపెట్టడు: ప్రధాని మోదీ

5

జీవిక భూమికగా బడ్జెట్

- ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందాలి
- రాష్ట్రాభివృద్ధిని సులభతరం చేయాలి
- మన ఆర్థిక వనరులపై పూర్తి అంచనాతో బడ్జెట్ సిద్ధంచేయాలి
- నీటిపారుదలరంగానికి ప్రాధాన్యం
- పర్యాటక కేంద్రంగా కాళేశ్వరం
- ఆదర్శంగా ప్రైవేట్ వర్సిటీ విధానం
- వ్యవసాయ ఆధునీకరణపై విధివిధానాలు
- హైదరాబాద్‌కు విశ్వనగర మాస్టర్ ప్లాన్
- అందుకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు
- క్యాబినెట్ రూపొందిన వెంటనే.. మంత్రులకు, అధికారులకు ప్రత్యేక శిక్షణ
- కేంద్ర ఆర్థికసంఘం తీరుమార్చుకోవాలి
- ముందస్తు అభిప్రాయాలతో రాష్ట్రాలకు రావడం మంచిదికాదు: సీఎం కేసీఆర్



శనివారం ప్రగతిభవన్‌లో సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

కేంద్రప్రభుత్వాల ఆర్థిక విధానాలపై ప్రజల్లో అసంతృప్తి

రాష్ట్ర ప్రగతిని దేశప్రగతిగా పరిగణించాలి.. దేశంలో విఫలమైన కాంగ్రెస్, బీజేపీ
రాష్ట్రాలను కించపరిచేలా కేంద్రం వైఖరి.. కనుమరుగవుతున్న రాజ్యాంగ సంబంధం
ఉన్నతస్థాయి సమీక్షాసమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజల జీవికను నిర్వచించుకొని, వారి అవసరాలను అన్నిరంగాల్లో పరిశీలించిన మీదటనే తుది బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. తెలంగాణ నేడు ఎక్కడ ఉన్నది.. రానున్న ఐదేండ్ల తరువాత ఎక్కడ ఉండబోతున్నది అన్న అవగాహనతో.. అంచనాతో బడ్జెట్‌ను రూపొందించాలన్నారు. త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్న కేంద్ర ఆర్థిక సంఘం దేశ ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు నడుంబిగించాల్సి ఉన్నదని అభిప్రాయపడ్డారు. మూసపద్ధతిలో కాకుండా తన పాత్రను కేంద్ర ఆర్థికసంఘం వినూత్నంగా తీర్చిదిద్దుకోవలసిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో పదిహేనో ఆర్థిక సంఘం బృందం రాష్ట్రంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ, ఇతర సీనియర్ అధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో కీలక సమీక్షాసమావేశం నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనకు సంబంధించిన ఏర్పాట్లు.. అందుకు ముందుగా అవసరమైన చర్యలమీద సీఎం సమీక్షించారు. మనం రూపొందిస్తున్న బడ్జెట్ విధివిధానాలు ఒక్క ఏడాదికా.. లేక ఐదేండ్ల పూర్తికాలానికా అన్న అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం కేవలం చట్టాలను అమలుపరుచడమే కాకుండా రాష్ట్రాభివృద్ధిని సులభతరంచేస్తూ ఒక ఉత్ప్రేరకంగా, ఉద్దీపనకారిగా తన పాత్రను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ తయారీకి ముందే ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని అన్నారు. ఒక్కొక్క అంశాన్ని తీసుకొని పనిని విభజించి సమస్యను ఛేదించే వ్యవస్థలను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ఇప్పుడు రూపొందించే బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతంచేసే దిశగా ఉండాలని స్పష్టంచేశారు. తెలంగాణ

మిగతా 2వ పేజీలో

యూపీలో ఫిఫ్టీ- ఫిఫ్టీ



శనివారం లక్నోలో మీడియా సమావేశంలో బీఎస్పీ నాయకురాలు మాయావతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ నేత అఖిలేశ్

ఎస్పీ-బీఎస్పీ పొత్తు

చెరో 38 స్థానాల్లో పోటీ.. కాంగ్రెస్‌ను తమ కూటమిలో కలుపుకోబోమని వెల్లడి

అమేథీ, రాయబరేలీ స్థానాలు మాత్రం కాంగ్రెస్‌కేనన్న అఖిలేశ్, మాయావతి

వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకనాటి ప్రత్యర్థి పక్షాలు సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీలు చేతులు కలిపాయి. కాంగ్రెస్ పార్టీని దూరంపెట్టి ఈ రెండు పార్టీలు యూపీలోని 80 సీట్లకుగాను చెరో 38 స్థానాల్లో పోటీచేయాలని నిర్ణయించాయి. కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, రాయబరేలీ స్థానాల్లో మాత్రం పోటీ చేయరాదని నిశ్చయించాయి. మిగిలిన రెండు స్థానాలను అజిత్‌సింగ్ నేతృత్వంలోని ఆర్‌ఎల్డీకి కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వివరాలు 5వ పేజీలో

ధాన్యం సేకరణలో తెలంగాణ భేష్

పీడీఎస్ విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
కేంద్ర ఆహార ప్రజాపంపిణీశాఖ కార్యదర్శి రవికాంత్
వీడియోకాల్ ద్వారా రైతులతో మాటామంతి
సంతృప్తి వ్యక్తంచేసిన రైతులు, రేషన్ లబ్ధిదారులు

2

అడవి దొంగల వేట

450 మంది బడా స్మగ్లర్ల జాబితా రెడీ.. పోలీస్, అటవీశాఖ సంయుక్త దాడులకు నిర్ణయం

15 మందిపై పీడీ చట్టం ప్రయోగించేందుకు ప్రతిపాదనలు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ / ఇచ్చోడ / గాంధారి:

అడవులను మింగే అనకొండల కోసం అటవీ, పోలీస్‌శాఖల వేట మొదలైంది. వేటగాళ్లను పట్టుకోవడానికి అధికారులు, పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. కట్టెకోత మిల్లుల్లో సోదాలు జరుపుతూ అక్రమ కలపను స్వాధీనం చేసుకొని అనుమానితులను అదుపులోకి తీసుకొంటున్నారు. మొదటిదశలో 450 బడా స్మగ్లర్లు, వేటగాళ్ల జాబితాను అటవీశాఖ సిద్ధంచేసింది. 15మంది హ్యాబిచువల్ అఫెండర్స్‌పై (తరచుగా అటవీ నేరాలకు పాల్పడేవారు) ప్రివెన్టివ్ డిటెన్షన్ యాక్ట్ (పీడీ యాక్ట్) కింద కేసులను నమోదుచేసే విషయాన్ని కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. అడవులను కాపాడటానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులతో ఇటీవల జరిపిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. అటవీ సంపదను కొల్లగొడుతున్న స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాల్సిందేనని స్పష్టంచేయడంతో అటవీశాఖలో కదలిక వచ్చింది. జిల్లాలవారీగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లను రంగంలోకి దింపి మెరుపుదాడులను చేపట్టింది. ఉద్యోగులకు పండుగ సెలవులను కూడా రద్దుచేసింది. అటవీనేరాల అదుపు, అడవుల రక్షణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధ్యక్షతన వచ్చేవారం ఉన్నతస్థాయి సమావేశం జరిపేందుకు నిశ్చయించారు. పోలీస్, అటవీ, గిరిజన, గ్రామీణాభివృద్ధిశాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్న ఈ సమావేశంలో.. అడవుల సంరక్షణ, అభివృద్ధిపై



మిగతా 4వ పేజీలో



రైతుబంధు మంచి పథకం

రుణమాఫీ కంటే ఇదే మెరుగైనది
సిండికేట్ బ్యాంక్ ఎండీ మృత్యుంజయ్ మహాపాత్ర

పంచాయతీలపై గులాబీ జెండా

మొదటి విడుతలో టీఆర్‌ఎస్ ఖాతాలో ఏకగ్రీవమైన 310 గ్రామాలు

11

రేపటి నుంచి ప్రచారహోరు

నేడు తొలి విడుత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
రెండో విడుత నామినేషన్లకు నేటితో ముగియనున్న గడువు



సంక్రాంతికి హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు పిల్లాపాపలతో కుటుంబాలు పెద్ద సంఖ్యలో ప్రయాణానికి సిద్ధంకావడంతో ఉప్పల్ చౌరస్తా బస్టాండ్ కిటకిటలాడుతున్న దృశ్యం

పల్లెబాటలో పట్నం

సంక్రాంతికి స్వగ్రామాలకు తరలుతున్న నగరవాసులు
ప్రయాణికుల రద్దీతో బస్సు, రైల్వేస్టేషన్లు, రోడ్లు కిటకిట
ప్రత్యేక బస్సులు, రైళ్లు ఫుల్
మెట్రోలోనూ రికార్డుస్థాయి ప్రయాణికులు
టోల్‌ప్లాజాల వద్ద వాహనాల బారులు

3

తాత్కాలిక సీజేగా ఆర్‌ఎస్ చౌహాన్!

- రాధాకృష్ణన్ బదిలీ నేపథ్యంలో అత్యంత సీనియర్‌గా ఉన్న చౌహాన్‌కు అవకాశం
- అధికారికంగా వెలువడాల్సి ఉన్న ఉత్తర్వులు
- తెలంగాణ సీజేగా ప్రమాణంచేసిన పది రోజులకే రాధాకృష్ణన్ బదిలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ నియమితులయ్యే అవకాశమున్నది. ప్రస్తుతం హైకోర్టు న్యాయమూర్తుల్లో చౌహాన్ అత్యంత సీనియర్ జడ్జి. తెలంగాణ హైకోర్టు తొలి చీఫ్ జస్టిస్ తొట్టతిల్ బీ రాధాకృష్ణన్‌ను కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీచేయాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీనియార్టీ విషయంలో రాధాకృష్ణన్ తర్వాత రెండోస్థానంలో ఉన్న జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్ తాత్కాలిక సీజేగా వ్యవహరించే అవకాశం ఉన్నది. అయితే, అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నది. ఛత్తీస్‌గఢ్ చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన రాధాకృష్ణన్ నిరుడు జూలైలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జనవరి ఒకటి నుంచి ఉమ్మడి హైకోర్టు విడిపోవడంతో జస్టిస్ రాధాకృష్ణన్ తెలంగాణ హైకోర్టు సీజేగా బాధ్యతలు స్వీకరించారు. కానీ, పదిరోజులు మాత్రమే ఆయన ఈ పదవిలో కొనసాగడం.. కలకత్తా హైకోర్టు సీజేగా బదిలీకావడం న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

జస్టిస్ చౌహాన్ నేపథ్యం..

రాజస్థాన్‌కు చెందిన జస్టిస్ చౌహాన్ 1983లో ఢిల్లీ వర్సిటీ నుంచి న్యాయవాదపట్టా పొందారు. అదే ఏడాది రాజస్థాన్ బార్‌కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదైన చౌహాన్.. ఆ రాష్ట్ర హైకోర్టులో పదేండ్లపాటు ప్రాక్టీస్‌చేశారు. 2005 జూన్ 13న రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2015లో కర్ణాటక హైకోర్టుకు, 2018లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తర్వాత తెలంగాణకు ఆప్షన్ ఇవ్వడంతో హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. సీనియార్టీ విషయంలో ఆయన రెండోస్థానంలో ఉన్నారు.

కాలంచెల్లిన నిబంధనలతో.. అవార్డుల తిరస్కారం సరికాదు

- 'కేరాఫ్ కంచెరపాలెం'పై కేటీఆర్ అసంతృప్తి
- నేషనల్ అవార్డు నామినేషన్లపై పునస్సమీక్షించాలని కేంద్రానికి వినతి
- స్పందించిన రాథోడ్.. భారతీయ నిర్మాతలకు అర్హత ఉందంటూ వివరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొన్న కేరాఫ్ కంచెరపాలెం సినిమాను జాతీయ పురస్కార నామినేషన్లకు ఎంపికచేయకపోవడంపై టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అసంతృప్తి వ్యక్తంచేశారు. సినిమా నిర్మాత అమెరికా పౌరురాలు అనే కారణంతో నామినేషన్లకు ఎంపికచేయకపోవడం సరికాదని తప్పుపట్టారు. కేరాఫ్ కంచెరపాలెం సినిమా నిర్మాత ప్రవీణ పరుచూరి ఆవేదనను కేంద్రానికి తెలిపారు. 'ఫిల్మ్‌మేకర్లందరూ నేషనల్ అవార్డు పొందటాన్ని గర్వంగా చూస్తారు. కాలంచెల్లిన నిబంధనలను అనుసరించి భారత్‌లో నిర్మించిన చిత్రాలకు అవార్డులను తిర్కరించడం సరికాదు' అని కేంద్ర సమాచారప్రసారశాఖ మంత్రి అరుణ్ జైట్లీకి, సహాయమంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్‌కు కేటీఆర్ ట్వీట్‌చేశారు. సినీ నిర్మాత అమెరికన్ సిటిజన్ అనే సాకుతో నేషనల్ అవార్డుకు ఎంపిక చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ప్రాధాన్యం సంతరించుకున్నది. అంతకుముందు 'తెలుగు ప్రేక్షకుల ఆదరణ పొందిన మా సినిమా.. నేషనల్ అవార్డుకు మాత్రం అర్హత సాధించలేకపోయింది. ఎందుకంటే నిర్మాత భారతీయుడు కాకపోవడమే' అంటూ చిత్ర నిర్మాణ ప్రవీణ పరుచూరి ట్వీట్‌చేశారు. కేటీఆర్, నరేంద్రమోదీతోపాటు ప్రముఖ నేతలను ట్వీట్‌కు జతచేశారు. 'మా సినిమాను భారత్‌లోనే, భారతీయ నటులతోనే నిర్మించాం. భారత్‌లో విడుదలచేశాం. కాని వివక్ష చూపారు' అని ట్విట్టర్‌లో ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. కేటీఆర్ ట్వీట్‌కు కంచెరపాలెం సినీ బృందం, నిర్మాత ప్రవీణ కృతజ్ఞతలు తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో విడుదలైన కేరాఫ్ కంచెరపాలెం చిత్రం విజయం సాధించిన సంగతి తెలిసిందే. కేంద్రం నిర్ణయంతో నేషనల్ అవార్డుల నామినేషన్లకు ఈ సినిమా ఎంపిక కాకపోవడంపై సోషల్ మీడియాలోనూ నెటిజన్లు విమర్శలు కురిపిస్తున్నారు.

రాథోడ్ స్పందన

కేటీఆర్ ట్వీట్‌పై కేంద్రమంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ స్పందించారు. తమ అధికారులు సినిమా నిర్మాత ప్రవీణతో మాట్లాడారని, నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ పొందేందుకు నిర్మాత, లేదా ఒక సహనిర్మాత అయినా భారతీయుడై ఉండాల్సిన అవసరం ఉందని ట్విట్టర్‌లో వివరించారు. రీట్వీట్ చేసిన కేటీఆర్.. వేగంగా స్పందించినందుకుగాను రాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలు

- దేశవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మంది హాజరు
- నేడు 'కీ' విడుదలచేసే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్-1 ఆన్‌లైన్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) ఆధ్వర్యంలో ఐఐటీ, ఎన్‌ఐటీలలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం తొలిసారిగా నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలు విజయవంతమయ్యాయని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా 9.6 లక్షల మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా దాదాపు 8 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షల 'కీ'ని ఆదివారం విడుదలచేసే అవకాశాలున్నాయి. దీన్ని జేఈఈ మెయిన్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. పేపర్-2 పరీక్షలను ఈ నెల 8న రెండు దశల్లో నిర్వహించగా, జేఈఈ మెయిన్-1 పరీక్షలను ఈ నెల 9 నుంచి 12 వరకు ఎనిమిది దశల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించారు.

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజు గడువు 15

హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐ ఈడీ) ఫెయిలైన, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ ఎలిమెంటరీ టీచర్స్ (పీడీపీఈటీ) కోర్సులో నమోదైన అభ్యర్థుల పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 15వరకు పొడిగించినట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ప్రాంతీయ సంచాలకుడు అనిల్‌కుమార్ శనివారం తెలిపారు. www.nios.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని కోరారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 5.57 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం సప్తమి రాత్రి 11.43 వరకు, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉదయం 11.06 వరకు, తదుపరి రేవతి. అమృతఘడియలు: తె. 5.50 నుంచి 7.26 వరకు, రాహుకాలం సాయంత్రం 4.34 నుంచి 5.57 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.28 నుంచి 5.12 వరకు, వర్జ్యం: రాత్రి 12.00 నుంచి 1.36 వరకు.

లోకం పోకడ



జానపదగీతాలు పాడు లేదా దేశభక్తి పాటలు పాడు.. అంతేగానీ వేలం పాటలు పాడితే చర్యలు తప్పవు!

జీవిక భూమికగా బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ఆర్థికశాఖ, ఇతర సీనియర్ అధికారులతో శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

ఒక రాష్ట్రంగా తన అభివృద్ధిని పెంచుకోవడానికి ప్రగతిమార్గంలో పయనించడానికి, అవలంబించాల్సిన మార్గదర్శకాలేమిటి.. మన ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్న అంశాలేమిటి? అనే విషయాలను పరిగణనలోకి తీసుకొని బడ్జెట్‌ను తయారుచేయాలని సూచించారు. 'సీఎంగా నన్ను ప్రజలు ఎన్నుకున్నపుడు నేను వారికి ఎంత గొప్పగా సేవలందించగలనో ఆలోచన చేయాలె. ఆదరాబాదరాగా కాకుండా ముందుగా ఒక సమగ్ర అవగాహనకు వచ్చిన తర్వాతనే బడ్జెట్ తయారీకి పూనుకోవాలి. బడ్జెట్‌రూపకల్పనలో పాలుపంచుకొనే వ్యక్తులు, అధికారులు ఆ దిశగా దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి. మనకున్న బలాలేమిటి, బలహీనతలేమిటి? అన్న మంచి చెడులను బేరీజు వేసుకున్న అనంతరమే పని ప్రారంభించాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో రాష్ట్రానికి ఎంతడబ్బు వస్తుంది, ఎంత ఖర్చు కాబోతున్నదో అనే ఒక సమగ్ర అంచనా ఉండాలి' అని సీఎం కేసీఆర్ సూచించారు.

అనుమతుల సాధన గొప్పకార్యం

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులతోపాటు ఇతర శాఖలను సోదాహరణంగా పేర్కొన్న సీఎం కేసీఆర్.. ఆయాశాఖలవారీగా బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధంచేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌ను రూపొందించే క్రమంలో ముందుగా గత నాలుగేండ్ల కాలంలో ఎంత ఖర్చు చేసింది, వచ్చే ఐదేండ్లలో ఎంత ఖర్చు చేయనున్నది అనే అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరంతోపాటు రానున్న ఐదేండ్ల కాలానికి.. మొత్తంగా నీటిపారుదలశాఖ కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు కానున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అన్ని సాగునీటి ప్రాజెక్టులకు అన్నిరకాల అనుమతులను సాధించడం గొప్ప కార్యమని అది బడ్జెట్‌లో ప్రతిఫలించాలని చెప్పారు. గొర్రెల పంపిణీకి సంబంధించిన ఉదాహరణను ప్రస్తావించిన సీఎం.. అది ఎంత గొప్పగా ప్రజాదరణ పొందిందో తెలిపారు. దాంతోపాటు చేపల పెంపకం, చేనేతరంగం రాష్ట్రంలో పురోగతిని సాధిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో నేత కార్మికుల కళను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. విద్యుత్ సగటు వినియోగంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనకు ముందు ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

పర్యాటక ప్రాంతంగా కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టును మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆకర్షణీయమైన పర్యాటక, భక్తి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎటువంటి విధానాలను అనుసరించాలో బడ్జెట్ రూపొందించే క్రమంలో సూత్రప్రాయంగా తగు సూచనలుచేస్తే బాగుంటుందని సీఎం కేసీఆర్ అన్నారు. అక్కడి త్రివేణి సంగమం అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారబోతున్నదన్నందున.. పర్యాటక ప్రయోజనాల మీద బడ్జెట్ దృష్టి కేంద్రీకరించాలన్నారు. యూనివర్సిటీ పరిశోధనలతోపాటుగా వ్యవసాయాన్ని ఆధునీకరించే అంశాలపై అధికారులు విధివిధానాలను రూపొందించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏవిధంగా ముందుకు తీసుకుపోవాలో ఆలోచించాలని కోరారు. విద్య, వైద్య రంగాలను ప్రస్తావించిన సీఎం కేసీఆర్ ప్రైవేటు యూనివర్సిటీల వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాలకు వలస పోకుండా రాష్ట్రంలోనే విద్యావ్యవస్థను ఆకర్షణీయంగా, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించేదిశగా విధివిధానాలను రూపొందించాలని చెప్పారు. ఆరోగ్య తెలంగాణ సాధనదిశగా మానవీయ కోణంలో బడ్జెట్ విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అవసరాలను, మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ అంచనాలను రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుద్ధిచేసిన పరిశుభ్రమైన తాగునీరు లభిస్తున్నదని, అది రాష్ట్రాభివృద్ధికి సూచిక అని సీఎం పేర్కొన్నారు.

వెన్నెముక హైదరాబాద్

'హైదరాబాద్ గ్లోబల్ సిటీ. దేశంలోని ఐదు పెద్ద నగరాల్లో హైదరాబాద్ ఒకటి. నగరంలో కనీసం 100 పార్కుల అవసరం ఉన్నది. హైదరాబాద్‌ను రక్షించడానికి, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్‌ప్లాన్ తయారుచేయాలి. అందులో ఒక్కపేరును మార్చాలంటే క్యాబినెట్ నిర్ణయం తీసుకునేంత స్థిరంగా నియమావళి రూపొందించాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో హైదరాబాద్‌ను అద్భుతమైన గ్లోబల్‌సిటీగా రూపొందించే దిశగా, ఎంత ఖర్చు చేయాల్సి ఉన్నదో, బడ్జెట్ ప్రతిపాదనలు ప్రతిఫలించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్ వెన్నెముక వంటిది' అని సీఎం కేసీఆర్ అన్నారు.

మంత్రులకు, సెక్రటరీలకు శిక్షణ

క్యాబినెట్ రూపొందిన వెంటనే మొత్తం మంత్రులకు ఆయాశాఖల కార్యదర్శులకు వారి విధులు బాధ్యతలమీద అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆధ్వర్యంలో సునిశిత శిక్షణాకార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంతోసహా దేశ ఆర్థిక వ్యవహారాలు, సచివాలయ విధి విధానాలు, బడ్జెట్ రూపకల్పన నిబంధనలు, వాటి పరిమితులు, ప్రాధాన్యాలకు అనుగుణంగా ఆయా మంత్రిత్వ శాఖల్లో చేపట్టే కార్యక్రమాలన్నీ సంబంధిత మంత్రులకు తెలిసేలా శిక్షణ ఉండాలని సీఎం కేసీఆర్ సూచించారు.

ఆర్థికసంఘం మూసపద్ధతిని వీడాలి

భారత ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం నడుం బిగించాల్సి ఉందని, మూస పద్ధతిలో కాకుండా.. తన పాత్రను వినూత్నంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. ఫైనాన్స్ కమిషన్ పాత్రపై సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రాలలో పర్యటించే క్రమంలో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ముందే ఒక అభిప్రాయాన్ని కలిగిఉండటం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, క్షేత్రస్థాయి పర్యటనకు ముందే ఒక అవగాహనతో టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ చేయడం సరైన విధానం కాదన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సాంస్కృతిక, ఆర్థిక, జీవనవిధానం ఉంటుందని.. ఆయా రాష్ట్రాల అవసరాలరీత్యా డివల్యూషన్ అంశం రాష్ట్రాల హక్కుగా పరిగణించి.. విధానాల రూపకల్పనకు మాత్రమే ఫైనాన్స్ కమిషన్ పరిమితమైతే మంచిదని పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ పరిశీలించి.. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థికసంఘానికి అందించే నివేదికను రూపొందించాలని ఆర్థికశాఖ అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు.

కాంగ్రెస్, బీజేపీలే మూలకారణం

స్వాతంత్ర్యకాలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పార్టీల ప్రభుత్వాలు వచ్చినాయి.. పోయినాయి.. కానీ ఎటువంటి గుణాత్మక మార్పును తీసుకురాలేకపోయాయని, ఈ నేపథ్యంలో తిరిగి లోతైన విశ్లేషణ, ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని సీఎం కేసీఆర్ అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ విధానాలపట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో నిరసన వ్యక్తంచేస్తుండటం విచారకరమని పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్, బీజేపీ అనే రెండు రాజకీయ వ్యవస్థలే మూలకారణమని స్పష్టంచేశారు.

రాష్ట్రాలను కించపరిచేలా కేంద్రం వైఖరి

'దేశానికి విశాలమైన విత్త విధానం ఉన్నది. వికేంద్రీకరణ చేయాల్సిన అధికారాలను.. అందుకు విరుద్ధంగా కేంద్రీకరించారు. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాల విధానాల్లో జోక్యంచేసుకోవద్దని నేను నీతిఆయోగ్ సమావేశాల్లో పాల్గొన్నప్పుడు స్పష్టంచేశాను. రాష్ట్ర ప్రగతిని దేశ ప్రగతిగా పరిగణించాలి. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలను నిరుత్సాహపర్చొద్దు. చిన్న చిన్న నిధులను విడుదల చేయడానికి కూడా అనేక నిబంధనలను విధిస్తున్నారు. రాష్ట్రానికి, కేంద్రానికి నడుమ ఉండాల్సిన రాజ్యాంగ సంబంధం రోజురోజుకూ కనుమరుగవుతున్నది. రాష్ట్రాల అధికారాలు, హక్కుల పంపిణీ విషయంలో కేంద్రం వైఖరి రాష్ట్రాలను కించపరిచేవిధంగా ఉండటం అత్యంత విచారకరం' అని సీఎం కేసీఆర్ అన్నారు. సమావేశంలో ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి, సీఎంవో అధికారులు నర్సింగ్‌రావు, స్మితాసబర్వాల్, సందీప్ సుల్తానియా, మానిక్‌రాజ్, స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ సెక్రటరీ వికాస్‌రాజ్, కమిషనర్ నీతూప్రసాద్, ఐటీ సెక్రటరీ జీటీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చారిత్రక సంపదను పరిరక్షిస్తాం

- హైదరాబాద్ సర్కిల్‌ను యథాతథంగా ఉంచాలి
- వరంగల్ సబ్‌సర్కిల్‌ను మినీ సర్కిల్ చేయాలి
- కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్న ప్రజాప్రతినిధులు

వరంగల్ ప్రధాన ప్రతినిధి- నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ సర్కిల్‌ను యథాతథంగా ఉంచాలని, వరంగల్ సబ్‌సర్కిల్‌ను మినీ సర్కిల్ చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ వారసత్వ, చారిత్రక సంపదను ప్రపంచానికి తెలియకుండా తొక్కిపెట్టాలని చూస్తున్న భారత పురావస్తుశాఖ (ఏఎస్‌ఐ) తీరుపై మండిపడ్డారు. రాష్ట్ర చారిత్రక సంపదను పరిరక్షించేందుకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. 'మన చారిత్రక సంపదపై మరో వివక్ష, తెలంగాణ చారిత్రక ఇమేజ్‌పై కేంద్ర పురావస్తుశాఖ కుట్ర' పేరుతో శనివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన ప్రత్యేక కథనంపై ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో కొందరు ఆంధ్రప్రాంత అధికారుల నిర్వాకం వల్ల తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కట్టడాల ప్రాధాన్యం బయటి ప్రపంచానికి తెలియలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడూ అదే ధోరణిని అనుసరిస్తే ఊరుకొనేదిలేదని, మన చారిత్రక సంపదకు తగిన రక్షణ, ప్రాచుర్యం పొందేలా అవసరమైతే కేంద్రంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఇక్కడి చరిత్ర, సంస్కృతి, ప్రాచీన, ఆధునిక చారిత్రక కట్టడాలకు గుర్తింపు తెస్తుంటే మరోవైపు ఏఎస్‌ఐ.. హైదరాబాద్‌ను మినీసర్కిల్ చేస్తే ఊరుకునేదిలేదని స్పష్టంచేశారు. తెలంగాణ మాన్యుమెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వకుంటే ఊరుకోబోమని, భారత పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడుతామని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర పురావస్తు, వారసత్వ పరిరక్షణ కమిటీ సభ్యుడు డాక్టర్ బండా ప్రకాశ్ చెప్పారు. సీఎం కేసీఆర్ సూచనలతో ఎంపీలంతా ఏఎస్‌ఐ అనుసరిస్తున్న తీరును ఎండగడుతామని, సర్కిల్ స్థాయి పెంచేలా ఒత్తిడితెస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల మాన్యుమెంట్స్ ఉన్నాయని, వీటిస్థాయిని దిగజార్చేలా చేస్తే సహించేదిలేదని మహబూబాబాద్ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ స్పష్టంచేశారు. తెలంగాణ చారిత్రక సంపద ప్రపంచానికి తెలియకుండా ఏఎస్‌ఐ తొక్కిపెడుతున్నదని వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు దాస్యం వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. కేంద్రం ప్రవేశపెట్టిన హృదయ్ పథకంలో ముందు వరంగల్‌ను చేర్చకుండా కుట్రలుచేస్తే సీఎం కేసీఆర్ పసిగట్టి కేంద్రానికి ఉత్తరాలు రాయడం వల్ల చేర్చాల్సి వచ్చిందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గుర్తుచేశారు.

ధాన్యం సేకరణలో తెలంగాణ బెస్ట్

- పీడీఎస్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
- కేంద్ర ఆహార ప్రజాపంపిణీ శాఖ కార్యదర్శి రవికాంత్ ప్రశంస
- వీడియోకాల్ ద్వారా రైతులతో మాటామంతి
- సంతృప్తి వ్యక్తంచేసిన రైతులు, రేషన్ లబ్ధిదారులు



పౌరసరఫరాల భవన్ నుంచి వీడియోకాల్ ద్వారా రైతులతో మాట్లాడుతున్న కేంద్ర ఆహార ప్రజాపంపిణీశాఖ కార్యదర్శి రవికాంత్, రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అకున్‌సబర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో ధాన్యం సేకరణ, ప్రజాపంపిణీ విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నదని కేంద్ర ఆహార ప్రజాపంపిణీశాఖ కార్యదర్శి రవికాంత్ పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర లభించేలా వారికి అందుబాటులో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్), ధాన్యం సేకరణ విధానాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఆయన శనివారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాలభవన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్న రైతులతో వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు, రేషన్‌షాపుల్లో లబ్ధిదారులు ఐరిస్ ద్వారా సరుకులు తీసుకుంటున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. 'గతేడాదికంటే ధాన్యం దిగుబడి ఎందుకు ఎక్కువగా వచ్చింది? కనీస మద్దతు ధర లభిస్తున్నదా? కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయా? ధాన్యం విక్రయించిన తర్వాత ఎన్ని రోజులకు డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయి? ఇతర సమస్యలేమైనా ఎదురవుతున్నాయా?' అని రైతులను వీడియోకాల్‌లో అడిగి తెలుసుకున్నారు. రైతులకు కనీస మద్దతు ధర లభించడంతోపాటు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం డబ్బులు సకాలంలో రైతుల ఖాతాలో జమకావడం, ఐరిస్, బయోమెట్రిక్, రేషన్ పోర్టబిలిటీ వంటివి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని రవికాంత్ ప్రశంసించారు.

ధాన్యం కొనుగోళ్లు ఎందుకు పెరిగాయి?

గతేడాది వానకాలం కంటే ఈసారి 208 శాతం అధికంగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నందుకు గల కారణాలను రవికాంత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సకాలంలో వర్షాలు, 24 గంటల కరంట్, రైతుబంధు వంటి పథకాలు రాష్ట్రంలో ధాన్యం దిగుబడికి ప్రధాన కారణాలని, గత ఏడాది 16 లక్షల టన్నులు కొనుగోలుచేయగా, ఈ ఏడాది ఇప్పటివరకు 38 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పౌరసరఫరాల కమిషనర్ అకున్‌సబర్వాల్ వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వివిధరకాల బకాయిలు, మార్కెట్ రుసుం, ఆర్డీసెస్ కమీషన్, ఇతర అంశాలకు సంబంధించి ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర అధికారిని ఆయన కోరారు. పోర్టబిలిటీ విధానాన్ని లబ్ధిదారులు పెద్దఎత్తున ఉపయోగించుకుంటున్నారని, పది నెలల్లో 1,13,74,000 లావాదేవీలు జరిగాయని తెలిపారు. బయోమెట్రిక్ ద్వారా సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో త్వరలో ఐరిస్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్‌షాపుల్లో అమలులోకి తెస్తామని చెప్పారు.

కేంద్ర అధికారి ప్రశ్నలకు రైతుల స్పందన ఇది..

నాలుగు రోజుల్లోనే డబ్బులు

మా పొలానికి దగ్గర సర్కారు ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం ఉన్నది. అక్కడికి ధాన్యం తీసుకొచ్చి అమ్ముకున్న. క్వింటాల్‌కు రూ.1,870 రేటుతో కొనుగోలు చేశారు. నాలుగు రోజుల్లోనే బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. ప్రభుత్వం పెట్టిన కొనుగోలు కేంద్రంలో అమ్మితేనే గిట్టుబాటు ధర వస్తున్నది. తూకంలో కూడా ఎలాంటి తేడా ఉండటం లేదు.

– మల్లారెడ్డి, రైతు భూపాలపల్లి

రైతుబంధు పైసలతో పొలం చేశా

నాకు మూడెకరాల పొలం ఉన్నది. రైతుబంధు పథకం కింద రూ.12 వేలు వచ్చాయి. మరోవైపు కరంట్ కోతలు లేవు. నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ఆ డబ్బు పెట్టుబడిగా పెట్టి పొలం చేశా. పంట బాగా పండింది. పంట అమ్ముకోవాలంటే గతంలో ఎన్నో సమస్యలు ఉండేవి. కానీ, ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవు.

– రహీం, రైతు వరంగల్

రేషన్ తీసుకోవడం సులువు

ఐరిస్ మిషన్ ద్వారా రేషన్ తీసుకోవడం చాలా సులువైంది. పోర్టబిలిటీ వల్ల ఎక్కడైనా సరుకులు తీసుకొనే అవకాశం కలుగుతున్నది. సమయం ఆదా అవుతున్నది. ఇదొక మంచి పరిణామం.

–వెంకటేశ్, రేషన్ లబ్ధిదారుడు, మంచిర్యాల

రైతుబంధు పథకం భేష్

- రుణమాఫీ కంటే ఇదే మంచి పథకం
- సిండికేట్ బ్యాంక్ ఎండీ మృత్యుంజయ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకంపై ప్రశంసల జల్లుకురిపించారు ప్రభుత్వరంగ సిండికేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ పథకం ఎంతో దోహదం చేస్తున్నదని హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. రుణమాఫీ కంటే ఇలాంటి పథకం రైతులకు అధిక ప్రయోజనాన్ని ఇస్తున్నదన్న ఆయన.. మాఫీతో బ్యాంకుల వద్ద రుణాలు తీసుకున్న వారికి మాత్రమే ప్రయోజనం చేకూరుతున్నదని, కానీ ఈ పథకంతో అందరూ లాభపడుతున్నారని అన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎకరాకు ఏడాదికి రూ.8 వేల చొప్పున ఆర్థికసాయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 58.3 లక్షల మంది రైతులు లబ్ధిపొందారు. రుణమాఫీతో రైతులు స్వల్పకాలంపాటు లబ్ధిపొందవచ్చుకానీ, దీర్ఘకాలికంగా ఇది చెడు చేయనున్నదన్నారు. మాఫీల కారణంగా సకాలంలో రైతులు రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంకింగ్ రంగ వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని మహాపాత్ర అభిప్రాయపడ్డారు.

పరారీలోని ఎఫ్‌ఆర్వో హఫీసొద్దీన్ అరెస్టు



ఖానాపూర్: పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొని సస్పెండై పరారీలో ఉన్న నిర్మల్ జిల్లా పెంబి రేంజ్ అధికారి హఫీసొద్దీన్‌ను శనివారం జిల్లాకేంద్రంలో పోలీసులు అరెస్టు చేశారు. ఖానాపూర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని తాటిగూడ అటవీబీట్ పరిధిలో నీల్గాయ్‌ని, పుల్గంపాండ్రి అడవుల్లో పులిని వధించిన కేసుల్లో గుగ్లావత్ ప్రకాశ్, మరికొందరు నిందితులు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని అటవీ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. పెంబి అటవీ పరిధిలోని ఇసుక అక్రమరవాణాలోనూ ఎఫ్‌ఆర్వో హఫీసొద్దీన్‌పై ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఇందులో హఫీసొద్దీన్‌తోపాటు మరో ఇద్దరు అధికారుల పాత్ర ఉన్నదని తేల్చారు. ఇద్దరు అధికారులను మూడ్రోజుల క్రితమే అరెస్టు చేయగా.. పరారీలో ఉన్న హఫీసొద్దీన్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల న్యాయస్థానం ఆదేశం మేరకు హఫీసొద్దీన్‌ను రిమాండ్‌కు తరలించారు.



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

పంతంగి వద్ద 12 టోల్‌గేట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కేతేపల్లి/మాడ్గులపల్లి: ఔటర్ రింగ్‌రోడ్, నాగపూర్, బెంగుళూరు, విజయవాడ హైవేలతోపాటు రాజీవ్‌రహదారి శనివారం వాహనాలతో నిండిపోయాయి. 65వ హైవేపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపాహాడ్ టోల్‌గేట్ల వద్ద వాహనాలు పెద్దసంఖ్యలో క్యూ కట్టాయి. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై మాడ్గులపల్లి టోల్‌గేట్ వద్దకూడా వాహనాలు బారులు తీరాయి. కొన్ని టోల్‌గేట్ల వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటుచేశారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద 12 గేట్లు ఏర్పాటు చేశారు.

పొగమంచుతో జాగ్రత్త

పండుగలకు ఊరెళ్లేవారికి పొగమంచు ప్రమాదకరంగా మారింది. వాతావరణంలో వస్తున్న మార్పులతో అప్రమత్తంగా ఉండాలని రాచకొండ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. శనివారం ఉదయం మంచుతో ఏర్పడ్డ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచిస్తున్నారు. అవగాహన కోసం విజయవాడ, వరంగల్ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాలతో ఇతర ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. పంతంగి, ఉప్పల్, ఎల్బీనగర్ వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేసి జాగ్రత్తగా ప్రయాణించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు పంతంగి టోల్ ప్లాజా, వరంగల్ మార్గంలో గూడురు టోల్ ప్లాజా నుంచి సాధారణంకంటే అదనంగా దాదాపు 50 వేల వాహనాలు వెళ్లాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఆదివారం మరో 30 వేలకుపైగా వాహనాలు ఈ మార్గాల్లో వెళ్లే అవకాశం ఉన్నదన్నారు. వాహనటైర్లలో గాలి సరిగా ఉండేలా చూసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ డీసీపీ దివ్యచరణ్‌రావు సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ అసలు వద్దన్నారు. మంచు ఎక్కువగా ఉండటంతో తెలవారుజామున ప్రయాణాలు ప్రమాదకరమని, హైబీమ్ లైట్లను వాడాలని చెప్పారు.

టోల్ వసూళ్లు రద్దు

నేడు, 16న అమలుకు సర్కారు నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులకు తెలంగాణ సర్కారు శుభవార్త చెప్పింది. జాతీయరహదారిపై టోల్‌గేట్ల వసూళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆదివారం (జనవరి 13), బుధవారం (జనవరి 16) టోల్ వసూళ్లు ఉండవని స్పష్టం చేశారు. పండుగ వేళ విపరీతమైన రద్దీ ఉండటం, టోల్‌గేట్ల వద్ద ఆలస్యానికి ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతుండటంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నది.

రాష్ట్రంపై మంచుదుప్పటి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలో చలి తీవ్రత కొంత తగ్గినా అర్ధరాత్రినుంచి ఉదయం వరకు దట్టంగా పొగమంచు కమ్ముకుంటున్నది. మంచు కారణంగా దారి కనిపించక రాష్ట్రంలో చాలాచోట్ల వాహనదారులు శనివారం ఉదయం 10 గంటలవరకు కూడా లైట్లు వేసుకొని ప్రయాణించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కనిపించింది. చారిత్రక వరంగల్ మహానగరాన్ని మంచు కమ్మేసింది. ఖిలావరంగల్‌లోని కాకతీయుల కట్టడాలు మంచు తెరల మధ్య అందంగా కనిపించాయి. భద్రకాళి చెరువును సైతం మంచు దుప్పటి కప్పేసింది. మహబూబాబాద్ జిల్లాలో ఉదయం 9 గంటలవరకు కూడా మంచుతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. పెద్దపల్లి జిల్లాలో వాహనాలు ఉదయం 10 గంటలవరకు లైట్లు వేసుకొని నడిచాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఏజెన్సీలో ఉదయం 10:30 గంటలవరకు జాతీయ రహదారిపై వాహనాలు లైట్లు వేసుకొని వెళ్లాయి. పర్యాటక ప్రాంతమైన లక్నవరం సరస్సులో వేలాడేవంతెనలు, రెస్టారెంట్లను మంచు దుప్పటి కప్పేసి చూపరులకు కనువిందుచేశాయి. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలను పొగమంచు కమ్మేస్తున్నది. పొలాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు చీకటిపడకముందే ఇండ్లకు చేరుతున్నారు.

పల్లెబాటలో పట్నం



సంక్రాంతికి స్వగ్రామాలకు తరలుతున్న నగరవాసులు • ప్రయాణికుల రద్దీతో బస్సు, రైల్వేస్టేషన్లు, రోడ్లు కిటకిట

ప్రత్యేక బస్సులు, రైళ్లు ఫుల్ • మెట్రోలోనూ రికార్డుస్థాయి ప్రయాణికులు





సొంతూళ్లకు వెళ్లేందుకు శనివారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు, ప్రయాణికులతో కిక్కిరిసిన సికింద్రాబాద్ స్టేషన్. ప్లాట్‌ఫాంపైకి రాకముందే ఎక్కేందుకు పోటీపడుతున్నయువకులు(ఇన్‌సెట్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగను సొంతూళ్లలో జరుపుకోవడానికి హైదరాబాద్‌వాసులు పల్లెలకు తరలివెళ్తున్నారు. బంధువులు, స్నేహితుల మధ్య సంబురాలు చేసుకునేందుకు పల్లెబాట పట్టారు. దీంతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లతోపాటు రహదారులు వాహనాల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. తెలంగాణ పల్లెలతోపాటు ఆంధ్రప్రదేశ్‌నుంచి చాలా మంది వలసవచ్చి హైదరాబాద్‌లో ఉద్యోగులుగా, వ్యాపారులుగా, కార్మికులుగా స్థిరపడ్డవారున్నారు. వీరందరికీ సంక్రాంతి ముఖ్య పండుగ కావడంతో స్వగ్రామాల్లో నిర్వహించుకునేందుకు కుటుంబాలతో బయలుదేరుతున్నారు. ప్రజలను చేరవేసేందుకు ఆర్టీసీ రెగ్యులర్ బస్సులతోపాటు 5,252 ప్రత్యేక బస్సులను నడుపుతున్నది. ప్రత్యేక బస్సులను ఈ నెల 10నుంచి 14వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాలకు నడుపడంతోపాటు, తిరుగు ప్రయాణం కోసం కూడా బస్సులను ఏర్పాటు చేస్తున్నది. దక్షిణమధ్య రైల్వే పండుగకు కొన్ని నెలల ముందే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటివరకు 203 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నది. ఇందులో 60 అన్‌రిజర్వ్‌డ్ రైళ్లు ఉన్నాయి. దీంతో నగరంలోని కాచిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేస్టేషన్లతోపాటు, జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, లక్డీకాపూల్, మియాపూర్, అమీర్‌పేట తదితర ముఖ్యప్రాంతాలు రద్దీగా మారాయి. ప్రయాణికులు ఉప్పల్, ఎల్బీనగర్, ఎంజీబీఎస్, జేబీఎస్‌తోపాటు సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్లకు చేరుకోవడానికి మెట్రోరైలును ఆశ్రయిస్తున్నారు. దీంతో శుక్రవారం ఒక్కరోజే 2.41 లక్షల మంది ప్రయాణించారని, ఇది మెట్రోరైలు చరిత్రలో మొదటిసారని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

పెరిగిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- తగ్గుముఖం పట్టిన చలి ప్రభావం
- ఆగ్నేయ దిశనుంచి వీస్తున్న గాలులు
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

హైదరాబాద్/సిటీబ్యూరో నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు కొంతమేర పెరిగాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగడంతో రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఉత్తర కర్ణాటక నుంచి ఆగ్నేయ రాజస్థాన్ వరకు మధ్య మహారాష్ట్ర, నైరుతి మధ్యప్రదేశ్ మీదుగా 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. ప్రస్తుతం తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తెలంగాణవైపు గాలులు వీస్తున్నాయి. రాగల మూడురోజులవరకు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం పూట పొగమంచు ఆవరించి ఉంటుందని వివరించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11 నుంచి 17.5 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. కనిష్ఠంగా వరంగల్ రూరల్ జిల్లాలో 11 డిగ్రీలుగా నమోదవగా, గ్రేటర్ హైదరాబాద్‌లో 17.5గా నమోదైంది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా లక్నవరంలో వేలాడే వంతెనను కమ్మేసిన మంచు

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం	జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
వరంగల్ రూరల్	11.0	31.0	సిద్దిపేట	14.9	32.9
నాగర్‌కర్నూల్	11.6	34.6	జోగుళాంబ గద్వాల	14.9	34.6
మహబూబ్‌నగర్	12.1	34.6	సూర్యాపేట	15.0	30.0
మెదక్	12.3	33.2	జనగామ	15.6	32.8
సంగారెడ్డి	12.9	34.6	నల్లగొండ	16.0	29.4
వికారాబాద్	13.2	28.0	రంగారెడ్డి	16.0	30.0
ఆదిలాబాద్	13.6	30.0	మహబూబాబాద్	16.2	34.1
మంచిర్యాల	13.6	30.0	జయశంకర్	17.0	30.0
ఆసిఫాబాద్	13.6	30.0	ఖమ్మం	17.0	30.0
నిర్మల్	14.0	31.0	రాజన్న సిరిసిల్ల	17.0	31.0
పెద్దపల్లి	14.6	29.8	భద్రాద్రి	17.0	31.0
యాదాద్రి	14.8	32.9	కామారెడ్డి	17.0	31.0
వనపర్తి	14.8	34.6	నిజామాబాద్	17.0	31.7
కరీంనగర్	14.8	35.5	జగిత్యాల	17.0	32.0
			వరంగల్ అర్బన్	17.5	28.0
			హైదరాబాద్	17.5	29.4
			మేడ్చల్‌మల్కాజిగిరి	17.5	29.4

2020లో ట్రంప్‌తో పోటీపడతా!

■ నిర్ణయాన్ని ప్రకటించిన తులసీ గబ్బార్డ్

■ అమెరికా అధ్యక్ష రేసులో తొలిసారిగా హిందూ మహిళ



తులసీ గబ్బార్డ్

వాషింగ్టన్, జనవరి 12: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో తొలిసారి ఓ హిందూ మహిళ పోటీపడనున్నారు. హవాయి నుంచి అమెరికా ప్రతినిధుల సభకు డెమొక్రటిక్ పార్టీ తరఫున వరుసగా నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న తులసీ గబ్బార్డ్ (37) తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించుకొన్నారు. 2020లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తలపడనున్నట్టు శనివారం ఆమె ప్రకటించారు. తద్వారా అమెరికా తొలి మహిళా అధ్యక్షురాలిగా చరిత్ర లిఖించేందుకు సన్నద్ధమవుతున్నారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాల్ని వెల్లడిస్తానని ఆమె పేర్కొన్నారు. డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయనున్నట్టు సెనెటర్ ఎలిజబెత్ వారెన్ ఇప్పటికే ప్రకటించారు. మరో 12 మంది అభ్యర్థులు సైతం పోరుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో భారత సంతతికి చెందిన కాలిఫోర్నియా సెనెటర్ కమలా హ్యారిస్ ఒకరు. ఇరాక్ యుద్ధం సమయంలో హవాయి ఆర్మీ నేషనల్ గార్డు నెలకొల్పిన మెడికల్ క్యాంప్‌లో ఏడాదిపాటు తులసీ గబ్బార్డ్ సేవలందించారు. 21 ఏండ్ల అతి చిన్న వయసుల్లోనే ప్రతినిధుల సభకు ఎంపికై రికార్డు సృష్టించారు. ప్రస్తుతం అధ్యక్ష పదవికి పోటీపడనున్న తొలి హిందూ మహిళగా నిలువనున్నారు. ఇండో అమెరికన్లలో తులసీ ప్రఖ్యాత నేతగా పేరుగాంచారు.

పారిస్‌లో పేలుడు.. ముగ్గురి మృతి



■ 47 మందికి గాయాలు..10 మంది పరిస్థితి విషమం

■ గ్యాస్ లీకవడంతో దుర్ఘటన

పారిస్, జనవరి 12: సెంట్రల్ పారిస్‌లోని ఓ భవనంలో శనివారం పేలుడు సంభవించడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది కాగా, ఒకరు స్పెయిన్ పర్యాటకురాలు ఉన్నారు. 47 మంది గాయపడగా.. వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. బేకరీ, రెస్టారెంట్ ఉన్న ఈ భవనంలో మొదట గ్యాస్ లీకు కావడంతోనే ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది. పేలుడు ధాటికి భవనంతో పాటు చుట్టుపక్కల ఉన్న నివాస సముదాయాలు కూడా దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతమంతా నల్లటి పొగ వ్యాపించింది. అక్కడ పార్కింగ్ చేసిన కార్లు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు పరుగులు తీశారు. విషయం తెలిసిన వెంటనే దాదాపు 200 మంది అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని దవాఖానాలకు చేర్పించారు.

'శారదా' కేసులో నళినికి ఊరట

నాలుగు వారాలపాటు అరెస్టు చేయవద్దంటూ సీబీఐని ఆదేశించిన మద్రాస్ హైకోర్టు



నళిని

చెన్నై, జనవరి 12: శారదా చిట్‌ఫండ్ స్కాం కేసులో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం భార్య నళినికి ఊరట లభించింది. ఈ కేసులో సీబీఐ ఆమెను అరెస్టు చేయవద్దంటూ మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. శారదా చిట్‌ఫండ్ కేసులో భాగంగా శుక్రవారం సీబీఐ దాఖలు చేసిన అదనపు చార్జిషీట్‌లో నళిని పేరును పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తనను సీబీఐ అరెస్టు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ మద్రాస్ హైకోర్టులో ఆమె పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శనివారం విచారణ జరిపిన కోర్టు నాలుగు వారాలపాటు ఆమెను అరెస్టు చేయవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఎగ్మూర్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరై ష్యూరిటీని సమర్పించాలని, అనంతరం ఈ కేసును విచారిస్తున్న పశ్చిమబెంగాల్‌లోని కోర్టు నుంచి పూర్తిస్థాయి ముందస్తు బెయిల్ పొందాలని నళినికి సూచించింది. శారదా చిట్ ఫండ్ స్కామ్‌లో నళిని రూ.1.4 కోట్లు ముడుపులు తీసుకున్నట్టు సీబీఐ ఆరోపిస్తున్నది. శారదా గ్రూప్ వ్యవస్థాపకులు సుదీప్తాసేన్‌తో కలిసి నళిని నిధుల దుర్వినియోగం చేయడంతోపాటు మోసపూరిత కుట్రకు పాల్పడ్డారని పేర్కొంటున్నది.

నాన్నా! రబ్రీదేవికి క్షమాపణ చెప్పు

■ లేకుంటే మీ పార్టీ కార్యాలయం ముందు ధర్నా చేస్తా

■ పాశ్వాన్ కుమార్తె ఆశా పాశ్వాన్ హెచ్చరిక





ఆశా పాశ్వాన్, రాంవిలాస్ పాశ్వాన్

పాట్నా: అగ్రకుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదంలో బీహార్ మాజీ సీఎం రబ్రీదేవిని అవమానించేలా మాట్లాడిన కేంద్రమంత్రి, లోక్‌జన్‌శక్తి (ఎల్జేపీ) అధినేత రాం విలాస్ పాశ్వాన్‌కు ఆయన సొంత కుమార్తె నుంచే ప్రతిఘటన ఎదురైంది. రబ్రీదేవికి క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ఎల్జేపీ కార్యాలయం ముందు ధర్నా చేస్తానని ఆశా పాశ్వాన్ తన తండ్రి రాం విలాస్ పాశ్వాన్‌ను హెచ్చరించారు. అగ్ర కులాల పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని ఆర్జేడీ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాం విలాస్ పాశ్వాన్ స్పందిస్తూ 'వారికి (ఆర్జేడీ నాయకులకు) కేవలం నినాదాలు చేయడం, వేలు ముద్ర వేసే వాళ్లను ముఖ్యమంత్రులను చేయడం తప్ప ఇంకేమీ తెలియదు' అని వ్యాఖ్యానించారు. ఆయన ఎవరి పేరును ప్రస్తావించనప్పటికీ రబ్రీదేవిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తున్నది. దీనిపై ఆశా శనివారం విలేకరులతో మాట్లాడుతూ 'నాన్నా.. రబ్రీదేవిని అవమానించావు. మా అమ్మకు కూడా చదువురాదు. మా అమ్మను ఎందుకు విడిచిపెట్టావు? నీ వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పు. లేకుంటే ఎల్జేపీ కార్యాలయం ముందు ధర్నా చేస్తా' అని పేర్కొన్నారు. పాశ్వాన్ మొదటి భార్య రాజ్ కుమారి దేవి కూతురే ఆశ. చాలా కాలంగా రాజ్‌కుమారి దేవికి దూరంగా ఉంటున్న పాశ్వాన్.. రీనా అనే మరో మహిళను పెండ్లి చేసుకున్నారు.

అమెరికాలో రికార్డు షట్‌డౌన్

■ 22 రోజులుగా తొలగని ఆర్థిక ప్రతిష్టంభన

■ ఇంతకాలంపాటు ప్రభుత్వ సేవలు మూతపడటం ఆ దేశ చరిత్రలో మొదటిసారి



వాషింగ్టన్, జనవరి 12: మెక్సికో సరిహద్దులో గోడ కట్టే విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య మొదలైన వివాదంతో దేశంలో ఆర్థిక ప్రతిష్ఠంభన నెలకొని 22 రోజులు దాటింది. ఇరు పక్షాల పట్టుదల కారణంగా దేశంలోని సుమారు ఎనిమిది లక్షల మంది ప్రభుత్వోద్యోగులకు వేతనాలు అందకుండా పోతున్నాయి. ట్రంప్ డిమాండ్ చేస్తున్నట్టుగా సరిహద్దు గోడకు 570 కోట్ల డాలర్లను మంజూరు చేసేందుకు డెమోక్రాట్లు నిరాకరిస్తుండటంతో ప్రభుత్వ సేవలు కుంటుపడ్డాయి. డెమోక్రాట్ల చర్యలకు ప్రతీకారంగా ఇతర విభాగాల బడ్జెట్‌పై సంతకం చేసేందుకు ట్రంప్ నిరాకరించడంతో ఒకరకంగా దేశరాజధాని నగరం వాషింగ్టన్ స్తంభించిపోయింది. దీంతో ఎఫ్‌బీఐ ఏజెంట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, మ్యూజియం సిబ్బంది శుక్రవారం వేతనం లేని విధులు నిర్వహించాల్సి వచ్చింది. అమెరికాలో ప్రభుత్వ సేవలు ఇంత సుదీర్ఘకాలం మూతపడటం ఇదే మొదటిసారి. ఇంతకుముందు 1995-96లో బిల్ క్లింటన్ హయాంలో 21 రోజులు ఇలాగే ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. ఇంతకు ముందు లాగానే ట్రంప్ మరోసారి దేశంలో ఎమర్జెన్సీ విధిస్తానని డెమోక్రాట్లను బెదిరించారు. చట్ట సభ అనుమతి లేకుండానే నిధులు పొందేందుకు దేశంలో ఎమర్జెన్సీ విధిస్తానని, తనకు ఆ హక్కు ఉందని శుక్రవారం ఆయన హెచ్చరించారు.

రష్యాతో ట్రంప్ సంబంధాలపై ఎఫ్‌బీఐ దర్యాప్తు

అమెరికా దర్యాప్తు సంస్థ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ జేమ్స్ కామీని 2017లో అధ్యక్షుడు ట్రంప్ పదవి నుంచి తొలిగించిన అనంతరమే దేశాధినేతకు రష్యాతో సంబంధాలపై ఎఫ్‌బీఐ దర్యాప్తు ప్రారంభించిందని ఓ వార్తా కథనం పేర్కొంది. కానీ తనకు వ్యతిరేకంగా కుట్ర చేసి దర్యాప్తు ప్రారంభించినందునే ఎఫ్‌బీఐ అధికారులను విధుల నుంచి తొలిగించానని ట్రంప్ తెలిపారు. 2016లో అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ప్రజలను ప్రభావితం చేసేందుకు ట్రంప్ రష్యాతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తును పర్యవేక్షిస్తున్న జేమ్స్ కామీకి ట్రంప్ ఆకస్మికంగా ఉద్వాసన పలికారు. అయితే ఎఫ్‌బీఐ దర్యాప్తులో ట్రంప్‌కు వ్యతిరేకంగా అనేక సంచలన విషయాలు వెల్లడైనట్టు న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది. ట్రంప్ ఉద్దేశపూర్వకంగానే రష్యాతో కలిసి పనిచేశారా లేక తనకు తెలియకుండానే ఆ దేశ ప్రభావానికి గురయ్యారా అన్న అంశాన్ని ఎఫ్‌బీఐ తేల్చేందుకు సిద్ధమైందని తెలిపింది. ట్రంప్ చర్యలు దేశ భద్రతకు ముప్పుగా పరిణమించాయా అన్న అంశాన్ని దర్యాప్తు అధికారులు ఇంకా తేల్చాల్సి ఉందని ఆ పత్రిక పేర్కొంది. మరోవైపు భారత్‌తో అమెరికా సంబంధాలకు ట్రంప్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఆ దేశానికి కొత్తగా నియమితులైన భారత రాయబారి హర్షవర్ధన్ శృంగాల పేర్కొన్నారు. తన అర్హత పత్రాలను శృంగాల అమెరికా అధ్యక్ష భవనంలో శుక్రవారం సమర్పించారు. నవతేజ్ సర్ణా స్థానంలో శృంగాల నియమితులయ్యారు.

ఉగ్రవాద దాడి కుట్రలో మరొకరు అరెస్ట్

ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించిన న్యాయస్థానం

న్యూఢిల్లీ, జనవరి 12: ఉత్తర భారతంలోని ఢిల్లీ, మరికొన్ని ప్రాంతాల్లో పేలుళ్లకు కుట్ర పన్నిన కేసులో తాజాగా మరొకరిని జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) అరెస్టు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ముహమ్మద్ అబ్సర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది. మీరట్, హపూర్, ఘజియాబాద్ ప్రాంతాల్లో సోదాలు చేపట్టామని, ఈ సందర్భంగా అబ్సర్‌ను శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని పేర్కొంది. మీరట్‌లోని జసోరా ప్రాంతానికి చెందిన అబ్సర్ ఘజియాబాద్‌లోని 'జామియా హుసేనియా అబ్దుల్ హస్సన్'లో పాఠాలు చెబుతున్నాడని తెలిపింది. ఉగ్రవాద కుట్రలో భాగంగా ఈ కేసులో మరో నిందితుడైన ఇఫ్తఖార్ సాకిబ్‌తో కలిసి అబ్సర్ 2018లో జమ్ముకశ్మీర్‌లో రెండు నెలలు పర్యటించాడని ఎన్ఐఏ వెల్లడించింది. అబ్సర్‌ను కోర్టు ముందు హాజరుపరిచి కస్టడీ కోరుతామని పేర్కొంది. మరోవైపు ఇదే కేసులో అరెస్టు అయిన వారిలో ఇద్దరిని జ్యుడీషియల్ కస్టడీకి ఢిల్లీలోని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ధర్మేందర్ సింగ్ ఆదేశించారు. ముఫ్తీ మహమ్మద్ సుహేల్, సాకిబ్ ఇఫ్తఖార్‌లను ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాలని చెప్పారు. ఉగ్రవాద కుట్రకు సంబంధించి గతేడాది డిసెంబర్ 26న ఎన్ఐఏ మొత్తం 10 మందిని అరెస్టు చేయగా అందులో వీరిద్దరూ ఉన్నారు.

పెట్రోల్ ట్యాంకర్ పేలి 20 మంది మృతి!

నైజీరియాలో దుర్ఘటన

వర్రి(నైజీరియా), జనవరి 12: నైజీరియాలో పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో పలువురు మరణించారు. శుక్రవారం సాయంత్రం ఒడుక్‌పాని ప్రాంతంలో పెట్రోల్ ట్యాంకర్ ఒక్కసారిగా ఒరిగిపోవడంతో స్థానిక ప్రజలు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా లీకవుతున్న పెట్రోల్‌ను తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా పేలుడు సంభవించింది. దీంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మాట్లాడుతూ లీక్ అవుతున్న పెట్రోల్‌ను స్థానికులు డబ్బాల్లోకి నింపుతుండగా మంటలు చెలరేగి పేలుడు సంభవించిందని చెప్పారు. దుర్ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో ఇప్పుడే చెప్పలేమని, కాకపోతే మృతుల సంఖ్య భారీగానే ఉండొచ్చని తెలిపారు. కాలిన గాయాలతో ఉన్నవారిని సమీప దవాఖానకు తరలించామని పేర్కొన్నారు. స్థానికుడు ఒకరు మాట్లాడుతూ తాను మృతదేహాలను లెక్కించానని, 18 మంది మరణించారని తెలిపారు. మరో స్థానికుడు స్పందిస్తూ ప్రమాద స్థలం నుంచి 20కిపైగా మృతదేహాలను తరలించారని వివరించారు. కాగా, నైజీరియాలో రోడ్లు సరిగా లేకపోవడంతో తరుచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

అహ్మద్‌పటేల్ ఎన్నికపై కొనసాగుతున్న వివాదం

ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకున్న గుజరాత్ హైకోర్టు

అహ్మదాబాద్: కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ రాజ్యసభ ఎన్నికను సవాల్ చేస్తూ బీజేపీ నేత బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్ దాఖలు చేసిన పిటిషన్‌లో ఆరు అంశాలను గుజరాత్ హైకోర్టు విచారణకు పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసుపై జనవరి 18న తదుపరి విచారణ చేపట్టనుంది. బల్వంత్‌సింగ్ ఆరోపిస్తున్నట్లుగా.. పటేల్ లేదా అతడి ఏజెంట్ అవినీతి కార్యకలపాలకు పాల్పడడం, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేసిన చెల్లని ఓట్లు, అలాగే ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు వేసిన ఓట్లు తిరస్కరించడం వల్ల ఫలితం ప్రభావితమైందా? వంటి అంశాలపై విచారణ జరపనుంది.

నీ కుమార్తెను కిడ్నాప్ చేస్తాం..

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెదిరింపు మెయిల్

న్యూఢిల్లీ, జనవరి 12: 'నీ కుమార్తెను కిడ్నాప్ చేస్తాం. ఎలా రక్షించుకుంటావో చూస్తాం' అంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. ఈ మెయిల్‌ను ఈ నెల 9న సీఎం కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తి పంపగా శనివారం ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 'సీఎం కేజ్రీవాల్ కుమార్తెను కిడ్నాప్ చేస్తాం. ఆయన ఏ విధంగా రక్షించుకుంటాడో చూస్తాం' అని ఆ మెయిల్‌లో ఉన్నది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కుమార్తె హర్షిత కేజ్రీవాల్‌కు భద్రతను పెంచారు. బెదిరింపు మెయిల్‌పై దర్యాప్తును సైబర్ సెల్‌కు అప్పగించారు.

ఆప్ నేత సన్యాల్ కన్నుమూత

న్యూఢిల్లీ, జనవరి 12: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నాయకురాలు మీరా సన్యాల్(57) శుక్రవారం కన్నుమూశారు. రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌ల్యాండ్‌లో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసి ఆప్‌లో చేరారు. అనంతరం 2014 లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ ముంబై నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ట్వీట్ చేస్తూ 'మీరా మరణ వార్త వినగానే నోటి నుంచి మాటలు కూడా రావడం లేదు' అని పేర్కొన్నారు.

త్వరలోనే ఎన్నారై పాలసీ

■ ఎన్నారైల సంక్షేమానికి రూ.100 కోట్లు

■ వంద దేశాల్లో గులాబీ జెండా ఎగరాలి

■ టీఆర్‌ఎస్ ఎన్నారై యూకే సెల్ ఎనిమిదో వార్షికోత్సవంలో నిజామాబాద్ ఎంపీ కవిత



శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని ఆహ్వానిస్తున్న నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ ఎన్నారై యూకే (లండన్) శాఖ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా కేక్ కోస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ యూకే వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్నారైల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, ఇందుకోసం రూ. 100 కోట్లు మంజూరు చేసిందని, త్వరలోనే ఎన్నారై పాలసీని ప్రకటించుకుందామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణభవన్‌లో శనివారం టీఆర్‌ఎస్ ఎన్నారై యూకే (లండన్) శాఖ ఎనిమిదో వార్షికోత్సవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలు, గల్ఫ్ లాంటి దేశాల్లో తెలంగాణ బిడ్డల సమస్యలు ఒక్కోరకంగా ఉన్నాయన్నారు. అక్కడి వారికి ఇక్కడి పార్టీకి వారధులుగా ఎన్నారై సెల్ పనిచేయాలని కోరారు. అందరం కలిసి పనిచేస్తే దేశానికే కాదు ప్రపంచానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తంచేశారు. విదేశాల్లో తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను ప్రొఫెసర్ జయశంకర్ సార్ వివరించారని, ఆయన సూచనలతో విదేశాల్లో ఉండే తెలంగాణ బిడ్డలు వివిధ పేర్లతో సంఘాలు పెట్టుకొని పని చేశారని తెలిపారు. ఆ సమయంలో రకరకాలుగా అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్నారని, నవ్విన నాప చేను పండిన చందంగా తెలంగాణ సాధించుకున్నామని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ఎన్నారై శాఖలు ప్రస్తుతం 33 దేశాల్లో విస్తరించాయని, రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా వంద దేశాల్లో గులాబీ జెండా ఎగిరేలా కృషిచేస్తామని ఎంపీ కవిత వివరించారు. మన ఇండస్ట్రియల్ పాలసీని చూసి అమెరికా వాసులు ఇలాంటి పాలసీ తమ వద్ద లేదన్న విషయం తెలంగాణ బిడ్డలుగా మనకు గర్వకారణమన్నారు. విదేశాల్లో ఉన్న ఎన్నారై విభాగం ప్రతినిధులు సోషల్ మీడియా అనే పదునైన ఆయుధం ద్వారా తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రపంచానికి తెలిపేలా కేసీఆర్‌కు అండగా నిలువాలని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ పిలుపునిచ్చారు. టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ యూకే వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ ఇప్పటివరకు ఏడు వార్షికోత్సవాలను లండన్‌లో జరుపుకొన్నామని తెలిపారు. పార్టీకి, సమాజానికి సేవ చేద్దామనే ఉద్దేశంతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేయడాన్ని గర్వంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ యూకే అధ్యక్షుడు అశోక్ దూసరి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, టాంకాం చైర్మన్ రంగారెడ్డి, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, న్యూజిలాండ్ శాఖ కోశాధికారి అభిలాష్ రంగినేని, యూఎస్ ప్రతినిధులు సుధీర్, సురేశ్, రమేశ్, టీఆర్‌ఎస్ ఖతార్ ప్రతినిధి అభిలాష్ బండి, దక్షిణాఫ్రికా ప్రతినిధి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగృతి సదస్సుకు అన్నా హజారే

■ **ఎంపీ కల్వకుంట్ల కవిత వెల్లడి**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల18న జరిగే ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్ (టీజేఐవైఎల్‌సీ) ప్రారంభకార్యక్రమానికి సామాజిక ఉద్యమ కర్త అన్నాహజారే ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. సదస్సుకు హాజరుకావాలని గవర్నర్ నరసింహన్‌ను శనివారం రాజ్‌భవన్‌లో కలిసి ఆహ్వానించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 20న జరిగే ముగింపు కార్యక్రమానికి వచ్చేందుకు గవర్నర్ నరసింహన్ సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు. మొదటి రోజు యువత అభివృద్ధిపై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చా గోష్ఠిని నిర్వహిస్తారని పదివేర్వేరు అంశాలపై చర్చా గోష్ఠులు జరగనున్నాయని తెలిపారు. 103 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని అన్నారు. 16 దేశాల నుంచి 70 మంది వక్తలు, 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు వస్తారని వివరించారు.



శాసనమండలి ఆవరణలోని మీడియాపాయింట్ వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో మరో విప్ వెంకటేశ్వర్లు ఉన్నారు

ఆ ఎమ్మెల్సీలు వేటుకు అర్హులే!

■ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు

■ చైర్మన్ నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

■ మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్సీలు వేటుకు అర్హులేనని, మండలి చైర్మన్ నిర్ణయం కోసం తాము ఎదురుచూస్తున్నామని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ తరపున ఎన్నికైన, నామినేట్ అయిన మండలి సభ్యులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, కాంగ్రెస్‌లో చేరడంతో వారు ఎమ్మెల్సీ పదవిలో కొనసాగడానికి అనర్హులని పేర్కొన్నారు. శనివారం శాసనమండలి ఆవరణలోని మీడియాపాయింట్ వద్ద మండలిలో ప్రభుత్వ విప్ బీ వెంకటేశ్వర్లు, టీఆర్‌ఎస్ తరపు న్యాయవాది మోహిత్‌రావుతో కలిసి పల్లా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని చెప్పారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రచారం చేసి, ఆ పార్టీ నుంచి పోటీ చేయడంతో వారిపై అనర్హత వేటువేయాలని టీఆర్‌ఎస్ తరపున మండలి విప్‌లుగా చైర్మన్ స్వామిగౌడ్‌కు వినతిపత్రం ఇచ్చామని, దీంతో ఆయన వారికి నోటీసులు జారీచేశారని వెల్లడించారు. వ్యక్తిగతంగా వాదనలు వినిపించేందుకు సమయం కావాలని ఎమ్మెల్సీలు కోరగా.. చైర్మన్ రెండుసార్లు అవకాశం ఇచ్చారని, శుక్రవారం రాములునాయక్ విచారణ పూర్తికాగా, శనివారం భూపతిరెడ్డి, యాదవరెడ్డి తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారని చెప్పారు. ఈ తీర్పు రిజర్వ్‌లో ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరినట్టు, ఆ పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేసినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలు తప్పని, వాటి ఆధారంగా చర్యలు తీసుకోవడం సరికాదని చైర్మన్‌ను ఎమ్మెల్సీలు కోరినట్టు పల్లా తెలిపారు. ఎన్నికల ప్రచారసభలో సోనియాగాంధీని కలువడం అనేది టీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కిందకు రాదా అని ఆయన ప్రశ్నించారు.

ఎమ్మెల్సీల వ్యవహారంపై విచారణ పూర్తి

టీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీల వ్యవహారంపై విచారణ పూర్తయింది. మండలి చైర్మన్ స్వామిగౌడ్ తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. పార్టీ ఫిరాయించిన కొండా మురళీధర్‌రావు ఇప్పటికే రాజీనామా చేయగా, ముగ్గురు ఎమ్మెల్సీలు రాములునాయక్, భూపతిరెడ్డి, యాదవరెడ్డిపై విచారణ చేపట్టారు.

బాలీవుడ్ స్టార్స్ మెడకు క్యూనెట్ ఉచ్చు

■ న్యాయనిపుణుల సలహా తీసుకొంటున్న సైబరాబాద్ పోలీసులు

■ గొలుసుకట్టు వ్యాపారం చట్టవిరుద్ధం: కమిషనర్ సజ్జనార్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: క్యూనెట్ సంస్థల గొలుసుకట్టు మోసాలపై సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ సీరియస్‌గా ఉన్నారు. అమాయక ప్రజలను ప్రలోభపెట్టి మోసపూరితంగా రూ.లక్షలు దోచుకొన్న క్యూనెట్ సంస్థతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరిపై విచారణ జరుపుతామని ఆయన స్పష్టంచేశారు. పలువురు బాలీవుడ్ నటులు అనిల్‌కపూర్, జాకీష్రాఫ్, పూజాహెగ్డే, అమీర్‌ఖాన్, బొమ్మన్ ఇరానీ, వివేక్ ఒబెరాయ్, యువరాజ్‌సింగ్, షారూక్‌ఖాన్ తదితరులు ప్రచారం చేయడంతో నిజమని నమ్మి అప్పులు చేసి మరీ ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టినట్టు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. క్యూనెట్ సంస్థల తరపున ప్రచారంచేసిన బాలీవుడ్ నటుల గురించి ఆరా తీస్తామని, న్యాయనిపుణుల సలహా తీసుకొని వారిపై విచారణ జరుపుతామని సీపీ సజ్జనార్ తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారం, మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీంలు చట్టవిరుద్ధమైనవని, అలాంటి సంస్థల నుంచి పారితోషికాలు తీసుకొని ప్రచారం చేసినట్టు తేలితే చర్యలు ఉంటాయన్నారు.

అడవి దొంగల వేట

మొదటిపేజీ తరువాయి...

ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు.

పీడీ యాక్ట్ ప్రయోగానికి ప్రతిపాదనలు

అడవులను ధ్వంసంచేస్తున్న స్మగ్లర్లపై అటవీశాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. వారి కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతూ దాడులు చేస్తున్నది. అధికారులు రెండురోజులుగా ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఇచ్చోడ, ఖానాపూర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా ఎల్లమ్మగూడ తదితర ప్రాంతాల్లో మెరుపుదాడులు చేసి పెద్ద మొత్తంలో కలప పట్టుకొని, పలువురిని అదుపులోకి తీసుకొన్నారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో, అటవీనేరాలను అదుపుచేయడంలో అటవీశాఖకు సహకారమందించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు లేఖ రాశారు. జిల్లాలవారీగా అటవీ, పోలీసు అధికారుల నేతృత్వంలో జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పడి అటవీ పరిరక్షణకు నడుం బిగించాయి. ఉత్తర తెలంగాణలో దాదాపు వంద ప్రాంతాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించి దాడులు చేపట్టారు. అటవీ భూమిని కబ్జా చేసినవారినీ గుర్తిస్తున్నారు. అక్రమ కలప నిల్వ ఉంచుతున్న కోత మిల్లులను గుర్తించి నోటీసులు జారీచేస్తున్నారు. కలప స్మగ్లింగ్‌నే వృత్తిగా పెట్టుకొన్న ముల్తానీలు, గుత్తికోయల కదలికలపై దృష్టిసారించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటూనే మరోవైపు వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపేలా ద్విముఖ వ్యూహంతో ముందుకు కదులుతున్నారు. తొలిదశగా 15 మందిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించేందుకు అధికారులు రంగం సిద్ధంచేశారు.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఎల్లమ్మగూడలో పట్టుకున్న కలప దుంగలతో అటవీశాఖాధికారులు

అటవీ సిబ్బంది ముమ్మర దాడులు

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఎల్లమ్మగూడలో శనివారం కవ్వాల్ టైగర్ జోన్ సిరిచెల్మ రేంజ్ సిబ్బంది దాడులు చేసి రూ.1.6 లక్షల విలువైన 15 దుంగలను, కలప రవాణా కోసం సిద్ధంచేసిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని నేరల్‌తండాలో శనివారం గబ్బర్ సింగ్ నివాసంలో అక్రమంగా నిలువ ఉంచిన రూ.8 వేల విలువైన 19 టేకు దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకొన్నారు.

వీహబ్ స్టార్టప్‌లపై కామన్వెల్త్ ఆరా

■ స్టార్టప్ ఆవిష్కర్తలతో కామన్వెల్త్ రాయబారి భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : తెలంగాణ ప్రభుత్వం ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ఏర్పాటుచేసిన వీహబ్‌పై విదేశీ ప్రతినిధులు ఆసక్తి కనబరుస్తున్నారు. కామన్వెల్త్ దేశాల రాయబారి పిలిప్ పర్హామ్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లేమింగ్ హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో శనివారం స్టార్టప్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అగ్‌మెంటెడ్ రియాల్టీ, వర్చువల్ రియాల్టీ, ఎడ్యుటెక్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, మెడ్‌టెక్ స్టార్టప్‌ల వారితో మాట్లాడారు. కామన్వెల్త్ రాయబారి, డిప్యూటీ హైకమిషనర్ మాట్లాడుతూ వీహబ్‌లోని 26 స్టార్టప్‌లతో సమావేశమయ్యానని, వివిధ స్టార్టప్‌లతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. వీహబ్ సీఈవో దీప్తిరావు సహా వారి బృందం స్టార్టప్ కంపెనీలను తీర్చిదిద్దుతున్న తీరు ఆకట్టుకుందన్నారు.

17 ఎన్‌కౌంటర్లలో 3 బూటకమే




జస్టిస్ హెచ్ఎస్ బేడీ

- గుజరాత్ సీఎంగా మోదీ హయాంలో జరిగిన ఎన్‌కౌంటర్లపై నిగ్గుతేల్చిన జస్టిస్ బేడీ కమిటీ
- సుప్రీంకోర్టుకు తుది నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ, జనవరి 12: ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2002-2006 మధ్య ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో కొన్ని బూటకపు ఎన్‌కౌంటర్లు ఉన్నాయని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎస్ బేడీ నేతృత్వంలోని కమిటీ నిగ్గు తేల్చింది. 17 కేసులను దర్యాప్తు జరిపిన ఈ కమిటీ.. మూడు కేసుల్లో పోలీసు అధికారులను ప్రాసిక్యూట్ చేయాలని సిఫారసు చేసింది. గుజరాత్ పోలీసు అధికారులు బూటకపు ఎన్‌కౌంటర్లలో సమీర్‌ఖాన్, కసమ్ జాఫర్, హాజీ ఇస్మాయిల్ అనే ముగ్గురు వ్యక్తులను హత్యచేశారని సుప్రీం కోర్టుకు సమర్పించిన తుది నివేదికలో జస్టిస్ బేడీ పేర్కొన్నారు. ఈ కమిటీ ముగ్గురు ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులు సహా మొత్తం తొమ్మిది మంది పోలీసు అధికారులను అభిశంసించింది. అయితే ఈ కేసుల్లో ఏ ఐపీఎస్ అధికారిని కూడా ప్రాసిక్యూట్ చేసేందుకు ఈ కమిటీ సిఫారసు చేయలేదు. 2002-06 మధ్య గుజరాత్‌లో జరిగిన 17 ఎన్‌కౌంటర్లపై దర్యాప్తు జరిపేందుకు జస్టిస్ బేడీ చైర్మన్‌గా సుప్రీంకోర్టు పర్యవేక్షక కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీ తన నివేదికను సీల్డ్ కవర్‌లో గతేడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ కమిటీ తుది నివేదికను గోప్యంగా ఉంచాలని గుజరాత్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ నెల 9న తోసిపుచ్చింది. ఈ నివేదిక ప్రతిని బాలీవుడ్ గేయ రచయిత జావెద్ అక్తర్‌తోపాటు పిటిషనర్లకు అందజేయాలని ఆదేశించింది.

ఈబీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం
- చట్టం అమలు తేదీని తర్వాత ప్రకటిస్తామని వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 12: జనరల్ క్యాటగిరీకి చెందిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (124వ సవరణ) బిల్లు-2019కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ చట్టం ఎప్పటి నుంచి అమలవుతుందనేది కేంద్రం తరువాత ప్రకటించనుంది. ఈ చట్టం ద్వారా రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను సవరించారు. ఇందులో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతినిస్తూ ప్రత్యేక క్లాజ్‌ను చేర్చారు. దీని ప్రకారం మైనారిటీ విద్యా సంస్థలు మినహా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రతి క్యాటగిరీలో గరిష్ఠంగా 10 శాతం సీట్లు కేటాయించవచ్చు. అలాగే ఉద్యోగ నియామకాల్లోనూ ఈబీసీ వర్గాలకు గరిష్ఠంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చు. ఇప్పటివరకు అమలులో ఉన్న రిజర్వేషన్లకు ఈ పది శాతం అదనమని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. కుటుంబ ఆదాయం, ఇతర ఆర్థిక వెనుకబాటు సూచీల ఆధారంగా ఈబీసీ వర్గాలు ఎవరనేది ప్రభుత్వం ఎప్పటికప్పుడు నోటిఫై చేస్తుందని పేర్కొన్నారు. ఈబీసీ బిల్లుకు ఈ నెల 8న లోక్‌సభ ఆమోదం తెలుపగా, ఆ మరుసటి రోజు రాజ్యసభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. 10 శాతం కోటా వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్‌లు, వైశ్య, రెడ్డి, వెలమ, కమ్మ, కాపు, క్షత్రియ తదితర వర్గాల వారికి ప్రయోజనం చేకూరనుంది.

25 ఏండ్ల తర్వాత చెట్టపట్టాల్

- 1993లో ఎస్పీ-బీఎస్పీల మధ్య తొలిసారి చెలిమి
- 1995లో మాయావతిపై దాడి నేపథ్యంలో పెరిగిన అంతరం
- మోదీని ఎదుర్కొనేందుకు మళ్లీ చేతులు కలిపిన మేనత్త-అల్లుడు



మీడియా సమావేశానికి వస్తున్న మాయావతి, అఖిలేశ్

లక్నో, జనవరి 12: సార్వత్రిక ఎన్నికల వేళ ఉత్తర్‌ప్రదేశ్‌లో కొత్త 'పొత్తు' పొడిచింది. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు.. శాశ్వత శత్రువులు ఉండరనే విషయం మరోసారి రుజువైంది. రెండున్నర దశాబ్దాల వైరాన్ని పక్కనపెట్టి బువా (మేనత్త), భతీజా (మేనల్లుడు)గా పేరొందిన మాయావతి, అఖిలేశ్ చేతులు కలిపారు. బీజేపీ ఓటమే లక్ష్యంగా వచ్చే పార్లమెంటు ఎన్నికల బరిలో కలిసి పోటీచేయాలని వారు నిర్ణయించారు.

నేపథ్యమిదీ..

రామ మందిరం ఉద్యమం జోరుగా సాగుతున్న సమయంలో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు తొలిసారి 1993 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ పొత్తు పెట్టుకున్నాయి. బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం, ఎస్పీ అధ్యక్షుడు ములాయంసింగ్ యాదవ్ మధ్య జరిగిన చర్చల అనంతరం ఎన్నికల్లో కలిసి పోటీచేయాలని నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ కూటమికి 176 సీట్లు వచ్చాయి. బీజేపీ 177 స్థానాల్లో విజయం సాధించింది. అప్పటి యూపీ అసెంబ్లీలో (ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడకముందు) మొత్తం 424 సీట్లు ఉండేవి. మెజార్టీకి 213 స్థానాలు కావాలి. దీంతో జనతాదళ్ (27), కాంగ్రెస్ (28), వామపక్షాలు (4) మద్దతుతో ఎస్పీ-బీఎస్పీ తొలి సంకీర్ణ సర్కారు ఏర్పడింది. అయితే, 1995లో మాయావతిపై జరిగిన దాడి అనంతరం వీరి పొత్తు కేవలం ఏడాదిన్నరకే విచ్ఛిన్నమైంది.

1995లో అతిథిగృహంలో ఏం జరిగింది?

1995 జూన్‌లో ములాయంసింగ్ సర్కారుకి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు మాయావతి ప్రకటించారు. దీంతో ములాయం ప్రభుత్వం మైనార్టీలో పడింది. లక్నోలోని మీరాబాయ్ మార్గ్ అతిథిగృహంలో బీఎస్పీ ఎమ్మెల్యేలతో మాయావతి సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తల గుంపు అక్కడికి చేరుకుని అలజడి సృష్టించింది. మాయావతి గదిని పూర్తిగా ధ్వంసం చేసింది. ఆమెను అసభ్యపదజాలంతో దూషిస్తూ కొందరు దాడి చేశారు. అడ్డుకోబోయిన బీఎస్పీ ఎమ్మెల్యేలను సైతం తరిమికొట్టారు. అయితే, బీజేపీ ఎమ్మెల్యే బ్రహ్మదత్ ద్వివేది ధైర్యంగా అక్కడికి చేరుకుని అల్లరి మూకల గుంపు నుంచి మాయావతిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. ఈ ఘటనను అవమానకరంగా భావించిన మాయావతి ఎస్పీతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నారు. అనంతరం బీజేపీ మద్దతుతో తొలిసారి మాయావతి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి ఉప్పునిప్పుగా ఉన్న ఎస్పీ-బీఎస్పీ మళ్లీ 23 ఏండ్ల తర్వాత చేతులు కలిపాయి. యూపీలో ఇటీవల జరిగిన గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులకు బీఎస్పీ బేషరతుగా మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులు బీజేపీపై ఘనవిజయం సాధించారు.

కూటమి ప్రభావం ఎంత?

2014 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని మొత్తం 80 స్థానాల్లో ఎస్పీ కేవలం ఐదు స్థానాల్లోనే గెలిచింది. బీఎస్పీ తన ఖాతా కూడా తెరువలేదు. కానీ రెండు పార్టీలకు చెరో 22 శాతం ఓట్లు వచ్చాయి. యూపీలో దళితులు 22 శాతం, ఓబీసీలు 45 శాతం, ముస్లింలు 19 శాతం ఉన్నారు. దళితుల్లో మెజార్టీ ప్రజలు బీఎస్పీకి అండగా ఉంటున్నారు. ఇక యాదవ్-ముస్లిం వర్గాలు ఎస్పీకి పెట్టనికోటగా ఉంటున్నాయి. రెండు పార్టీల కలయికతో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవచ్చనేది వీరి ధీమా.

ఎస్పీ-బీఎస్పీ పొత్తు



లక్నోలో శనివారం విలేకరుల సమావేశంలో చిరునవ్వులు చిందిస్తున్న మాయావతి, అఖిలేశ్

అమేథీ, రాయబరేలీలో పోటీ చేయబోమని అఖిలేశ్, మాయావతి సంయుక్త ప్రకటన

- చెరో 38 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం
- కాంగ్రెస్‌ను తమ కూటమిలో కలుపుకోబోమని వెల్లడి
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టి కరిపించగలమని ధీమా
- ఎస్పీ-బీఎస్పీ నిర్ణయాన్ని గౌరవిస్తామన్న రాహుల్
- 'అవినీతి-గూండాయిజం పొత్తు'గా వర్ణించిన బీజేపీ

లక్నో/న్యూఢిల్లీ, జనవరి 12: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకప్పుడు కత్తులు దూసుకున్న సమాజ్‌వాదీ, బహుజన్‌సమాజ్‌వాదీ పార్టీ వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం పొత్తు కుదుర్చుకున్నాయి. రెండు పార్టీల అధినేతలు మాయావతి, అఖిలేశ్ యాదవ్ ఈ మేరకు శనివారం లక్నోలో సంయుక్తంగా ఒక ప్రకటన చేశారు. యూపీలోని మొత్తం 80 లోక్‌సభ సీట్లకుగాను చెరో 38 స్థానాల్లో పోటీ చేయాలని మిగిలిన నాలుగింటిలో రెండో కాంగ్రెస్‌కు, మరో రెండు ఇతర పార్టీలకు వదిలివేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. తమ కూటమిలో కాంగ్రెస్‌ను కలుపుకోవద్దని నిర్ణయించినప్పటికీ అమేథీ, రాయ్‌బరేలీ స్థానాల్లో మాత్రం తమ అభ్యర్థులను పోటీ పెట్టరాదని ఎస్పీబీఎస్పీ నిర్ణయించాయి. ఆ రెండు స్థానాల నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ (అమేథీ), యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ (రాయ్‌బరేలీ) ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. బువా (మేనత్త), భతీజా (మేనల్లుడు)గా పేరొందిన మాయావతి, అఖిలేశ్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ విలేకరుల సమావేశం అనంతరం గురు-చేలా (గురుశిష్యులు నరేంద్రమోదీ, అమిత్‌షా)లకు ఇక నిద్ర పట్టదు' అని అన్నారు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించినట్టుగానే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా కాషాయ పార్టీని తమ కూటమి మట్టి కరిపించగలమన్న విశ్వాసం తమకుందని పేర్కొన్నారు. గత (2014) లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 71 స్థానాలు గెలుపొందగా, దాని మిత్రపక్షం అప్నాదళ్ రెండు సీట్లను గెలుచుకుంది. సమాజ్‌వాదీ పార్టీ ఐదు, కాంగ్రెస్ రెండు స్థానాలను గెలుచుకోగా, బీఎస్పీ ఎక్కడా గెలుపొందలేదు.

కాంగ్రెస్‌తో పొత్తు వల్ల లాభం లేదు

తమ కూటమిలో కాంగ్రెస్ పార్టీని చేర్చుకోకవడంపై మాయావతి వివరణ ఇస్తూ, ఆ పార్టీ పాలనలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి భారీగా పెరిగిపోయాయని, రక్షణ ఒప్పందాలలో కుంభకోణాలు జరిగాయని చెప్పారు. బోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్‌ను ముంచిందని, రాఫెల్ కుంభకోణం వల్ల బీజేపీకి కూడా అదే గతి పడుతుందని ఆమె చెప్పారు. గతంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం వల్ల తమ పార్టీ లాభపడలేదని అన్నారు. తమ పార్టీ ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయని, కానీ ఆ పార్టీ ఓట్లు తమకు పడలేదని తెలిపారు. 2017లో జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎస్పీ ఇదే పరిస్థితిని ఎదుర్కొందని చెప్పారు. ఎస్పీకి కాంగ్రెస్ పార్టీ ఓట్లు బదిలీ కాలేదన్నారు. కానీ ఎస్పీ-బీఎస్పీ పొత్తులో ఓట్ల బదిలీ కచ్చితంగా జరిగిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించిందని, ప్రస్తుతం బీజేపీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని అన్నారు. 'మీది సహజమైన పొత్తేనా?' అని విలేకరులు ప్రశ్నించగా, ఈ పొత్తు లోక్‌సభతోపాటు వచ్చే యూపీ అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగుతుందని అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ప్రధానమంత్రి పదవికి మాయావతికి మద్దతు పలుకుతారా అన్న ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానం ఇవ్వకుండా, 'నేనెవరికి మద్దతునిస్తానో మీకు తెలుసు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఎన్నికైన వారే దేశానికి ప్రధాని కావటం ఆనవాయితీగా వస్తున్నది. ఈసారి కూడా అలా జరిగితే నాకు సంతోషమే'అని చెప్పారు. అయితే తామిద్దరం లోక్‌సభకు పోటీ చేసే విషయమై మాత్రం వారు స్పష్టతనివ్వలేదు.

పీఎస్‌పీఎల్‌ను పోషిస్తున్న బీజేపీ

సమాజ్‌వాదీ పార్టీ నుంచి విడిపోయి 'ప్రగతిశీల్ సమాజ్‌వాదీ పార్టీ – లోహియా (పీఎస్‌పీఎల్)'ను స్థాపించిన ములాయం సోదరుడు శివపాల్ యాదవ్‌పై బీజేపీ భారీగా డబ్బు ఖర్చు పెడుతున్నదని మాయావతి ఆరోపించారు. బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చేందుకే పీఎస్‌పీఎల్‌ను పోషిస్తున్నదని చెప్పారు. 1995లో జరిగిన గెస్ట్‌హౌస్ ఘటనను తాను దేశ ప్రయోజనాల కోసం మరిచిపోయానని అన్నారు. నాటి ఘటనలో ఎస్పీ కార్యకర్తలు మాయావతి బసచేసిన అతిథిగృహంపై దాడి చేశారు. గతంలో కూడా బీఎస్పీ-ఎస్పీ కూటమి విజయవంతమైందని, ఈసారి కూడా, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) దుర్వినియోగం జరుగకపోతే బీజేపీని నిలువరిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఎస్పీ కార్యకర్తలు మాయావతికి తగిన గౌరవం ఇవ్వాలని అఖిలేశ్ కోరారు. 'మాయావతిని గౌరవిస్తే నన్ను గౌరవించినట్టు.. ఆమెను అవమానిస్తే నన్ను అవమానించినట్టే'నని ఆయన అన్నారు. మాయావతి వ్యాఖ్యలపై శివపాల్ స్పందిస్తూ, గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు.

పూర్తి సామర్థ్యంతో బరిలోకి దిగుతాం: రాహుల్

యూపీలో ఎస్పీ-బీఎస్పీ పొత్తుపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దుబాయ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ-బీఎస్పీ నేతలు తీసుకున్న నిర్ణయం పట్ల తనకు అపూర్వ గౌరవం ఉందని చెప్పారు. అయితే ఉత్తరప్ర దేశ్‌లో తాము పూర్తి సామర్థ్యంతో బరిలోకి దిగుతామని తెలిపారు. మరోవైపు ఎస్పీ-బీఎస్పీ పొత్తుపై కాంగ్రెస్ యూపీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం నబీ ఆజాద్ ఢిల్లీలో మాట్లాడుతూ, ఇప్పుడే తాము ఏమీ చెప్పలేమని అన్నారు. లక్నోలో ఆదివారం తమ స్పందనను సవివరంగా తెలియజేస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన యూపీపీసీ చీఫ్ రాజ్‌బబ్బర్, యూపీ సీఎల్పీ నాయకుడు సంజయ్‌సింగ్, మాజీ ఎంపీ ప్రమోద్‌తివారీతో తన ఇంట్లో సమావేశమయ్యారు. మరోవైపు భోపాల్‌లో మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మాట్లాడుతూ, బీజేపీని ఓడించేందుకు దేశమంతా పొత్తులు ఉండాలని అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో బీజేపీకి కేవలం 31 శాతం ఓట్లు వచ్చాయని, అయినా అది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిందని, కేవలం ఓట్లు చీలిపోవడం వల్లనే అది జరిగిందని కమల్‌నాథ్ గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ఇతర పార్టీలను కూడగడుతున్న కాంగ్రెస్‌కు ఎస్పీ-బీఎస్పీ ప్రత్యేక పొత్తు పెద్ద ఎదురుదెబ్బ కాగలదని పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు ఎస్పీ-బీఎస్పీ పొత్తును తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, ఆర్జేడీ స్వాగతించాయి.

ఉనికి కోసమే ఒక్కటయ్యారు:బీజేపీ

ఎస్పీ, బీఎస్పీలు కేవలం ఉనికి కోసమే పొత్తు పెట్టుకున్నాయని, వారి పొత్తు దేశం లేదా ఉత్తర్‌ప్రదేశ్ ప్రయోజనాల కోసం కాదని బీజేపీ విమర్శించింది. ఒంటరిగా మోదీని ఓడించలేమని ఆ పార్టీలకు తెలుసని, ఆయనపై వ్యతిరేకతే ఆ పార్టీల పొత్తుకు మూలమని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్పీ-బీఎస్పీల పొత్తుపై యూపీ డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్య స్పందిస్తూ 'అవినీతి-గూండాయిజం పొత్తు పెట్టుకున్నాయి' అని వ్యాఖ్యానించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడే కూటముల వల్ల యూపీలో నియంతృత్వం, అవినీతి, రాజకీయ అస్థిరత రాజ్యమేలుతాయని ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. ఎస్పీ-బీఎస్పీది 'పాపపు కూటమి' అని బీజేపీ యూపీ చీఫ్ మహేంద్రనాథ్ పాండే వ్యాఖ్యానించారు.



పొత్తు ప్రకటన అనంతరం వారణాసిలో ఎస్పీ-బీఎస్పీ కార్యకర్తల సంబురాలు

బీజేపీ ఓట్ల ఏకీకరణ వ్యూహాన్ని అడ్డుకునేందుకే కాంగ్రెస్‌ను చేర్చుకోలేదా?



ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓట్ల ఏకీకరణ జరిగి బీజేపీ లాభపడకుండా చూడటం కోసం ఎస్పీ-బీఎస్పీ ఒక వ్యూహం ప్రకారం కాంగ్రెస్‌ను తమ కూటమికి దూరంగా ఉంచినట్టు తెలుస్తున్నది. యూపీలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీయే కేంద్రంలోనూ కీలక పాత్ర పోషించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలోనే, బీజేపీని ఓడించేందుకు కూటమిగా ఏర్పడటంలో ఎస్పీ-బీఎస్పీ వ్యూహాత్మకంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. రాబోయే ఎన్నికలను మోదీకి ఇతర పార్టీలకు మధ్య పోటీగా బీజేపీ ఇప్పటికే ప్రచారం చేస్తున్నది. తద్వారా వచ్చే ఎన్నికలు హిందువులకు, ఇతర వర్గాల వారికి మధ్య పోటీగా విభజిస్తూ ఓట్ల ఏకీకరణకు ప్రయత్నిస్తున్నది. కేవలం మోదీని ఓడించేందుకే ఇతర పార్టీలన్నీ ఒక్క కూటమిగా ఏర్పడుతున్నాయని బీజేపీ ఆరోపిస్తున్నది. ఆ విధంగా ఓటర్లు ఏదో ఒక పక్షాన్ని ఎంచుకొనే పరిస్థితిని సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో తమ కూటమిలో కాంగ్రెస్‌కు స్థానం కల్పిస్తే బీజేపీ చేస్తున్న ప్రచారానికి ఊతమిచ్చినట్టు అవుతుందని ఎస్పీ-బీఎస్పీ భావించినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ కూడా విడిగా బరిలోకి దిగితే కులాలు, మతాల వారీగా ఓట్లు చీలిపోతే లాభపడవచ్చన్నది ఈ మూడు పార్టీల ఎత్తుగడగా కనిపిస్తున్నది.

అడుగడుగునా అసహనమే

- పాలకుల ఆలోచనా ధోరణే కారణం
- భిన్నాభిప్రాయాలను చెప్పేవారిని చావబాదే, జర్నలిస్టులను హత్యచేసే భారత్ మనకొద్దు
- యూఏఈ పర్యటనలో రెండోరోజు మోదీ సర్కారుపై రాహుల్ ధ్వజం



ఐఎంటీ దుబాయ్ వర్సిటీ విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాహుల్

దుబాయ్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో గత నాలుగున్నరేండ్ల నుంచి అసహనం, ఆగ్రహం అధిక స్థాయిలో కనిపిస్తున్నదని, అధికారంలో ఉన్న వ్యక్తుల ఆలోచనా ధోరణే ఇందుకు కారణమని విమర్శించారు. భిన్నమైన వివిధ భావనలను భారత్ విలీనం చేసుకోగలదని, ఒకే రకమైన భావనను ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ఎన్నడూ ప్రయత్నించలేదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రవాస భారతీయులకు చేరువ కావాలన్న ప్రయత్నంలో భాగంగా తొలిసారి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ శనివారం ఐఎంటీ దుబాయ్ యూనివర్సిటీ విద్యార్థులతో ముచ్చటించారు. 'సహనం మన సంస్కృతిలోనే ఉన్నది. కానీ గత నాలుగున్నరేండ్ల నుంచి దేశంలో జరుగుతున్న పరిణామాలు విచారాన్ని కలిగిస్తున్నాయి. దేశంలో ఎటు చూసినా అసహనం, ఆగ్రహం, సామాజిక వర్గాల మధ్య చీలికలే కనిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న వ్యక్తుల మానసిక వైఖరే ఇందుకు కారణమని స్పష్టమవుతున్నది. నాయకులు సహనశీలురైతే వారు సహనంతో వ్యవహరించి ఆ సందేశాన్ని వ్యాప్తి చేయగలుగుతారు. లేకపోతే అడుగడుగునా అసహనం రాజ్యమేలుతుంది. దేశంలో ఇప్పుడు జరుగుతున్నది ఇదే' అని రాహుల్ అన్నారు. భిన్నాభిప్రాయాలను చెప్పినవారిని చావబాదే, జర్నలిస్టులను హత్యచేసే భారత దేశాన్ని మనం ఆకాంక్షించడం లేదని, ఈ పరిస్థితిలో మార్పు రావాలని అన్నారు.

మాతో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు

- గవర్నర్ కిరణ్‌బేడీని హెచ్చరించిన పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి
- సంక్రాంతి గిఫ్టు ప్యాకెట్ల పథకంపై ఇరువురి మధ్య వివాదం



పుదుచ్చేరి: అసలే ఉప్పునిప్పుగా ఉన్న పుదుచ్చేరి సీఎం వీ నారాయణస్వామి, రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీల మధ్య మరోసారి మాటల తూటాలు పేలాయి. తన ప్రభుత్వంతో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముఖ్యమంత్రి హెచ్చరించగా, హుందాగా మాట్లాడాలంటూ గవర్నర్ కిరణ్‌బేడీ చురకలంటించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా పుదుచ్చేరి రాష్ట్ర ప్రజలకు ఉచితంగా గిఫ్టు ప్యాకెట్లు అందజేయాలని సర్కారు నిర్ణయించడమే ఈ వివాదానికి కారణం. మద్రాస్ హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే ఈ పథకానికి మోకాలడ్డుతున్నారని నారాయణస్వామి ఆరోపించారు. మరోవైపు సీఎం వ్యాఖ్యలను కిరణ్‌బేడీ కొట్టిపారేశారు. వ్యక్తిగతంగా తాను ఎవరికీ భయపడే రకం కాదని పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా తమిళనాడు సర్కారు అక్కడి నిరుపేదలకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని నిర్ణయించిందని, కానీ మద్రాస్ హైకోర్టు దీన్ని అడ్డుకుందని ఆమె గుర్తుచేశారు. న్యాయస్థానం ఆదేశాలనే తాను పాటిస్తున్నానని చెప్పారు.

మహాకూటమితో వారికి మహాఓటమే!

అదొక విఫల ప్రయోగం

- అవినీతి కోసమే విపక్షాలు ఏకం
- సుస్థిర పాలన, బలమైన సర్కారే మా లక్ష్యం
- దేశ చరిత్రలో మచ్చ లేని ప్రభుత్వం మాదే
- చౌకీదార్ ఎవ్వరినీ వదిలిపెట్టడు
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 12: బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పాటవుతున్న మహాకూటమిపై ప్రధాని నరేంద్రమోదీ విమర్శలు గుప్పించారు. మహాకూటమి ఓ 'విఫల ప్రయోగం'గా అభివర్ణించారు. పక్షపాతం, అవినీతిని ప్రోత్సహించేందుకు 'బలహీన' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని విమర్శించారు. అయితే బీజేపీ మాత్రం సమగ్రాభివృద్ధి కోసం బలమైన ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నదని చెప్పారు. రామ మందిరం వివాదం విషయంలోనూ కాంగ్రెస్‌పై మోదీ విరుచుకుపడ్డారు. అయోధ్య వివాదం పరిష్కారం కాకుండా తమ లాయర్ల ద్వారా కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తున్నదని మండిపడ్డారు. న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శనివారం బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్, ఆ పార్టీ సంస్కృతికి వ్యతిరేకంగా ఏర్పాటైన పార్టీలు నేడు అదే పార్టీతో చేతులు కలుపుతున్నాయని ఆయన విమర్శించారు. అవినీతికి ముగింపు పలికేందుకు బలమైన ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. మహాకూటమి పేరుతో నేడు దేశంలో ఓ విఫల ప్రయోగం జరుగుతున్నదని, బలహీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వారంతా ఏకమవుతున్నారని విమర్శించారు. తమ దుకాణాలు మూతపడతాయనే వారు బలమైన ప్రభుత్వాన్ని కోరుకోవట్లేదని ఎద్దేవా చేశారు. రాజకీయంగా కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి వ్యతిరేకంగా సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సీబీఐకి 'సాధారణ సమ్మతి'ని ఉపసంహరించుకున్న ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలపై ఆయన విమర్శలు గుప్పించారు. సీబీఐ అంటే ఎందుకు భయపడుతున్నారని, ఏయే అక్రమాలకు పాల్పడ్డారని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రశ్నించారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాటి యూపీఏ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలతో కొన్నేండ్ల పాటు తనను వేధింపులకు గురిచేసినప్పటికీ రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశంపై నిషేధం విధించలేదని చెప్పారు. తదుపరి 'ప్రధాన సేవకుడి'గా నిజాయితీపరుడు, కష్టపడే వ్యక్తి కావాలా లేక అవినీతిపరులు, అవసరమైన సమయాల్లో అందుబాటులో లేకుండా విహారయాత్రలకు వెళ్లే వారు కావాలా అనేది దేశ ప్రజలే తేల్చుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

చౌకీదార్ ఎవ్వరినీ వదిలిపెట్టడు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం 'నవ భారత' విశ్వాసాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. ఈ నిర్ణయం ఎవరి హక్కులనూ హరించబోదని నొక్కిచెప్పారు. ''ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేకపోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. అవినీతి లేకుండా దేశాన్ని పాలించొచ్చని బీజేపీ ప్రభుత్వం నిరూపించింది. మునుపటి ప్రభుత్వం దేశాన్ని అంధకారంలోకి నెట్టింది. అవినీతి, కుంభకోణాలతో 2004-14 మధ్య దేశం పదేండ్ల విలువైన సమయాన్ని కోల్పోయింది''అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ చౌకీదార్‌కు ఎదురులేదని, ఏ ఒక్కరినీ విడిచిపెట్టడని, ఇది ఆరంభం మాత్రమే అని స్పష్టం చేశారు.

ప్రతికూల ఫలితాలతో విశ్వాసం కోల్పోవద్దు : అమిత్‌షా

మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ప్రతికూల ఫలితాలతో విశ్వాసం కోల్పోవద్దని, వచ్చే లోక్‌సభ ఎన్నికలు పార్టీకి అతి ముఖ్యమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తమ పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 'మూడు రాష్ట్రాల ఎన్నికల్లో మన ప్రత్యర్థులు గెలిచారు. కానీ మనం ఓడిపోలేదు. ఫలితాలు సంతృప్తికరంగా లేవు. కానీ మనం మన స్థానాన్ని కోల్పోలేదు. ఈ ఫలితాలతో కార్యకర్తలు విశ్వాసం కోల్పోవాల్సిన అవసరం లేదు. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తుడుచిపెట్టుకుపోయిందే.. దాన్ని ఓటమి అంటారు' అని షా పేర్కొన్నారు.



సుస్థిరత, అస్థిరత మధ్యే పోటీ

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సుస్థిరత, అస్థిరత మధ్యే పోటీ అని బీజేపీ జాతీయ సమ్మేళనం పేర్కొంది. ఈ మేరకు సమావేశాల చివరన ఓ తీర్మాన పత్రాన్ని విడుదల చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నుంచి పార్టీ కార్యకర్తలు సరైన పాఠాలు నేర్చుకోవాలని ఆ తీర్మానం సూచించింది. 'సుస్థిరత లేక అస్థిరత.. నిజాయితీ, ధైర్యవంతుడైన ప్రధాని మోదీయా లేక నాయకుడే లేని అవకాశవాద కూటమా.. బలమైన ప్రభుత్వమా లేక బలహీన ప్రభుత్వమా' అనేది వచ్చే ఎన్నికల్లో ప్రజలు తేల్చుకోవాలని సూచించింది. మహాకూటమిని హాస్యకూటమిగా అభివర్ణించింది. అది ప్రధాని, బీజేపీ, ఎన్డీఏకు వ్యతిరేకంగా ఏర్పాటవుతున్న 'నిరాశవాద, విరుద్ధ, అవకాశవాద' కూటమి అని విమర్శించింది. దానికి అజెండానూ లేదు, నాయకుడూ లేడని ఎద్దేవా చేసింది. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మోదీ విజన్‌కు మద్దతునివ్వాలని ఓటర్లను అభ్యర్థించింది.

కట్టా మీఠా

మోదీ రాజకీయ జూదం

ప్రధాని నరేంద్ర మోదీ బాగా అప్రమత్తమయ్యారని ఈబీసీ రిజర్వేషన్ల బిల్లు చెప్పకనే చెప్పింది. ఆయన ఇటువంటి కానుకలు ఇంకా మరికొన్ని ప్రకటిస్తారని కేంద్రంలోని అధికార వర్గాలు చెబుతున్నాయి. బడ్జెట్ సందర్భంగానో, ఇంకా ముందుగానో ఈ నిర్ణయాలు వెలువడవచ్చు. మోదీ ఇలా ఉన్నట్టుండి ప్రజాకేంద్రక విధానాల వైపు మళ్లడానికి వేరే కారణం ఏమీ లేదు. ఆయన ఓటు బ్యాంకు పునాదులు కదిలిపోతున్నాయని మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికలు రుజువుచేశాయి. ఆయనకు అండగా ఉంటూ వచ్చిన వ్యాపారవర్గాలు, అగ్రవర్ణాలు దూరమయ్యాయని ఈ ఎన్నికల ఫలితాలతో అర్థమైంది. అంతకుముందు వివిధ రాష్ట్రాల్లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ వరుస పరాజయాలను చవిచూస్తూ వచ్చింది. ఎంతో గొప్పగా చెప్పుకున్న మధ్య భారత పెత్తనం సైతం చేజారిపోయింది. ఇప్పుడా పార్టీ పాలించే పెద్ద రాష్ట్రాలు యూపీ గుజరాత్, మహారాష్ట్ర, అసోం, హర్యానా, బీహార్‌లు మాత్రమే. మిగిలినవన్నీ రాష్ట్రాలుగా మారిన కేంద్రపాలిత ప్రాంతాలు. సంఖ్యకు చాలా రాష్ట్రాల పేర్లు చెప్పవచ్చు కానీ అక్కడ మొత్తంగా ఉన్నది 25 లోక్‌సభ స్థానాలలోపే. అందువల్ల మనుగడ ముప్పులో పడిందని నరేంద్ర మోదీకి అర్థమవుతున్నది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, పెట్రో ధరలు.. వంటి సీతయ్య నిర్ణయాలు మధ్య తరగతిని బాగా నొప్పించాయని గత రెండేండ్ల అనుభవాలు చెబుతున్నాయి. ఎవరినీ సంప్రదించకుండా, పర్యవసానాలు యోచించకుండా తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరిగింది. ఆయన చెప్పిన ఆర్థిక క్రమశిక్షణ రాలేదు. నల్లధనం అరికట్టడం అన్నది ఆచరణలో జరుగలేదు. ధన రాజకీయాలు ఆగలే దు. కశ్మీర్‌లో ఉగ్రవాదం సద్దుమణగలేదు. ఇవిగాక నరేంద్ర మోదీ కేంద్రంలోని అన్ని వ్యవస్థలను కాషాయీకరణ చేస్తున్నారన్న విమర్శలు ఎక్కువయ్యాయి. సీబీఐ మునుపెన్నడూ లేనంత భ్రష్టుపట్టిపోయింది. సీబీఐ ఎప్పుడూ రాజకీయ పనిముట్టుగా పనిచేసేదే. కాంగ్రెస్ కూడా దానిని అందుకే ఉపయోగించిందన్నది వాస్తవం. ఇప్పుడు దానిని మరింత నగ్నంగా నడి బజారుకీడ్చారు ప్రధాని నరేంద్ర మోదీ.

ఉన్నత న్యాయస్థానాల నియామకాలపై రచ్చ అందరికీ తెలిసిన విషయమే. తమకు ఇష్టం లేని వారి నియామకాన్ని మాసాల తరబడి ఆపడం, వేధించడం చూశాం. బ్యాంకులు, ఆర్బీఐ ఆగమాగం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వంలోని అనేకమంది ఉన్నతాధికారులు, సలహాదారులు రాజీనామాలు చేస్తున్నారు. యూజీసీ పరిస్థితి ఏమవుతుందో తెలియదు. ఆకాశవాణి బాగుపడింది కానీ, వారం వారం మోదీ ఉపన్యాస పటిమకు వేదికగా మారింది. ప్రధాని అయిన తొలిసారే దాదాపు రెండువేల కోట్లకుపైగా ఖర్చుచేసి 85 దేశాలు తిరిగిన నాయకుడు దేశ చరిత్రలో మొదటివారు మోదీయే కావచ్చు. వాటివల్ల కలిగిన ప్రయోజనం ఎంతన్నది ప్రశ్నార్థకం. అవినీతి గురించి ఆయనను ఎవరూ విమర్శించలేరన్న భావనను రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం మట్టిలో కలిపింది. మోదీ విధానాలు పై వర్గాలకు తప్ప ఎవరికీ ఉపయోగపడలేదన్న భావన బలపడుతూ వచ్చింది. అందుకే మోదీ పట్ల తిరస్కారం మొదలైంది. మూడు రాష్ట్రాల ఫలితాలు ఒక హెచ్చరిక. అంతకుముందు సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా ఆయన ఎదురు గాలిని ఎదుర్కొన్నారు. అందుకే ఆయనకు మూలాలు గుర్తొచ్చాయి. జనానికి ఏదో ఒకటి చేయాలని ఆలోచిస్తున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. రైతుబంధు, రుణమాఫీ వంటి నిర్ణయాలు చేస్తారని ఊహాగానాలు జరిగాయి. కానీ ఆయన ఆ విషయం పక్కనపెట్టి ఆగమేఘాలపై అగ్రవర్ణాల్లోని పేదలకు పది శాతం రిజర్వేషన్లు కలిపిస్తూ 124వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. ఎవరూ ఆలోచించుకొని ప్రతిఘటించే సమయం ఇవ్వకుండా ఆయన ఈ చట్టాన్ని తెచ్చారు. రాజస్థాన్, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గుజ్జర్లు, పాటిదార్లు, జాట్‌లు తమకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేస్తూ ఉద్యమాలు జరిపారు.

బహుశా అందుకు స్పందనగా మోదీ ఈ ఎత్తుగడ ముందుకు తెచ్చి ఉంటారు. ఇది ఎంతవరకు మోదీకి మేలు చేస్తుందన్నది చూడాలి. ఎందుకంటే అగ్రవర్ణ జనాభా దేశంలో ఎక్కడా పదిహేను నుంచి ఇరువై శాతానికి మించి లేదు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో అగ్రవర్ణాల జనాభా పదిహేడు శాతం మాత్రమే. అగ్రవర్ణాలు బీజేపీని వరించినా బీసీల మద్దతు లేకుండా ఉత్తరభారతాన్ని, మధ్య భారతాన్ని చేజిక్కించుకోవడం అంత సులువు కాదు. మోదీ రిజర్వేషన్లపై బీసీల్లో అనేక అనుమానాలు తలెత్తాయి. రెండేండ్ల క్రితం బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నదని విమర్శలు వచ్చాయి. ఇప్పుడా విమర్శలు వెనుకకుపోయినప్పటికీ మొత్తం రిజర్వేషన్లకు విరుగుడు మంత్రంగా ఈ అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు తెచ్చిందా అన్న అనుమానాలు మొదలయ్యాయి. బీసీలకు జనాభా దామాషాకు తగినట్టుగా రిజర్వేషన్లు ఇవ్వాలని ఇప్పటికే బీసీ సామాజిక వర్గాలు, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు డిమాండ్లు పెడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసి కేంద్రానికి పంపింది. ఎస్టీ రిజర్వేషన్లను కూడా పెంచాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపింది. పలు రాష్ట్రాలలో ఇవే డిమాండ్లు ఉన్నాయి. అసలు రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రాలకు వదిలేయాలని, పరిమితిని నిర్ణయించుకునే అధికారం కూడా రాష్ట్రాలకు ఇవ్వాలని వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు కోరుతున్నాయి. ఈ డిమాండ్లన్నింటికీ ప్రతిఘటనగా కేంద్రం ఈ అగ్రవర్ణ రిజర్వేషన్ల చట్టాన్ని తెచ్చి ఉంటుందని కొందరు మేధావులు వాదిస్తున్నారు. రాష్ట్రాలకు ఇప్పుడు ఈ కొత్త రిజర్వేషన్లపై ఏదో ఒక వైఖరి తీసుకోవలసిన పరిస్థితి. పార్లమెంట్‌లో ఈ రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణకు మద్దతు తెలుపుతూనే అనేక పార్టీలు తమ డిమాండ్లను గుర్తుచేశాయి. కొత్త చట్టానికి అనేక సవరణలు ప్రతిపాదించాయి. అయినా అవేవీ మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

మోదీకి ఇది రాజకీయంగా ఎంత ఉపయోగపడుతుందన్నది ఇప్పుడే చెప్పలేం. తమ రిజర్వేషన్లకు పోటీ పెడుతున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు భావిస్తే అది ఆయనకు మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టే అవకాశం ఉన్నది. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ప్రతిపక్షాలు ఒకే వేదికపైకి వచ్చి మోదీని ఇదే అంశంపై ప్రశ్నిస్తున్నాయి. అక్కడ పార్టీలన్నీ వివిధ సామాజిక వర్గాల సంఘటిత రూపాలే. ఈ రెండు రాష్ట్రాల్లో 2014 ఎన్నికల్లో బీజేపీ ఒక్కటే 93 లోక్‌సభ స్థానాలు గెల్చుకున్నది. ఆ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ విడివిడిగా పోటీ చేశాయి. అప్పట్లో ఉత్తరప్రదేశ్‌లో ఆ రెండు పార్టీలకు విడివిడిగా వచ్చిన మొత్తం ఓట్ల శాతం 42.12. బీజేపీ ఓట్ల శాతం 42.6. ఇప్పుడు సమీకరణలు మారిపోయాయి. రెండు పార్టీలు సంఘటితంగా పోటీచేసిన అన్ని లోక్‌సభ ఉప ఎన్నికల్లోనూ ఘన విజయం సాధించాయి. బీహార్‌లోనూ పరిస్థితి పూర్తి సవ్యంగా ఏమీ లేదు. అక్కడ రాజకీయ శక్తుల పునరేకీకరణ జరుగుతున్నది. ఉపేంద్ర కుశ్వాహా నాయకత్వంలోని లోక్‌సమతా పార్టీ ఎన్డీయే నుంచి వైదొలిగింది. బీహార్‌లో ఇప్పటికీ జేడీయూ-బీజేపీ బలంగా ఉన్నప్పటికీ, పోయిన ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యే అవకాశాలు తగ్గిపోయాయి. బీహార్‌లో గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పార్టీలకు 30కి పైగా లోక్‌సభ స్థానాలు దక్కాయి. అలాగే 91 లోక్‌సభ స్థానాలు కలిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లలో గత ఎన్నికల్లో బీజేపీ 88 స్థానాలు గెల్చుకున్నది. అంటే మొత్తం పై ఆరు పెద్ద రాష్ట్రాల్లో పోయినసారి బీజేపీ గెలిచిన స్థానాలు 181. దేశ వ్యాప్తంగా పార్టీకి వచ్చిన స్థానాలు 282. ఈ సారి భూమీ ఆకాశం ఏకం చేసినా ఆ ఆరు రాష్ట్రాల్లో ఇటువంటి ఏకపక్ష ఫలితాలు వచ్చే అవకాశాల్లేవు. స్థానిక ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకత వల్ల బీజేపీ ఓడిపోయిందని, నరేంద్ర మోదీ పాలనపై ప్రజలు అనుకూలంగా ఉన్నారని ఒక సూత్రీకరణ చేస్తున్నారు. కానీ లోక్‌సభ ఉప ఎన్నికలన్నీ మోదీపై తీర్పుగానే భావించాల్సి ఉంటుంది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలన్నీ బీజేపీకి వ్యతిరేకంగానే వచ్చాయి. మోదీ ప్రతిష్ఠ ఇప్పటికీ బ్రహ్మాండంగా ఉందని చెప్పడం కంటే రాహుల్‌గాంధీ ప్రతిష్ఠ జనంలో పెరిగిన అసంతృప్తికి తగినట్టుగా మెరుగుపడలేదని చెబితే వాస్తవికంగా ఉంటుంది.

> ఉన్నత న్యాయస్థానాల నియామకాలపై రచ్చ అందరికీ తెలిసిన విషయమే. తమకు ఇష్టం లేని వారి నియామకాన్ని మాసాల తరబడి ఆపడం, వేధించడం చూశాం. బ్యాంకులు, ఆర్బీఐ ఆగమాగం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వంలోని అనేకమంది ఉన్నతాధికారులు, సలహాదారులు రాజీనామాలు చేస్తున్నారు. యూజీసీ పరిస్థితి ఏమవుతుందో తెలియదు. ఆకాశవాణి బాగుపడింది కానీ, వారం వారం మోదీ ఉపన్యాస పటిమకు వేదికగా మారింది. ప్రధాని అయిన తొలిసారే దాదాపు రెండువేల కోట్లకుపైగా ఖర్చుచేసి 85 దేశాలు తిరిగిన నాయకుడు దేశ చరిత్రలో మొదటివారు మోదీయే కావచ్చు. వాటివల్ల కలిగిన ప్రయోజనం ఎంతన్నది ప్రశ్నార్థకం.



కట్టా శేఖర్‌రెడ్డి

kattashekar@gmail.com

ఆన్‌లైన్‌లో ప్రైవేట్ నిఘా

సామాజికం



దివిజ్ జోషి

2011 నాటి ఐటీ నిబంధనల స్థానంలో కొత్త 'ఐటీ (సంధానకర్త మార్గదర్శకాలు) నిబంధనలు (2018)' ప్రవేశపెట్టదలుచుకున్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ గత నెల 25వ తేదీన ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదాపై చర్చలు ప్రారంభమైనట్టు వెల్లడించింది. మంత్రిత్వ శాఖల మధ్య చర్చల తర్వాత ఫేస్‌బుక్, గూగుల్, యాహూ, వాట్సప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌తోనూ, సంధానకర్తలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలతోనూ చర్చలు సాగుతున్నట్టు తెలిపింది. ఇందుకు సంబంధించిన అన్నిపక్షాలతోనూ చర్చలు సాగించాలనుకుంటున్నామనీ, తమ అభిప్రాయాలను 2019 జనవరి 15లోగా సమర్పించాలని కోరింది.

ఆన్‌లైన్ సంధానసంస్థల (ఇంటర్మీడియరీస్)ను నియంత్రించే నిబంధనలు ఇప్పటికే అస్పష్టంగా ఉన్నాయి. ఇక ఇప్పుడు ఐటీ మంత్రిత్వ శాఖ ఇంటర్‌నెట్ కంపెనీలతో చర్చలను గోప్యంగా సాగిస్తున్నది. దీంతో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు ప్రజల భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే అధికారాలు ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా ఉంటాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. సోషల్ మీడియాను ఇప్పుడు వేధిస్తున్న సమస్యలు – అప్రజాస్వామికం, భద్రతారాహిత్యం. దీన్ని సవరించడానికి బదులు ప్రజల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై నిఘా వేసే, సెన్సార్ చేసే అధికారాన్ని శక్తిమంతమైన ప్రైవేట్ కంపెనీల చేతిలో పెట్టడం ప్రమాదకరం. ప్రభుత్వం వెంటనే అస్పష్టంగా ఉన్న ముసాయిదా నిబంధనలను ఉపసంహరించుకోవాలె.

ఐటీ చట్టంలోని 'సెక్షన్–79' సంధానకర్తలకు ఎంతో రక్షణ కల్పిస్తున్నది. టెలికం కంపెనీల వంటి సర్వీస్ ప్రొవైడర్లకు, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌కు వీరి సేవలను ఉపయోగించుకునేవారు (ఇతరులు) చేసే వ్యాఖ్యలకు సంబంధించిన బాధ్యత ఉండదు. ఈ సెక్షన్ 79 రక్షణ లేకపోతే, ఎవరైనా చట్టవ్యతిరేక కంటెంట్‌ను పోస్ట్ చేస్తే, ప్రభుత్వం ఈ సంధానసంస్థల (ఇంటర్మీడియరీస్)పై సివిల్ , క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. సంధానసంస్థలను కనుక బాధ్యులుగా చేస్తే, ఆ సంస్థలు చట్టపరమైన చర్యలనుంచి తప్పించుకోవడానికి నిఘా పెంచి కఠినంగా సెన్సార్ చేస్తాయి. దీనివల్ల ప్రజల భావస్వేచ్ఛపై ప్రైవేట్ సంస్థల నిఘా, కట్టడి ఏర్పడుతుంది. అయితే చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను అరికడుతాయనే హామీతో మాత్రమే సంధానసంస్థలకు 2011 నాటి మార్గదర్శక నిబంధనల ద్వారా ఈ 'సెక్షన్ 79' రక్షణ లభించింది. అయితే ఏయే అంశాలకు సంబంధించి ప్రైవేట్ సంస్థలు కట్టడి చేయాలనే విషయంలో స్పష్టత లేదు. దీనివల్ల ఈ సంస్థలు కఠినంగా వ్యవహరించడానికి ఆస్కారం ఏర్పడ్డది. దీంతో శ్రేయా సంఘాల్– భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఫేస్‌బుక్, గూగుల్ వంటి సంస్థలు తమ ప్లాట్‌ఫామ్స్‌పై వచ్చే కంటెంట్ చట్టబద్ధతను నిర్ధారించడం ప్రమాదకరమని భావించింది. న్యాయస్థానం లేదా సంబంధిత ప్రభుత్వ అనుమతి ఉండాలని నిర్దేశించింది.

తాజాగా ప్రభుత్వం వెల్లడించిన ముసాయిదా నిబంధనల వల్ల భావ స్వేచ్ఛపై ప్రైవేట్‌సంస్థల కట్టడి పెరిగిపోతుంది. ముసాయిదాలోని 3(9) నిబంధన ప్రకారం సంధానసంస్థ చట్టవిరుద్ధమైనదిగా భావించిన కంటెంట్‌ను గుర్తించి తొలిగించడానికి అవసరమైన సాంకేతిక 'ఆటోమేటెడ్ టూల్స్' ఉపయోగించవలసి ఉంటుంది. సమాచారం ఎవరి నుంచి వచ్చిందీ తెలుసుకొని వెల్లడించవలసి ఉంటుంది. ఈ సందర్భంగా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు ఎటువంటి రక్షణలు పొందుపరుచలేదు. దీనివల్ల గోప్యత హక్కు హరించుకపోతున్నది. ఇది రాజ్యాంగానికి, సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధం. ఈ ఆటోమేటెడ్ టూల్స్ చట్టవిరుద్ధమైన పోస్టులను వదిలి, చట్టబద్ధమైన వ్యక్తీకరణలను తొలిగించవచ్చు.



> ఫేస్‌బుక్, ట్విటర్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ తాము నిష్పాక్షికంగా ఉంటామని అంటాయి. కానీ ఏయే అం శాలను వడబోయాలె, సెన్సార్ చేయాలనే కాకుండా, వేటికి ప్రాధాన్యం ఇవ్వాలనే విషయంలో వీటి పాత్ర కీలకమైనది. ఫేస్‌బుక్ తప్పుదోవపట్టించే రాజకీయ ప్రకటనలకు ప్రాధాన్యం ఇచ్చింది. బలహీనవర్గాలపై దాడులకు సంబంధించిన అంశాలను ట్విటర్ కట్టడి చేయలే దు. అందువల్ల ఈ సంస్థలకు జవాబుదారీతనం లేని అధికారాలు అప్పగించకూడదు.

ఫేస్‌బుక్, ట్విటర్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ తాము నిష్పాక్షికంగా ఉంటామని అంటాయి. కానీ ఏయే అంశాలను వడబోయాలె, సెన్సార్ చేయాలనే కాకుండా, వేటికి ప్రాధాన్యం ఇవ్వాలనే విషయంలో వీటి పాత్ర కీలకమైనది. ఫేస్‌బుక్ తప్పుదోవపట్టించే రాజకీయ ప్రకటనలకు ప్రాధాన్యం ఇచ్చింది. బలహీనవర్గాలపై దాడులకు సంబంధించిన అంశాలను ట్విటర్ కట్టడి చేయలేదు. అందువల్ల ఈ సంస్థలకు జవాబుదారీతనం లేని అధికారాలు అప్పగించకూడదు. ప్రభుత్వం ముసాయిదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌కు పారదర్శకత, జవాబుదారీతనం పెంచేవిగా లేవు. ఈ సంస్థల విధానాల నుంచి సత్వర న్యాయపరమైన రక్షణ ఉండాలె. ఇవి ఎప్పటికప్పుడు పారదర్శకత నివేదికలు విడుదల చేయాలె. చట్టవిరుద్ధమైన, దౌర్జన్యపూరితమైన సమాచారాన్ని యూజర్లు వెంటనే సంధాన సంస్థల దృష్టికి తేవడానికి ఏర్పాటు ఉండాలె. కంటెంట్‌పై చర్యలకు సంబంధించి జవాబుదారీతనంతో వ్యవహరించే ఏర్పాటు ఉండాలె. చట్టవిరుద్ధమైన, హానికరమైన కంటెంట్‌ను కట్టడి చేయడంలో ఆన్‌లైన్ సమాజాలు ముందుండాలె తప్ప ప్రభుత్వం లేదా కంపెనీల అధికారులు కాదు.

ప్రజలు తమ అభిప్రాయాలను ఈ నెల 15వ తేదీ లోగా ఐటీ మంత్రిత్వ శాఖకు వెల్లడించాలె. నిఘాను, సెన్సార్‌షిప్‌ను వ్యతిరేకిస్తూ, ప్రజాస్వామిక ఆన్‌లైన్ సమాజాల కోసం గొంతు విప్పాలె.

(వ్యాసకర్త: బెంగళూరులోని విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీలో రిసెర్చి ఫెలో)

(సౌజన్యం: ది వైర్)




మీడియా బోగస్ వార్తలు అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్య అమెరికా మీడియా విషయంలో తప్పు కావచ్చు. కానీ భారతీయ మీడియాకు చక్కగా సరిపోతుంది.

మార్కండేయ ఖట్జూ



లక్నో వీధుల్లో బీఎస్పీ ఏనుగు ఎస్పీ సైకిల్‌పై సవారీ చేస్తుందని ఎప్పుడైనా ఊహించామా? బీజేపీ-వామపక్ష పొత్తు మినహాయిస్తే, ఎన్నికలలో ఏదైనా సాధ్యమే అనడానికి ఇంతకన్నా రుజువేం కావాలె!

రాజ్‌దీప్ సర్దేశాయి



నాయకుడు పార్టీని మించి పెద్దగా అవతరిస్తే, ఆ పార్టీ మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం కూడా దెబ్బతింటుంది. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ దెబ్బతిన్నది. ఇప్పుడు బీజేకి పట్టిన గతి అంతకన్నా భిన్నంగా లేదు. వ్యక్తిపూజ ఎక్కడ తలెత్తినా ప్రతిఘటించవలసిందే.

సుధీంద్ర కులకర్ణి



అన్నా హజారే/ఆప్/ఆరెస్సెస్.. అంతా కలిసి 2010-14లో కాంగ్రెస్ విశ్వసనీయతను దెబ్బకొట్టారు. ఈ లోగా నరేంద్ర మోదీ 'గుజరాత్ నమూనా' అంటూ తనదైన ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకున్నారు. 2014 పరిస్థితి ఇప్పుడు లేదు. రాహుల్ గాంధీ ఒకవైపు కేజ్రీవాల్ మాదిరిగా, మరోవైపు మోదీ మాదిరిగా వ్యవహరించగలరా?.

శేఖర్ గుప్తా

న్యాయం గెలుస్తుంది!

న్యాయం



తడకమళ్ళ మురళీధర్ రావు

న్యాయమూర్తి పదవి పూలపాన్పు కాదు. అరిటాకు–ముల్లు సామెతలోని అరిటాకులాంటిది. కేసుల తీర్పు విషయంలో సాక్ష్యాధారాల ఆధారంగా ఇరువర్గాల వారిని సంతృప్తి పరుచటం అసాధ్యం. ఈ ప్రక్రియ రాజీ ద్వారా లేదా లోక్ అదాలత్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కేసులో ఓడిపోయిన వారి ఆలోచనా దృక్పథం ఎప్పుడూ భిన్నంగా ఉంటుంది. సరైన సాక్ష్యాలు లేనందువల్లనో లేదా తాను ప్రవేశపెట్టిన సాక్ష్యాల ద్వారా న్యాయమూర్తిని మెప్పించలేకపోయాననో వివేచన ప్రస్తుత సమాజంలో లేదు. ఏదో జరిగి ఉంటుందని, గెలిచిన వాడు లంచమిచ్చి గెలిచాడనే అభిప్రాయం అభిలషణీయం కాదు.

ఒక వ్యక్తి 34 ఏండ్లకు జూనియర్ న్యాయాధికారి పదవి చేపట్టినట్లయితే, అతని పదవీవిరమణ దాకా వివిధ హోదాల్లో దినదిన గండంగా గడుపాల్సి వస్తుంది. ప్రతి కేసు ఒక ఛాలెంజ్. ముందు నుయ్యి, వెనుక గొయ్యి మాదిరిగా న్యాయార్థులు ఒకవైపు, వారి తరఫున వకాల్తా చేసే న్యాయవాదులొకవైపు, ఉన్నత న్యాయస్థానం పర్యవేక్షణ మరోవైపు. ఒక్కోసారి న్యాయం ఒకవైపు కనిపించినా, ప్రవేశపెట్టబడిన సాక్ష్యాధారాల ఆధారంగా తీర్పునివ్వాల్సి ఉంటుంది. ఆ సాక్ష్యాలు ఎందుకు నమ్మకూడదో తీర్పులో విశ్లేషించి కారణాలు రాయవల్సి ఉంటుంది. ముఖ్యంగా క్రిమినల్ కేసుల్లో ముద్దాయిపై కేసు కొట్టివేసినంత మాత్రాన అతడు నేరానికి పాల్పడలేదనడానికి వీల్లేదు. అదేవిధంగా శిక్షకు గురికాబడిన వారంతా దోషులనలేం. అందుకే వంద మంది దోషులను నిరపరాధులుగా తీర్పిచ్చినను, ఒక నిరపరాధిని దోషిగా తీర్పివ్వరాదనేది న్యాయపాలిక మూలసూత్రం.

వేలల్లో ఉండే కేసుల్లో రోజుకు 80 నుంచి 120 కేసుల దాకా పిలువడం, విచారణ జరుపడం, తీర్పులివ్వడం న్యాయమూర్తికి కత్తిమీద సాము. న్యాయార్థులు దూరప్రాంతాల నుంచి రావటం, తమ కేసు పిలుపు కోసం నిరీక్షించడం, చివరికి ఏదో ఒక కారణంగా వాయిదా పడటం మామూలైంది. దీనికి పరిష్కారం న్యాయవ్యవస్థలో సమూల మార్పులు రావడం. ఇరువర్గాలు తుది తీర్పును త్వరితగతిన పొందినప్పుడే న్యాయం జరిగినట్లు. దీనికి అన్నివర్గాలు చేయూతనివ్వాలి.

నేను మేజిస్ట్రేట్‌గా చేరిన కొన్ని నెలల్లోనే ఒక క్రిమినల్ కేసు వచ్చింది. దానిలోని ముగ్గురు ముద్దాయిల్లో ఇరువురు తప్పించుకున్నారు. వారిపై నాన్ బెయిలబుల్ వారంట్లు కూడా జారీ అయ్యాయి. మూడవ ముద్దాయి హైదరాబాద్‌లోని సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఏడాదికి పైగా ఉంటున్నాడు. కేసును పరిశీలించిన నేను, ముద్దాయిని వాయిదా రోజు హాజరుపరుచవలసిందిగా జైలు సూపరింటెండ్‌కు ఆదేశాలివ్వడం, అతనిని ప్రవేశపెట్టడం జరిగింది. కానీ మరో ఇద్దరు ముద్దాయిల్లేని కారణం చేత కేసును వాయిదా వెయ్యాలనుకుంటున్నాని రిమాండ్ ఖైదీకి చెప్పాను. అతను అమాంతం నేలమీద కూర్చొని, తాను రిమాండ్ ఖైదీగా ఏడాదిపైగా జైల్లో ఉన్నానని, తన కేసు విషయం తేల్చేదాకా కదిలే ప్రసక్తి లేదన్నాడు. నేను ఉద్యోగానికి కొత్త. రిమాండ్ ఖైదీ నేను చెప్పే విషయం వినిపించుకునే పరిస్థితుల్లో లేడు. నాకో ఆలోచన స్ఫురించింది. తప్పించుకున్న ఇద్దరు ముద్దాయిలను కేసు నుంచి వేరు చేస్తూ, రిమాండ్ ఖైదీకి ప్రభుత్వ ఖర్చులతో న్యాయవాదిని నియమిస్తూ, కేసు కాగితాలను అదేరోజు ఆ న్యాయవాదికి అందజేశాను. మరో రెండు నెలల్లో ఆ కేసు నుంచి రిమాండ్ ఖైదీని విముక్తి చేస్తూ తీర్పు చెప్పాను. కేసును పొడిగిస్తే, అనవసరంగా ఆ రిమాండ్ ఖైదీ రుజువు కాని నేరానికి జైల్లో మరికొంతకాలం గడుపవలసి ఉండేది.

న్యాయమూర్తికి చట్ట పరిజ్ఞానం మాత్రమే కాకుండా, విచక్షణ, సమయస్ఫూర్తి అవసరం. ఇరువురు న్యాయవాదులు హోరాహోరీగా గొడవపడే సందర్భాలెన్నో. అటువంటి సమయంలో ఓపిక, ఎవ్వరిని నొప్పివ్వక వాతావరణాన్ని చల్లబరిచే అవగాహన ముఖ్యం. కొన్నిసార్లు దోషులను రక్షించడానికి ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీ వారే కేసు పరిశోధనను నీరుగార్చవచ్చు. అప్పుడు బాధిత వ్యక్తికి న్యాయం జరుగదు. రికార్డ్ పరంగా కేసు ఓ రకంగా ఉంటే సాక్షులు కోర్టులో చెప్పే విషయాలు విరుద్ధంగా ఉంటాయి. దీంతో న్యాయమూర్తులు దోషిని గుర్తించినా, బలహీన లేదా విరుద్ధ సాక్ష్యాల కారణంగా నిర్దోషిగా ప్రకటించవలసి ఉంటుంది.

నేను అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా పనిచేసే రోజుల్లో ఒకకేసు విచారణలో సందిగ్ధ పరిస్థితులెదుర్కోవాల్సి వచ్చింది. ఒక పేద మైనర్ అమ్మాయి కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. తల్లి, మైనర్ తమ్ముడు ఆ వెదికినా కనిపించలేదు. దాదాపు మూడేండ్లు గడిచినవి. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు. మూడేండ్ల తర్వాత, ఆ అమ్మాయి తన తల్లికి ఫోన్ చేసి, తాను వేశ్య గృహంలో బంధింపబడ్డానని, విడిపించమని కోరింది. తల్లి, తమ్ముడు వెంటనే ఆ ఊరిలోని పోలీస్ స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు ఇవ్వడం, పోలీసువారు వేశ్య గృహంపై దాడి జరిపి అమ్మాయిని రక్షించి, వైద్య పరీక్షలు చేయించి, ఏడుగురిపై గ్యాంగ్ రేప్, లైంగిక దోపిడీ, అనైతిక అక్రమ రవాణా కింద కేసు రిజిష్టర్ చేయడం జరిగింది. ఆ కేసు మేజిస్ట్రేట్ కోర్టు నుంచి విచారణ నిమిత్తం నా కోర్టుకు వచ్చింది.

విచారణలో తెలిసిన విషయాలేమంటే, కాలేజీకి వెళ్లిన ఆ అమ్మాయిని ఒక ముద్దాయి మాయమాటలు చెప్పి, వరంగల్ నుంచి యాదగిరిగుట్టకు తీసుకపోవడం, ఇంకో ముద్దాయితో కలిసి లైంగిక దాడి చేయడం, ఆ తర్వాత మెదక్ జిల్లాలో వేశ్య వృత్తికి మూడో ముద్దాయికి అమ్మడం, కొంతకాలం తర్వాత జగిత్యాలలో నాలుగో ముద్దాయికి అమ్మడం, ఆ తర్వాత పడుపు వృత్తి చేయించడం కోసం వేములవాడలో వేరొకరికి అమ్మడం జరిగింది. ఈ విధంగా మూడేండ్లు గడిచినవి. ఆ అమ్మాయి అవకాశం చూసుకొని, తన దగ్గరికి వచ్చిన విటుని మొబైల్ ఫోన్ ద్వారా తల్లికి ఫోన్ చేసింది. దాదాపు 20 మంది సాక్షులను, 30 డాక్యుమెంట్లను ప్రవేశపెట్టడం జరిగింది. కానీ బలమైన సాక్ష్యం అమ్మాయిది, పోలీస్ అధికారులదే. దాదాపు రెండేండ్ల విచారణ తర్వాత, 12 లేక 18 మంది సాక్షులు ఎదురుతిరిగినను, అమ్మాయి సాక్ష్యం నిర్ధారణపరుస్తూ ఏడుగురు ముద్దాయిలకు కారాగార శిక్ష విధించాను. హృదయవిదారకమైన సాక్ష్యం వినేటప్పుడు కూడా న్యాయమూర్తి నిబ్బరాన్ని పాటించాలి. ఏ మాత్రం ఆందోళన కానీ, ప్రాసిక్యూషన్ కేసుకు మద్దతిస్తున్నట్లుగా కానీ ఉండకూడదు. నిష్పాక్షికతను ప్రదర్శించాల్సి ఉంటుంది.

ప్రతి న్యాయమూర్తికి తన పదవీకాలంలో ఎన్నోరకాల కేసులు, మనుషులు తటస్థపడుతుంటారు. న్యాయార్థులు, న్యాయవాదులు, సిబ్బంది అందరిని గమనిస్తూ విధులు నిర్వర్తించాలి. మంచి, చెడు అనేది ప్రతి వ్యవస్థలో ఉన్నది. ఏ ఒక్కరికో, వర్గానికో పరిమితం కాదు. న్యాయవ్యవస్థ దీనికి మినహాయింపు కాదు. కరుడుగట్టిన నేరస్తులను, తాను చేయని నేరానికి కేసులో ఇరికించబడ్డ వారిని ఒకే విధంగా నిష్పాక్షికంగా విచారించి న్యాయం చేయాలి.

న్యాయస్థానాల్లో దొంగ సాక్ష్యం చెప్పేవారు కూడా ఉంటారు. మనస్సును చంపుకొని ఒత్తిడి మూలాన కొందరు దొంగ సాక్ష్యం చెబితే, అవతలి వర్గం వారికి ఏదో విధంగా నష్టం కలుగజేయాలనే ఉద్దేశంతో దొంగసాక్ష్యం చెప్పేవారు మరికొందరు. అన్ని సందర్భాల్లో ఏది నిజమైన సాక్ష్యం, ఏది అబద్ధం సాక్ష్యం అని నిర్ధారించుకోవడం న్యాయమూర్తికి సులువు కాదు. అయితే సినిమాల్లో చూసినట్లుగా కోర్టులో దొంగ సాక్ష్యం చెప్పి, మనస్సాక్షిని చంపుకున్నందుకు తర్వాత ఒత్తిడికి గురయ్యేవారు తప్పక ఉంటారు. అటువంటి సందర్భం నిజ జీవితంలో న్యాయమూర్తి దృష్టికి రావడం అరుదనే చెప్పవచ్చు. అబద్ధపు సాక్ష్యం చెప్పిన సాక్షి ద్వారానే, తాను అబద్ధం చెప్పినట్లు న్యాయమూర్తికి తెలిస్తే, ఆ అబద్ధపు సాక్ష్యం వల్ల న్యాయం అందజేయడంలో ఏ విధమైన అన్యాయం జరుగలేదని తెలిస్తే ఎంతో మోదం. అటువంటి సంఘటన నాకు జరిగింది.

ఒక అమ్మాయి, అబ్బాయిపై తనను ప్రేమించాడని, పెండ్లి చేసుకుంటానని వాగ్దానం చేసి వేరొక అమ్మాయితో పెండ్లి నిశ్చయించుకున్నాడని, ఆ సందర్భాన్ని ప్రశ్నిస్తే తనపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడని కేసు పెట్టింది. అత్యాచార ప్రయత్నానికి సాక్షులుగా కొందరి పేర్లు పేర్కొన్నది. కేసు విచారణ సమయంలో ఒక సాక్షి తాను కెనడా ఆరు నెలల పాటు వెళ్తున్నట్లుగా, తన సాక్ష్యాన్ని త్వరగా నమోదు చేయవలసిందిగా కోర్టును అభ్యర్థించడం, నేను అతని కోరికను మన్నించడం జరిగింది. తాను లైంగికదాడి యత్నానికి సాక్షినని, ముద్దాయిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తే పారిపోయాడని చెప్పడం జరిగింది. కానీ నాకెందు కో ఆ సాక్ష్యం నమ్మబుద్ధి కాలేదు. వివిధ కారణాల చేత ఆ కేసులో ముద్దాయిని కేసు నుంచి విముక్తి చేస్తూ తీర్పుచెప్పిన మధ్యాహ్నామే పోస్టులో నాకొక సీల్డ్ కవర్ వచ్చింది. అది తెరిచిచూస్తే, కెనడా వెళ్తున్నానని చెప్పిన సాక్షి నుంచి. దాని సారాంశమేమిటంటే, తాను అమ్మాయి ప్రోద్బలం వల్ల అబద్ధం చెప్పినానని, ఎటువంటి సంఘటన చూడలేదని, తనను యేసు కూడా క్షమించడని. అతని సాక్ష్యం నమ్మి నేను శిక్ష ఖరారు చేసినట్లయితే, ఒక నిర్దోషికి అన్యాయం జరిగి ఉండేది.

> నాకెందుకో ఆ సాక్ష్యం నమ్మబుద్ధి కాలేదు. వివిధ కారణాల చేత ఆ కేసులో ముద్దాయిని కేసు నుంచి విముక్తి చేస్తూ తీర్పుచెప్పిన మధ్యాహ్నామే పోస్టులో నాకొక సీల్డ్ కవర్ వచ్చింది. అది తెరిచిచూస్తే, కెనడా వెళ్తున్నానని చెప్పిన సాక్షి నుంచి. దాని సారాంశమేమిటంటే, తాను అమ్మాయి ప్రోద్బలం వల్ల అబద్ధం చెప్పినానని, ఎటువంటి సంఘటన చూడలేదని, తనను యేసు కూడా క్షమించడని. అతని సాక్ష్యం నమ్మి నేను శిక్ష ఖరారు చేసినట్లయితే, ఒక నిర్దోషికి అన్యాయం జరిగి ఉండేది.

(వ్యాసకర్త: విశ్రాంత జిల్లా న్యాయమూర్తి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో భగీరథ పనులను పరిశీలిస్తున్న ఈటల

సేవాగుణం ఉన్నవారే సర్పంచ్‌గా పోటీచేయాలి

మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల సూచన

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: సేవాగుణం ఉన్నవారే సర్పంచ్‌గా పోటీచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కార్యకర్తలకు సూచించారు. పంతాలకు, పట్టింపులకు పోయి ఎన్నికల్లో పోటీచేసి అప్పులుపాలు కావద్దనీ సూచించారు. శనివారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఆయన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకుముందు బీసీ హాస్టల్, పాతవ్యవసాయ మార్కెట్‌లో రూ. 1.40 కోట్లతో నిర్మిస్తున్న రైతు బజార్, మిషన్ భగీరథ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం కైట్ ఫెస్టివల్‌ను ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. మానేరుతీరంలోని బతుకమ్మ ఘాట్ ఇందుకు వేదికైంది. హైదరాబాద్‌కు చెందిన కోహినూర్ కైట్ క్లబ్ సభ్యులు విభిన్న రకాల పతంగులను ప్రదర్శించగా పలువురు రకరకాల పతంగులను ఎగురవేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రాన్ని గీసి రంగులు అద్దిన తీరు అందరిని విశేషంగా ఆకట్టుకున్నది. ఈ వేడుకల్లో కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఎస్పీ రాహుల్‌హెగ్డే, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, కమిషనర్ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

-రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నమస్తే తెలంగాణ



వైభవంగా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు

పోలీస్ కమిషనర్ రవీందర్‌కు వృక్షప్రసాదం అందజేత

భీమదేవరపల్లి: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం వీరభద్రుడిని వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కోడె ప్రదక్షిణ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హరితప్రియుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి సీపీ రవీందర్‌కు వృక్షప్రసాదం పంపిణీ చేశారు.



మహబూబ్‌నగర్‌లోని టీడీ గుట్ట రైల్వే గేట్ వద్ద ఆర్వోబీకి నిధులు మంజూరు కావడంతో శనివారం రైల్వే అధికారులతో కలిసి మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్. -మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి

అవయవదానానికి ముందుకొచ్చిన ఎమ్మెల్యే బండ్ల

స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో నిర్ణయం



అవయదాన పత్రంపై సంతకం చేసి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

గద్వాల, నమస్తే తెలంగాణ: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్‌స్టాండ్ ఆవరణలో స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని వివేకానందా సేవాదళ్ ఆధ్వర్యంలో 'అవయదానం మహాదానం' అనే కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే బండ్ల ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అవయవదానం చేస్తున్నట్టు పత్రంపై సంతకం చేశారు.

అదే జోరు..

- రోజురోజుకూ పెరుగుతున్న ఏకగ్రీవాలు
- అభివృద్ధికే పట్టం కడుతున్న పల్లె ప్రజలు

గ్రామ స్వరాజ్యం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పల్లె ప్రజలు పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. రోజురోజుకూ వీటి సంఖ్య పెరుగుతున్నది. ఆయా గ్రామస్థులంతా ఒక్కతాటిపైకి వచ్చి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకుంటున్నారు. అభివృద్ధికి పెద్దపీట వేస్తారనే నమ్మకమున్న వారినే ప్రతిపాదిస్తున్నారు. అదీగాక ప్రోత్సాహక నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనే తపనతో ఏకగ్రీవాలకు మొగ్గు చూపుతున్నారు. శనివారం కూడా పెద్ద ఎత్తున పల్లె ప్రజలు ఏకగ్రీవాల బాటపట్టారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం సర్పంచ్ తండా నూతన సర్పంచ్‌గా మాలావత్ సర్య, ఇదే మండలం గడ్డమీది తండా సర్పంచ్‌గా భట్టు సుమలత, ఉపసర్పంచ్‌గా మల్లేశ్ ఎన్నికయ్యారు. అనంతరం వారు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఆయన వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. నందిపేట్ మండలం గాదేపల్లి సర్పంచ్ సహా పాలకవర్గం ఏకగ్రీవమైంది. సర్పంచ్ అభ్యర్థిత్వానికి మూడు నామినేషన్లు దాఖలు కాగా, నక్కల భూమేశ్‌కు పోటీగా ఉన్న నక్కల నర్సవ్వ, విక్రమ్‌రెడ్డి శనివారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నా రు. దీంతో నక్కల భూమేశ్ సర్పంచ్‌గా ఏకగ్రీవయ్యారు. గ్రామంలోని ఎనిమిది వార్డులు సైతం ఏకగ్రీవం కాగా వారంతా కలిసి ఉప సర్పంచ్‌గా మగ్గిడి విక్రమ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. భీమ్‌గల్ మండలం రూప్లా తండా, ఎంజీతండా, సంతోష్‌నగర్‌తండా, సుదర్శన్‌నగర్ తండా, తాల్లపల్లి తండాలు ఏకగ్రీవమయ్యాయి. వీరంతా శనివారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలువగా ఆయన వారిని సన్మానించారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో నూతనంగా ఏర్పడ్డ సుల్తాన్‌నగర్ సర్పంచ్‌గా అమీనాబీ, ఉప సర్పంచ్‌గా జూకంటి సాయవ్వను ఎన్నుకున్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పల్సి సర్పంచ్‌గా జాదవ్ త్రిత్రిబాయి, ఉప సర్పంచ్‌గా జాదవ్ సుభాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్ గ్రామ సర్పంచ్‌గా నూనవత్ శాంత, ఉప సర్పంచ్‌గా మిట్టపల్లి శంకర్, వార్డు సభ్యులుగా కుర్మ సుదర్శన్, బంటు పుష్ప, మలవాత్ లక్ష్మి, మలవాత్ యమున బాయి, మలవాత్ భీమా నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాలమూరులో..

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిన్నపల్లి సర్పంచ్‌గా దాడి సంగీత, ఉపసర్పంచ్‌గా విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం షాపూర్ సర్పంచ్‌గా రామాంజనేయులుగౌడ్ ఎన్నికయ్యారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం ఎమ్మెల్యే బాజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం సర్పంచ్ తండా గ్రామ సర్పంచ్ మాలావత్ సర్య

రెండు జీపీలు ఏకగ్రీవం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలంలోని రాఘవపట్నం, ముత్తాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గాలను స్థానికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాఘవపట్నం సర్పంచ్‌గా దబ్బకట్ల లలిత, వార్డు సభ్యులుగా ప్రతికంఠం ధరణి, కంటెం సునీత, బొమ్మినేని లలిత, పాయం స్వరూప, తుమ్మల గాంధీ, దనసరి గాంధీ, ముజీబా, పోలెబోయిన గంగయ్యలను ఎన్నుకున్నారు. ముత్తాపూర్ సర్పంచ్‌గా వంక నాగేంద్ర, వార్డు సభ్యులుగా వట్టం శేషమ్మ, అర్రెం రాజేశ్వరీ, దబ్బకట్ల కృష్ణ, వంక అర్జున్, కొట్టెం అమృత, పూనెం బుచ్చయ్యను ఎన్నుకున్నారు.



వనపర్తిలోని యాదవ కమ్యూనిటీ భవనంలో తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి క్రీడలు: విద్యార్థులు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వం, మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం స్వామి వివేకానంద 156వ జయంతిని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవ కమ్యూనిటీ భవనంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, క్రీడారంగంలో నైపుణ్యం సాధిస్తే స్పోర్ట్స్ కోటాలో క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఉన్న వివేకానందుడి విగ్రహానికి ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మానవజాతిలో గొప్ప తాత్వికుడు, మానవాళి అభ్యున్నతి కోసం తాత్విక భోధనలు చేసిన గొప్ప తత్వవేత్త స్వామి వివేకానందుడని కొనియాడారు.

అభ్యర్థుల ప్రతిపైసాకు లెక్క తప్పనిసరి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి
- సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్/ధర్మపురి,నమస్తేతెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారు ప్రచారం కోసం వెచ్చించే ప్రతి రూపాయిని అభ్యర్థుల ఖాతాలో జమయ్యేలా చూడాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీ నాగిరెడ్డి ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రతి గ్రామ పంచాయతీలో వ్యయ నమోదు షాడో రిజిష్టర్ నిర్వహించాలని సూచించారు. శనివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లాలో ఎన్నికల సన్నద్ధత, నామినేషన్ ప్రక్రియ తీరుపై కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఎస్పీ రాహుల్‌హెగ్డే, జేసీ యాస్మిన్‌బాషా, జిల్లా, మండల అధికారులతో చర్చించారు. అనంతరం జగిత్యాల జిల్లా ధర్మపురి న్యూటీటీడీ కల్యాణ మండపంలో ధర్మపురి, బుగ్గారం మండలాలకు సంబంధించి గ్రామ పంచాయతీ ఎన్నికలపై నిర్వహించిన పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ శరత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు బ్యాలెట్ పేపర్ కొరత లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛందంగా, పారదర్శకంగా ఏకగ్రీవాలు జరిగితేనే ఆమోదించాలన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి బందోబస్తు పెంచాలన్నారు.



సిరిసిల్ల కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ వెంకట్రామిరెడ్డి



అలిశెట్టి స్మారక పురస్కార గ్రహీతలతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

అలిశెట్టి కవిత్వం అజరామరం: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, నమస్తే తెలంగాణ: అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం అజరామరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్స్ గుండేటి రాజు ఆధ్వర్యంలో జగిత్యాల పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో శనివారం అలిశెట్టి స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకుముందు అలిశెట్టి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవయిత్రి అసోసియేట్ ప్రొఫెసర్ జ్యోత్స్నప్రభకు అలిశెట్టి స్మారక రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని, కవులు సునీత, శాంతకుమారి, శోభారాణి, సంగీతకు మహిళా సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ, రాజాపూర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు వదిలారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన మాడి పాపారావు (26), మాడి దుర్గారావు (25) ద్విచక్రవాహనంపై రామన్నగూడెం నుంచి వినాయకపురం వచ్చారు. అక్కడ పని చుసుకొని అశ్వారావుపేట వెళ్తుండగా రాజమండ్రి నుంచి భద్రాచలం వెళుతున్న ఆర్టీసీ బస్సు చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం సమీపంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో పాపారావు, దుర్గారావు అక్కడికక్కడే మృతిచెందారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, గౌతాపూర్ గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రబ్బాని (46) శనివారం గౌతాపూర్ గ్రామంలో విధులు ముగించుకొని బైక్‌పై వెళ్తుండగా.. రాజాపూర్‌వద్ద ప్రధానరహదారిపైకి రాగానే హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న మినీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రబ్బానికికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జడ్చర్ల దవాఖానకు తరలిస్తుండగా.. మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. రబ్బాని స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ ఇతడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీఆర్ఎస్ హయాంలోనే అన్ని మతాలకు సమానగౌరవం

సర్వధర్మ సమ్మేళనంలో మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి వెల్లడి

నారాయణపేట రూరల్: టీఆర్ఎస్ హయాంలో అన్ని మతాలకు సమానగౌరవం దక్కుతున్నదని ఎంపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలం కొల్లంపల్లిలోని ఖతాల్ హుస్సేని దర్గా ఆవరణలో ఉర్సు సందర్భంగా పీఠాధిపతి సయ్యద్ జలాల్ హుస్సేని ఆధ్వర్యంలో 16వ సర్వ ధర్మ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, సిద్ధిలింగేశ్వర మఠం పీఠాధిపతి పంచమ సిద్ధిలింగ మహాస్వామి, సత్యసందేశ కేంద్రం వ్యవస్థాపకుడు మౌలానా అబ్దుల్ నాసిర్ మజారే తదితరులు ఈ సమ్మేళనంలో ప్రార్థనలు చేశారు.



నారాయణపేట మండలం కొల్లంపల్లిలోని దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి

నలుగురికి ప్రాణదానం చేసిన యువకుడు



నర్సింహారావు (ఫైల్)

ముదిగొండ: తాను మరణించినా మరో నలుగురికి ప్రాణదానం చేశాడు ఓ యువకుడు. ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం యడవల్లికి చెందిన కూరపాటి నర్సింహారావు(37) ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు చెందిన ఓ వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈనెల 10న ద్విచక్రవాహనంపై గార్ల వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరగడంతో తలకు గాయమైంది. వెంటనే కోమాలోకి వెళ్లగా అతడిని ఖమ్మంలోని కిమ్స్ తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోదకు తరలించగా బ్రెయిన్ డెడ్‌తో శుక్రవారం మరణించాడు. నర్సింహారావు భార్య రాజేశ్వరీ అంగీకారం మేరకు జీవన్‌దాన్ తరఫున వైద్యులు గుండె, కాలేయం, కిడ్నీలు, కండ్లను సేకరించారు. పుట్టెడు దుఃఖంలోనూ రాజేశ్వరీ తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందించారు.



టీఆర్ఎస్‌లో చేరిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వాడ్యాల వాసులతో మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



టీఆర్ఎస్‌లో చేరిన కనగల్ మండలం కేపీతండా వాసులతో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



ఖమ్మం జిల్లా వైరాలో టీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే లావుడ్య రాములునాయక్

పిచ్చి కుక్క దాడిలో గాయపడ్డ చిన్నారి మృతి



సింధూజ

చింతలమానేపల్లి: పిచ్చికుక్క దాడిలో గాయపడి దవాఖానలో చికిత్సపొందుతూ ఓ చిన్నారి ప్రాణాలు వదిలింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బాబాసాగర్ గ్రామానికి చెందిన బక్రె మల్లేశ్ కూతురు శ్రీదేవి(3), జాడి తిరుపతి చిన్నకూతురైన సింధూజ(4) శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడగా.. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. సింధూజ (4) శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీదేవి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. సింధూజ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

టీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి చేరికల పర్వం కొనసాగుతున్నది. శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున టీఆర్ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా నాగారం, చివ్వెంల మండలలకు చెందిన 360 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం అచ్చమ్మకుంటతండాకు చెందిన 80 మంది దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో, మాడ్గులపల్లి మండలం గుర్రప్పగూడానికి చెందిన 100 మంది సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో, కనగల్ మండలం కేపీతండా చెందిన 100 మంది ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వాడ్యాల గ్రామానికి చెందిన 50 మంది జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో, మద్దూరు మండలం వీరారం గ్రామానికి చెందిన పలువురు కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో, వనపర్తి జిల్లా ఆత్మకూర్, పిన్నంచర్ల, మూలపల్ల, జూరాల గ్రామాలకు చెందిన 350 మంది, మహబూబ్‌నగర్ జిల్లా మాగనూర్ మండలం వడ్వాట్ గ్రామానికి చెందిన 200 మంది మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నంబావి మండలం చిన్నమారూర్‌కు చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కొల్లాపూర్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో, అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన 10 మంది అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, కల్వకుర్తి మండలం బెక్కర గ్రామానికి చెందిన 10 మంది కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో, జోగుళాంబ గద్వాల జిల్లా పూడూరు, కుర్వపల్లి గ్రామాలకు చెందిన 120 మంది ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా వేల్పూరు, మెండోరా మండలంలోని బుస్సాపూర్, మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన 100 మంది బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కొత్త కమలాపురం, కొణిజర్ల మండలంలోని బొడియాతండాకు చెందిన 200 కుటుంబాల వారు వైరా ఎమ్మెల్యే లావుడ్య రాములునాయక్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



టీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)

24 క్యారెట్లు	32,875
22 క్యారెట్లు	32,725
వెండి (కిలో)	39,850

చికెన్ ధరలు

(రూ.లలో)

ఫారం ధర	82.00
లైవ్ రిటైల్	104.00
డ్రెస్డ్	151.00
స్కిన్‌లెస్	172.00

నెక్ (వంద గుడ్లకు)

(రూ.లలో)

హైదరాబాద్	443-00
రంగారెడ్డి	443-00
మెదక్	443-00
కరీంనగర్	445-00
వరంగల్	445-00
రిటైల్ ప్రైస్	5-05

పెరుగుతున్న పెట్రో భారం

హైదరాబాద్: పెట్రో ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తిరిగి విజృంభిస్తుండటంతో.. ఆ ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడుతున్నది. ఈ క్రమంలోనే శనివారం లీటర్ పెట్రోల్ ధర హైదరాబాద్‌లో 20 పైసలు ఎగిసి రూ.73.47ను చేరింది. డీజిల్ ధర కూడా 32 పైసలు ఎగబాకి రూ.68.60ను తాకింది. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 19 పైసలు అందుకుని రూ.69.26 వద్దకు, డీజిల్ 29 పైసలు అందిపుచ్చుకుని రూ.63.10 వద్దకు చేరాయి. ఇక గడిచిన మూడు రోజుల్లో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర 80 పైసలు, డీజిల్ 94 పైసలు చొప్పున పెరిగాయి.



జూన్ నాటికి లాభాల్లోకి..

ఆరు నెలల్లో రూ.1,500 కోట్ల ఎన్‌పీఏల వసూళ్లు

సిండికేట్ బ్యాంక్ ఎండీ, సీఈవో మృత్యుంజయ్ మహాపాత్ర



హైదరాబాద్, జనవరి 12: మొండి బకాయిలతో సతమతమవుతున్న ప్రభుత్వరంగ బ్యాంకైన సిండికేట్ బ్యాంక్ వీటిని తగ్గించుకునేపనిలో పడింది. వీటిని వసూళ్లు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన బ్యాంక్..వచ్చే మూడు నుంచి ఆరు నెలలకాలంలో రూ.1,500 కోట్ల ఎన్‌పీఏలను రాబట్టాలనుకుంటున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. బ్యాంక్ చీఫ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొండి బకాయిదారులపై చర్యలను వేగవంతం చేయడానికి 1,200 మంది బ్యాంక్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చినట్లు, దీంతో జూన్ 30తో ముగిసేనాటికి బ్యాంక్ మళ్లీ లాభాల్లోకి వచ్చే అవకాశాలు మెండుగావున్నాయన్నారు. ఎంఎస్‌ఎంఈ, కార్పొరేట్ రంగాల్లో ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోకపోవడంతో 2018-19లో బ్యాంకింగ్ రంగ వృద్ధి 7-8 శాతానికి పరిమితం కానున్నదన్నారు. రుణాల వసూళ్లలో హైదరాబాద్ జోన్ ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, ఈ ఏడాది కూడా రెండంకెల వృద్ధి సాధించేదానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ..సంక్షేమ పథకాలకు పెద్దపీట వేయడంతోపాటు ఆదాయ పన్నును తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. తద్వారా వేతన జీవులకు ఎంతో ఊరట లభించనున్నదని తెలిపారు. అలాగే ఉద్యోగుల వాటా కొనుగోలు పథకం కింద రూ.500-600 కోట్ల వరకు నిధులను సేకరించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలు మార్గాల ద్వారా రూ.2,360 కోట్ల నిధులను సేకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. బ్యాంక్ మెరుగైన వృద్ధిని సాధించడానికి రిటైల్, ఎంఎస్‌ఎంఈ, హౌజింగ్, వ్యక్తిగత ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించినున్నట్లు చెప్పారు. దేశ ఆర్థిక పరిస్థితుల విషయానికి వస్తే ద్రవ్యలోటు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన..ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఏమి చెప్పాడో కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులేమి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

ఎలా వాడాలో తెలుసా?..

- చిప్ ఆధారిత డెబిట్, క్రెడిట్ కార్డులతో మారిన ఏటీఎం లావాదేవీల విధానం
- కంగారు పడితే కార్డుపోయే ప్రమాదం



హైదరాబాద్, జనవరి 12: ఏటీఎం లావాదేవీలను మరింత సురక్షితం చేయడంలో భాగంగా బ్యాంకులు చిప్ ఆధారిత డెబిట్, క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తెచ్చాయి. ఈ నెల 1 నుంచి ఈ కార్డులే పనిచేస్తాయని అంతకుముందు చాలా రోజుల నుంచే ఖాతాదారులకు సూచించిన బ్యాంకులు.. పాత కార్డులను కొత్త కార్డులతో మార్చుకోవాలని కూడా స్పష్టం చేశాయి. ఇప్పటికీ బ్యాంకుల నుంచి ఈ మేరకు మొబైల్ ఫోన్లకు సందేశాలు వస్తుండగా, మరిన్ని వివరాలకు సమీపంలోని శాఖలను సంప్రదించాలనీ బ్యాంకర్లు కోరుతున్నారు. ఈ క్రమంలో అసలు కొత్త కార్డుల ప్రత్యేకత ఏమిటీ? వాటిని ఎలా వినియోగించుకోవాలో ఒక్కసారి తెలుసుకుందామా..

అమాయక కస్టమర్లు సైబర్ మోసాలకు బలైపోతున్న నేపథ్యంలో చిప్ ఆధారిత డెబిట్, క్రెడిట్ కార్డులను పరిచయం చేసిన బ్యాంకర్లు.. అవి పూర్తిస్థాయిలో ఈ ఏడాది ఆరంభం నుంచి వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏటీఎం మిషన్లను వేగంగా ఆధునికీకరిస్తున్నారు. ఇప్పటికే చాలా ఏటీఎంలు మారిపోయాయి కూడా. అయితే కొత్త కార్డుల వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే సదరు కార్డులనే కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నది. అదెలాగంటే?..

కొత్తవి..

ఏటీఎం మిషన్లలో కనిపించే కార్డు స్లాట్‌లో కార్డు పెట్టగానే అది లాకైపోతుంది. కార్డు మనకు కనిపిస్తున్నప్పటికీ అప్‌గ్రేడ్ మిషన్‌లో వచ్చిన ప్రత్యేక ఏర్పాట్లు కార్డును గట్టిగా పట్టి ఉంచుతాయి. కాబట్టి కంగారుపడి కార్డును వెనుకకు తీసుకునే ప్రయత్నం అస్సలు చేయకండి. ఇక స్క్రీన్‌పై కనిపించే సూచనలతో మీ లావాదేవీని పూర్తి చేయండి. ఇంతకుముందులాగే కావాల్సిన సేవలను ఎంచుకని, సేవింగ్స్ ఖాతానా?.. కరెంట్ ఖాతానా? అని తెలియజేసి, నగదు ఉపసంహరణకైతే ఎంతకావాలో సదరు మొత్తాన్ని టైప్ చేయండి. వ్యక్తిగత పిన్ నంబర్‌ను అడిగినప్పుడు దాన్ని నమోదు చేయండి. అంతా అయిపోయాక కార్డును పట్టుకున్న అంతర్గత క్లిప్పులు వదులవుతాయి. అప్పుడు మన కార్డును మనం తీసేసుకోవచ్చు. లావాదేవీ జరుగుతున్నప్పుడు కార్డు స్లాట్‌లో ఎరుపు రంగు ఎల్‌ఈడీ లైట్ వెలుగుతూ కనిపిస్తుంది. పూర్తయ్యాక ఆ లైట్ ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అయితే అన్ని ఏటీఎంలలో ఈ రకమైన సదుపాయం ఉంటుందో?.. లేదో?.. చెప్పలేం. కాబట్టి జాగ్రత్తగా స్క్రీన్‌పైనున్న సూచనలను పాటించండి. ఇక దుకాణాలు, షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు తదితర చోట్ల డెబిట్, క్రెడిట్ కార్డులను ప్రస్తుత కొత్త రకం ఏటీఎంల తరహాలోనే వాడుతున్న విషయం తెలిసిందే. ఆ కస్టమర్లకు తాజా మార్పు పెద్ద తేడాగా కనిపించకపోవచ్చు.

పాతవి..

వివిధ ఏటీఎంలలో మూడు రకాలుగా పాత కార్డులను వినియోగించడం మనం చూశాం. మొదటిది ఏటీఎం మిషన్ కార్డు స్లాట్‌లో కార్డును పెట్టి, వెంటనే తీయడం. ఆ తర్వాత స్క్రీన్‌పై కనిపించే సూచనలతో వ్యక్తిగత పిన్ నెంబర్‌ను వినియోగించి నగదు ఉపసంహరణ, లేదా ఇతర సేవలను పొందడం జరిగింది. రెండోది ఏటీఎం మిషన్ లోని కార్డు స్లాట్‌లో కార్డును పెడితే, అది లోపలికి వెళ్లి కొద్ది సెకండ్ల తర్వాత బయటకు వచ్చేది. కార్డును తీసుకున్న అనంతరం స్క్రీన్‌పై కనిపించే సూచనలతో మన పిన్ నెంబర్ ఆధారంగా క్యాష్ విత్‌డ్రా, ఇతర సర్వీసులను అందుకున్నాం. మూడోది ఏటీఎం మిషన్‌లోగల కార్డు స్లాట్‌లో కార్డును పెట్టిన తర్వాత అది లోపలికి వెళ్లి.. మొత్తం మన లావాదేవీలు (నగదు ఉపసంహరణ లేదా ఇతరత్రా సేవలు) పూర్తయ్యాకగానీ వచ్చేదికాదు.

తొందర పడ్డారో..

అరె ప్రతిసారీ వచ్చే ఏటీఎం.. నిన్న, మొన్నటి దాకా కార్డు పెట్టి తీశాం.. కార్డు వెనుకకుపోయి తిరిగి వచ్చేది.. ఇప్పుడు రావట్లేదేంటి?.. అనుకొని కంగారుపడవద్దు. ఒకవేళ కొత్త విధానం గురించి తెలియకపోయినట్లైతే ఏటీఎం గార్డులను వివరాలు అడుగండి. లేదంటే జాగ్రత్తగా స్క్రీన్‌పై ఉన్న సూచనలను పాటించండి. ఇంకా భయమేస్తే క్లియర్ లేదా క్యాన్సిల్ బటన్లను నొక్కండి. మీ కార్డు మీ చేతికి తిరిగి వస్తుంది. అలా కాకుండా కార్డును బలవంతంగా లాగే ప్రయత్నం చేస్తే కార్డు పాడైపోయే వీలున్నది. ప్రధానంగా కార్డులోని చిప్ వద్ద విరిగిపోయే అవకాశం ఉన్నది. ఆ తర్వాత మరోసారి కార్డును వినియోగించలేని పరిస్థితి. అదనపు రుసుమును చెల్లించి బ్యాంకు నుంచి కొత్త కార్డును తీసుకోవాల్సిందే.

డీ-మార్ట్ లాభంలో స్వల్ప వృద్ధి



న్యూఢిల్లీ, జనవరి 12: డీ-మార్ట్ పేరుతో రిటైల్ విక్రయ కేంద్రాలను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్ట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికి సంస్థ రూ.257 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.252 కోట్ల లాభంతో పోలిస్తే 2.1 శాతం పెరిగిందని సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో నిర్వహణ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 33.2 శాతం పెరిగి రూ.5,451 కోట్లకు చేరుకున్నది. ప్రతి షేరుపై రూ.4.12 ఆర్జించినట్లు అయింది. గడిచిన త్రైమాసికంలో కేవలం నాలుగు స్టోర్లను మాత్రమే సంస్థ ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ నెవిల్లీ నోరోన్హా మాట్లాడుతూ..ఫలితాలు అంచనావేసిన స్థాయిలోనే నమోదయ్యాయని, పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం ఫ్లాట్‌గా ముగిసినప్పటికీ గతేడాదితో పోలిస్తే మెరుగ్గానే ఉన్నదని, పలు వస్తువుల ధరలను తగ్గించడంతో మార్జిన్లపై ప్రభావం చూపాయన్నారు. డిసెంబర్ చివరినాటికి సంస్థ 164 రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేసింది.

పెరిగిన ఎయిర్ ఇండియా ఆదాయం

మూడో త్రైమాసికంలో 20 శాతం వృద్ధి



న్యూఢిల్లీ, జనవరి 12: ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయంలో వృద్ధి నమోదైంది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 20 శాతం పెరిగి రూ.5,538 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. క్రితం ఏడాది ఇదే సమయంలో ఆదాయం రూ.4,615 కోట్లుగా ఉన్నది. ప్రయాణికుల సంఖ్య కూడా 53.28 లక్షల నుంచి 55.27 లక్షలకు పెరిగింది. నష్టాల్లో నడుస్తున్న ఎయిర్ ఇండియాకు ప్రస్తుతం రూ.48 వేల కోట్ల అప్పు ఉన్నది. దీనిని తగ్గించుకునే ఉద్దేశంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సంస్థలో వ్యూహాత్మక వాటాను విక్రయించనున్నట్లు ప్రకటించినప్పటికీ ఏ ఒక్క సంస్థ కూడా ముందుకు రాలేదు. కాగా, మూడో త్రైమాసికంలో సంస్థ మరో 15 నూతన విమానాలతో సేవలను ఆరంభించింది. ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు మాట్లాడుతూ.. రుణాలను తగ్గించుకోవడానికి ఈ మాత్రం ఆదాయం సరిపోదని, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో 65 శాతం అంతర్జాతీయ రూట్ల నుంచి రాగా, మిగతా 35 శాతం దేశీయంగా సర్వీసులు అందించడం వల్ల సమకూరింది. రుణాలపై వడ్డీలు రోజురోజుకు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన.. ఈ స్వల్ప ఆదాయంతో లాభాల్లోకి రావడం కలే అని వ్యాఖ్యానించడం గమనార్హం. 2007 నుంచి ఇప్పటి వరకు సంస్థ నష్టాలనే ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీ చేతిలో 122 విమానాలున్నాయి.

పేరు మారిన ఐడీఎఫ్‌సీ బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 12: ప్రైవేట్ రంగ సంస్థ ఐడీఎఫ్‌సీ బ్యాంక్..తన పేరును ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా మార్చుకున్నది. ఈ మార్పు శనివారం నుంచి అమలులోకి వచ్చినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందుకు సంబంధించి రిజిస్టార్ ఆఫ్ కంపెనీ, చెన్నై ప్రత్యేక సర్టిఫికేట్‌ను జారీ చేసింది కూడా.

యెస్ బ్యాంక్ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బ్రహ్మదత్



న్యూఢిల్లీ, జనవరి 12: దేశంలో నాలుగో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకైన యెస్ బ్యాంక్ నాన్-ఎగ్జిక్యూటివ్ తాత్కాలిక చైర్మన్‌గా బ్రహ్మదత్‌ను నియమించుకున్నది. ఈ నియామకం వెంటనే అమలులోకి రానున్నది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 చట్టం ప్రకారం తాత్కాలిక చైర్మన్‌గా నియమితులైన దత్..ఈ పదవిలో జూలై 4, 2020 వరకు ఉండనున్నారు. జూలై 2013 నుంచి ఆయన ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారని బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. దీంతోపాటు ప్రస్తుతం ఆయన నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు కూడా. ఆయనతోపాటు యెస్ బ్యాంక్ బోర్డులో ముకేశ్ సభర్వాల్, సుభాష్ కాలియా, అజయ్ కుమార్, ప్రతిమా, ఉత్తమ్ ప్రకాశ్ అగర్వాల్, టీఎస్ విజయన్, రాణా కపూర్(బ్యాంక్ ఎండీ, సీఈవో)లు ఉన్నారు.

కొనుగోలుదారులే డెవలపర్లను నిలదీయాలి!

రెరా రిజిస్ట్రేషన్ నంబర్ తెలుసుకున్నాకే ప్లాట్లు, ఫ్లాట్లను కొనాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ రంగంలో పారదర్శకత నెలకొల్పడానికి ప్రయత్నిస్తుంటే.. కొందరు రియల్టర్లు 'రెరా' అనుమతి తీసుకోకుండానే ప్లాట్లను విక్రయిస్తున్నారని రెరా అథారిటీ దృష్టికి వచ్చింది. అలాంటి ప్రాజెక్టుల్లో ప్లాట్లు, ఫ్లాట్లు కొనేవారు ముందుచూపుతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. 'రెరా' వద్ద నమోదు చేయకుండా ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయించే డెవలపర్లపై కఠిన చర్యల్ని తీసుకుంటామని తెలంగాణ రెరా అథారిటీ హెచ్చరించింది. ఒకవేళ డెవలపర్లు రెరా అనుమతి లేకుండా ప్లాట్లు, ఫ్లాట్ల అమ్మకానికి పెడితే.. వాటిలో కొనడానికి నిరాకరించాలని సూచించింది. సదరు రియల్టర్‌ని రెరాలో రిజిస్టర్ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరుతున్నది. ప్లాట్లు, ఫ్లాట్లు కొనే ప్రతిఒక్కరూ 'రెరా' రిజిస్ట్రేషన్ నంబర్‌ని డెవలపర్ వద్ద అడిగి తెలుసుకోవాలని రెరా అథారిటీ తెలియజేసింది. తమ కష్టార్జితం బూడిదపాలు కాకూడదని భావించే ప్రతిఒక్కరూ.. ప్లాటు లేదా ఫ్లాటు కొనేటప్పుడు.. rera.telangana.gov.inలో అట్టి ప్రాజెక్టు రిజిస్టర్ అయ్యిందా? లేదా? అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవాలని సూచించింది. అప్పుడే, స్థిర నివాసానికి సంబంధించి తుది నిర్ణయం తీసుకోవాలని అంటున్నది. వాణిజ్య భవనాలు, మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్ని కట్టేవారు రెరాలో రిజిస్టర్ చేసుకోవాలని అభ్యర్థించింది.

ధోనీ @ 10000



ధోనీ (51)

భారత సీనియర్ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. తన అసమాన నాయకత్వశైలి, బ్యాటింగ్ నైపుణ్యంతో జట్టుకు చిరస్మరణీయ విజయాలందించిన ధోనీ అరుదైన రికార్డును అందుకున్నాడు. వన్డేల్లో పదివేల పరుగుల మైలురాయిని చేరుకున్న ఐదో భారత బ్యాట్స్‌మన్‌గా మహీ రికార్డుల్లోకెక్కాడు. శనివారం ఆస్ట్రేలియాతో తొలి వన్డే మ్యాచ్‌లో ఈ ఫీట్ అందుకున్నాడు. వాస్తవానికి 10వేల పరుగులను 2017లోనే అందుకున్నా..అందులో ఆసియా ఎలెవన్ తరఫున 174 పరుగులు ఉండటంతో రికార్డు పూర్తి కాలేదు. తాజా ప్రదర్శనతో సచిన్, గంగూలీ, ద్రవిడ్, కోహ్లీ తర్వాత ధోనీ నిలిచాడు. ఓవరాల్‌గా ఈ రికార్డు అందుకున్న 13వ క్రికెటరయ్యాడు.





బంతిని విసిరి టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

క్రీడాభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట

64వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్

ప్రారంభించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: క్రీడాకారులకు, క్రీడల మౌళిక వసతుల ఏర్పాట్లపై పభుత్వం ప్రత్యేక శద్ధ పెడుతుందని, సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేట మినీ స్టేడియంలో అండర్ - 17 విభాగంలో 64వ జాతీయ స్థాయి బాల బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు జార్ఖండ్‌పై విజయం సాధించగా.. బాలికల విభాగంలో ఉత్తరాఖండ్ జట్టుపై నెగ్గి టోర్నీలో శుభారంభం చేశాయి.

భారత్‌కు భంగపాటు ఎదురైంది. టెస్ట్ సిరీస్ విజయమిచ్చిన జోష్‌తో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో పోరుకు దిగిన కోహ్లీసేనకు కంగారూలు షాక్ ఇచ్చారు. భారీ స్కోరు కాకుండా బౌలర్లు అడ్డుకున్నా..పరుగుల వరద పారిస్తారనుకున్న బ్యాట్స్‌మెన్ కుదేలవడంతో టీమ్ఇండియాకు బోణీ దక్కలేదు. బెహ్రెన్‌డార్ఫ్, రిచర్డ్‌సన్ విజృంభణతో టాపార్డర్ కకావికలం కాగా, రోహిత్‌శర్మ శతక్కొట్టినా లాభం లేకపోయింది. ధోనీ అండతో జట్టును గెలిపించేందుకు కడదాకా ప్రయత్నం చేసినా సహచరుల సహకారలేమితో ఓటమివైపు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 0-1తో వెనుకంజలో నిలిచింది. ప్రపంచకప్ సన్నాహాలు మొదలుపెట్టిన భారత్‌కు ఆశించిన ఫలితం దక్కకుండాపోగా, టెస్ట్ సిరీస్ ఓటమి నైరాశ్యంలో ఉన్న ఆసీస్ జట్టులో సిడ్నీ గెలుపు కొత్త ఊపుతెచ్చింది.

శర్మ శతక్కొట్టినా..

భారత్‌కు దక్కని బోణీ ■ రోహిత్ సెంచరీ పోరాటం వృథా
రిచర్డ్‌సన్, బెహ్రెన్‌డార్ఫ్ విజృంభణ ■ సిరీస్‌లో ఆసీస్ ముందంజ

సిడ్నీ: ప్రపంచకప్ టోర్నీకి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్న భారత్‌కు ఆశించిన ఫలితం దక్కలేదు. సుదీర్ఘ కలను సాకారం చేసుకుంటూ వన్డే సిరీస్‌లోకి ప్రవేశించిన టీమ్ఇండియాకు సిడ్నీలో చేదు అనుభవం ఎదురైంది. శనివారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో కోహ్లీసేన 34 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఆసీస్ నిర్దేశించిన 289 పరుగుల లక్ష్యఛేదనలో రిచర్డ్‌సన్(4/26), బెహ్రెన్‌డార్ఫ్(2/39) ధాటికి టీమ్ఇండియా 254/9 స్కోరు చేసింది. రోహిత్‌శర్మ(129 బంతుల్లో 133, 10ఫోర్లు, 6సిక్స్‌లు) సూపర్ సెంచరీతో కదం తొక్కగా, ధోనీ(96 బంతుల్లో 51, 3ఫోర్లు, సిక్స్) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వీరిద్దరు మినహా మిగతా అందరూ విఫలమయ్యారు. ఆఖర్లో భువనేశ్వర్(23 బంతుల్లో 29 నాటౌట్, 4ఫోర్లు) బౌండరీలతో అదరగొట్టాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 288 పరుగులు చేసింది. హ్యాండ్స్‌కోంబ్(73), ఖవాజ(59), షాన్ మార్ష్(54) అర్ధసెంచరీలతో రాణించడంతో కంగారూలకు మెరుగైన స్కోరు దక్కింది. కుల్దీప్ యాదవ్(2/54), భువనేశ్వర్(2/66) రెండేసి వికెట్లు తీయగా, జడేజా(1/48)కు ఒక వికెట్ దక్కింది. నాలుగు వికెట్లతో రాణించిన రిచర్డ్‌సన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఈనెల 15న అడిలైడ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

1/1, 2/4, 3/4:

భారత వికెట్ల పతనమిది. ఆసీస్ నిర్దేశించిన లక్ష్యఛేదనకు దిగిన టీమ్ఇండియాకు ఆదిలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. బెహ్రెన్‌డార్ఫ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ ఆఖరి బంతికి ధవన్(0) వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. ఆ తర్వాత కెప్టెన్ కోహ్లీ(3) వంతు. రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన కోహ్లీ..ఫార్వర్డ్ స్క్వేర్‌లో స్టొయినిస్ చేతికి చిక్కాడు. బంతి తేడాతో రాయుడు(0) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. తన ఔట్‌పై డీఆర్‌ఎస్‌కు వెళ్లిన రాయుడికి నిరాశే ఎదురైంది. దీంతో టీమ్ఇండియా 11 బంతుల తేడాతో మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది.

రోహిత్ సెంచరీ:

ధోనీ ఔట్ తర్వాత బ్యాటింగ్ భారం రోహిత్‌పై పడింది. ఓవైపు సాధించాల్సిన రన్‌రేట్ అంతకంతకు పెరుగుతుండటం ఒత్తిడిని పెంచింది. అండగా నిలుస్తాడనుకున్న కార్తీక్(12) నిరాశపరుచడం..భారత విజయావకాశాలను దెబ్బతీసింది. రిచర్డ్‌సన్ ఇన్నింగ్స్ 40వ ఓవర్లో షాట్ ఆడబోయిన కార్తీక్..ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. రెండు బంతుల తేడాతో రోహిత్ తన వన్డే కెరీర్‌లో 22వ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. సెంచరీ తర్వాత రోహిత్ గేర్ మార్చాడు. ఓవైపు సాధించాల్సిన పరుగులు పెరుగుతుండటం, బంతులు తక్కువ కావడంతో దూకుడుగా ఆడేందుకు రోహిత్ ప్రయత్నించాడు. సాఫీగా సాగుతున్న క్రమంలో జడేజాను రిచర్డ్‌సన్ ఔట్ చేయడంతో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. ఆ తర్వాత రోహిత్ పెవిలియన్ చేరడంతో భారత్ ఓటమి ఖరారైంది.

చక్కదిద్దిన శర్మ, ధోనీ

మూడు వికెట్లు కోల్పోయి గెలుపుపై ఆశలు అడుగంటిన వేళ రోహిత్‌శర్మ, ధోనీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు క్రీజులో కుదురుకోవడానికి ప్రయత్నిస్తూ పరుగులు సాధించే పనిలోపడ్డారు. ఆసీస్ బౌలర్లు అదేపనిగా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పది ఓవర్లు ముగిసేసరికి భారత్ 3 వికెట్ల నష్టానికి 21 పరుగులకే పరిమితమైంది. చెత్త షాట్లకు పోకుండా ఆడేందుకు ప్రయత్నించడంతో స్కోరుబోర్డు మందకోడిగా ముందుకుసాగింది. ఓవైపు రోహిత్ అడపాదడపా బౌండరీలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసినా..మరోవైపు సీనియర్ ధోనీ బంతులను వృథా చేస్తూ పరుగులు చేయడంలో ఘోరంగా తడబడ్డాడు. ఈ క్రమంలో రోహిత్ బౌండరీ సహాయంతో 62 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. 29వ ఓవర్ నుంచి రోహిత్ గేర్ మార్చాడు. బెహ్రెన్‌డార్ఫ్ బౌలింగ్‌లో ధోనీ వికెట్ల ముందు దొరకడం, అంపైర్ ఔటివ్వడం చకచకా అయిపోయాయి. అయితే రివ్యూలో బంతి ఔట్‌సైడ్ లెగ్‌స్టంప్ దిశగా వచ్చినట్లు కనిపించినా సమీక్షకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ధోనీ నిష్క్రమించాల్సి వచ్చింది. దీంతో నాలుగో వికెట్‌కు 137 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.

ఆసీస్ సమిష్టిగా



తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు ఆదిలోనే కెప్టెన్ ఫించ్(6) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. భువనేశ్వర్ ఇన్నింగ్స్ మూడో ఓవర్లో రిటర్న్ క్యాచ్‌తో ఫించ్ మొదటి వికెట్‌గా వెనుదిరిగాడు. ఉస్మాన్ ఖవాజ(59)తో కలిసి అలెక్స్ క్యారీ(24) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. అయితే చైనామన్ కుల్దీప్ యాదవ్ తొలి ఓవర్లోనే క్యారీ రోహిత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత ఖవాజ, షాన్ మార్ష్ నింపాదిగా బ్యాటింగ్ చేస్తూ పరుగులు కొల్లగొట్టారు. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న సమయంలో ఖవాజను జడేజా ఎల్బీడబ్ల్యూ చేయడం ద్వారా ఈ జోడీని విడగొట్టాడు. దీంతో మూడో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఓవైపు వికెట్లు పడుతున్నా..ఆసీస్ బ్యాట్స్‌మెన్ తమ జోరు తగ్గించలేదు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టే ప్రయత్నం చేశారు. హ్యాండ్స్‌కోంబ్‌తో కలిసి మార్ష్ నాలుగో వికెట్‌కు 53 పరుగులు జోడించాడు. ఎక్కడా ఇన్నింగ్స్ జోరు తగ్గించని ఆసీస్‌కు ఆఖర్లో హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్ కీలక పరుగులు జతచేశారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 68 పరుగులు జోడించి జట్టుకు పోరాడే స్కోరు కట్టబెట్టారు. భారత యువ పేసర్ ఖలీల్ అహ్మద్ లయను దొరకబుచ్చుకోవడంలో విఫలమయ్యాడు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: అలెక్స్ క్యారీ(సి)రోహిత్‌శర్మ(బి)కుల్దీప్ యాదవ్ 24, ఫించ్(బి)భువనేశ్వర్ 6, ఖవాజ(ఎల్బీ)జడేజా 59, షాన్‌మార్ష్(సి)షమీ(బి)కుల్దీప్‌యాదవ్ 54, హ్యాండ్స్‌కోంబ్(సి)ధవన్(బి)భువనేశ్వర్ 73, స్టొయినిస్ 47 నాటౌట్, మ్యాక్స్‌వెల్ 11 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 14; **మొత్తం:** 50 ఓవర్లలో 288/5; **వికెట్ల పతనం:** 1-8, 2-41, 3-133, 4-186, 5-254; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-66-2, ఖలీల్ అహ్మద్ 8-0-55-0, షమీ 10-0-46-0, కుల్దీప్ 10-0-54-2, జడేజా 10-0-48-1, రాయుడు 2-0-13-0.

భారత్: రోహిత్‌శర్మ(సి)మ్యాక్స్‌వెల్(బి)స్టొయినిస్ 133, ధవన్(ఎల్బీ)బెహ్రెన్‌డార్ఫ్ 0, కోహ్లీ(సి)స్టొయినిస్(బి)రిచర్డ్‌సన్ 3, రాయుడు(ఎల్బీ)రిచర్డ్‌సన్ 0, ధోనీ(ఎల్బీ) బెహ్రెన్‌డార్ఫ్ 51, కార్తీక్(బి)రిచర్డ్‌సన్ 12, జడేజా(సి)మార్ష్(బి) రిచర్డ్‌సన్ 8, భువనేశ్వర్ 29 నాటౌట్, కుల్దీప్ యాదవ్(సి)ఖవాజ(బి)సిడిల్ 3, షమీ(సి)మ్యాక్స్‌వెల్(బి)స్టొయినిస్ 1; **ఎక్స్‌ట్రాలు:** 14; **మొత్తం:** 50 ఓవర్లలో 254/9; **వికెట్ల పతనం:** 1-1, 2-4, 3-4, 4-141, 5-176, 6-213, 7-221, 8-247, 9-254; **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 10-2-39-2, రిచర్డ్‌సన్ 10-2-26-4, సిడిల్ 8-0-48-1, లియాన్ 10-1-50-0, స్టొయినిస్ 10-0-66-2, మ్యాక్స్‌వెల్ 2-0-18-0.

మళ్లీ హిట్



రోహిత్‌శర్మ (133)

టీమ్ ఇండియాలో రోహిత్‌శర్మ ప్రత్యేకం.. హిట్‌మ్యాన్ అంటూ అభిమానులంతా ముద్దుగా పిలుచుకునే సొగసరి ఓపెనర్ పొట్టి ఫార్మాట్‌లో ఎదురులేని బ్యాట్స్‌మన్.. క్రీజులో కుదురుకున్నాడంటే విలయం.. సిక్సర్లు బాదడం ఇంత తేలికా.. బౌండరీలు కొట్టడం ఇంత సులువా అనిపించేలా అతని షాట్లు మనల్ని మంత్రముగ్ధులను చేస్తాయి.. క్రీజులో కుదురుకుంటే చాలు.. అతని చేతిలోని బ్యాట్ మంత్రదండాన్ని తలపిస్తూ పరుగుల ప్రవాహాన్ని సృష్టిస్తుంది.. వేదిక ఏదైనా..పిచ్ ఎలాంటిదైనా .. బౌలర్ ఎవరైనా సరే అతని ముందు బలాదూరే! 2015 నుంచి ప్రతి ఏడాది భారత్ తరఫున తొలి వన్డే సెంచరీ అతనిదే.. నాలుగేండ్ల ఆనవాయితీని కొనసాగిస్తూ.. ఈ ఏడాదీ వన్డే ఫార్మాట్‌లో టీమ్ ఇండియా తరఫున తొలిసెంచరీ నమోదు చేశాడు.. ఆస్ట్రేలియా గడ్డపై నాలుగు వన్డే శతకాలు సాధించిన తొలి విదేశీ ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు.

సిడ్నీ క్రికెట్ మైదానంలో రోహిత్ శర్మ మరోమారు చెలరేగాడు. సిడ్నీ మైదానంలో రికార్డులు బద్దలు కొడుతూ ఫైటింగ్ సెంచరీతో అభిమానులను అలరించాడు. భారీ సెంచరీతో కడదాకా శ్రమించినా తొలివన్డేలో భారత్‌ను విజయతీరాలకు చేర్చలేకపోయినా..అసమాన పోరాటంతో హిట్‌మ్యాన్ ఆకట్టుకోవడం అభినందనీయం.. క్రీజులో కుదురుకోకముందే టాపార్డర్ వికెట్లు టపాటపా రాలాయి. 4 పరుగులకు 3 వికెట్లు..ఈ దశలో ధోనీ అండగా అతను మెల్లిగా తన పని మొదలు పెట్టాడు. 18వ బంతికి సిక్సర్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. మెల్లిగా ఆడుతూ క్రమంగా జోరు పెంచాడు. ఒకవైపు ఆస్ట్రేలియా బౌలర్లు లైన్ తప్పకుండా బంతులేస్తున్నా సహనం కోల్పోలేదు.. సాధికారితతో కూడిన బ్యాటింగ్..నియంత్రణతో కూడిన షాట్లు.. ఎక్కడా తడబాటు కానరాలేదు.. టీమ్ ఇండియాను దెబ్బతీసిన బెహ్రెన్‌డార్ఫ్ బౌలింగ్‌లో కొట్టిన స్కూప్ షాట్ అద్భుతం.. ఆఫ్‌స్టంప్ లోగిలో పడిన బంతిని అలా ముందుకు వంగి కీపర్ వెనుకగా షాట్ ఆడాడు.. అంతేకాదు స్టొయినిస్ బౌలింగ్‌లో బౌన్సర్‌ను పుల్ షాట్‌తో ప్రేక్షకుల్లో పడేయగా..లియాన్ బౌలింగ్‌లో క్రీజుదాటి ముందుకు వచ్చి ఆడిన భారీషాట్ 98 మీటర్ల దూరం దూసుకెళ్లింది. కళాత్మక షాట్లు.. అద్భుతమైన డ్రైవ్‌లు.. కళ్లుచెదిరే ఫ్లిక్ షాట్లు.. ఒత్తిడిలోనూ అతను ఆడిన తీరుతో అతని సత్తా ఏంటో తెలిపింది. 110 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు.. ఒకవైపు వికెట్లు పడుతున్నా..అండగా నిలిచేవారు కరువైనా పోరాటాన్ని కొనసాగించాడు. ఈ సెంచరీతో రోహిత్ పలు కొత్త రికార్డులను నమోదు చేశాడు. సిడ్నీ వన్డేలో చేసిన 133 పరుగులతో వన్డేల్లో అత్యధికంగా 125+స్కోర్లు చేసిన బ్యాట్స్‌మన్‌గా సచిన్ (19) తర్వాతి స్థానంలో నిలిచాడు. రోహిత్ 14 సార్లు చేయగా కోహ్లీ(13), జయసూర్య(10), క్రిస్ గేల్(10) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

రిచర్డ్స్ రికార్డ్ బ్రేక్

సిడ్నీ వన్డే సెంచరీతో రోహిత్ శర్మ మరో అరుదైన రికార్డు నమోదు చేశాడు. వన్డేల్లో ఆసీస్ గడ్డపై నాలుగు సెంచరీలు నమోదు చేసిన తొలి విదేశీ క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. గతంలో ఈ రికార్డు వెస్టిండీస్ బ్యాటింగ్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్(3సెంచరీలు) పేరిట ఉండేది. భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆసీస్ గడ్డపై రెండు సెంచరీలు సాధించాడు. ఆస్ట్రేలియాపై 9 సెంచరీలు (70 ఇన్నింగ్స్)సాధించిన మాస్టర్ సచిన్ అత్యధిక సెంచరీలు సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా తొలి స్థానంలో నిలవగా.. 7సెంచరీలతో (29ఇన్నింగ్స్) రోహిత్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

1

అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 1000 విజయాలు అందుకున్న తొలి జట్టుగా ఆస్ట్రేలియా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నది. 1877లో ఇంగ్లండ్‌పై టెస్ట్ గెలిచిన ఆసీస్.. తాజాగా సిడ్నీలో భారత్‌పై 1000వ విజయాన్ని అందుకుంది.

సెంచరీ చేస్తే ఓటమే!

ఆసీస్ గడ్డపై రోహిత్‌శర్మ సెంచరీ చేస్తే మ్యాచ్ ఓడిపోయినట్లే.. ఇదే సెంటిమెంట్ సిడ్నీ వన్డేలోనూ కొనసాగడం విశేషం. అద్భుత బ్యాటింగ్‌తో రోహిత్‌శర్మ నాలుగు సెంచరీలు చేసినా.. ప్రతి మ్యాచ్‌లోనూ భారత్ ఓడడం గమనార్హం.. దీంతో ఈ విషయాన్ని సామాజికమాధ్యమాల్లో సరదాగా అభిమానులు షేర్ చేస్తున్నారు..

పర్యటన	వేదిక	స్కోరు	ఫలితం
2015	మెల్‌బోర్న్	138	ఓటమి
2016	పెర్త్	171*	ఓటమి
2016	బ్రిస్బేన్	124	ఓటమి
2019	సిడ్నీ	133	ఓటమి

ఓవరాల్ చాంపియన్ కరీంనగర్



52వ సీనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్

భువనగిరి ఖిల్లా : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన 52వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్‌లో కరీంనగర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మహిళల విభాగంతోపాటు పురుషుల విభాగంలోనూ కరీంనగర్ జిల్లా జట్టు టైటిల్ విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో రంగారెడ్డి, మహిళల విభాగంలో మహబూబ్‌నగర్ రన్నరప్‌గా నిలిచాయి. శనివారం జరిగిన ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, సాట్స్ ఎండీ దినకర్‌బాబు విజేతలకు బహుమతులు అందించారు. విజేతలకు రూ.12వేలు, రన్నరప్ జట్లకు రూ.6వేల ప్రైజ్‌మనీ దక్కింది.

జట్టులోకి మయాంక్, శంకర్

ముంబై: సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌కు బదులుగా మయాంక్ అగర్వాల్, విజయ్ శంకర్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఆస్ట్రేలియాతో మిగిలిన రెండు వన్డేల్లో వీరిద్దరు జట్టుకు అందుబాటులో ఉంటారని బీసీసీఐ సీనియర్ అధికారి పేర్కొన్నాడు.

పాండ్యాకు మరో షాక్!

టీమ్ ఇండియా నుంచి సస్పెన్షన్ వేటు పడిన హార్దిక్ పాండ్యాకు మరిన్ని కష్టాలు చుట్టుముడుతున్నాయి. మహిళలపై అనుచిత వ్యాఖ్యలతో యువ ఆల్‌రౌండర్ బ్రాండ్ విలువ కూడా పడిపోవడం అనుకోని షాక్ కలిగించింది. టాక్ షోలో వ్యాఖ్యలతో 'జిల్లెట్' సంస్థ పాండ్యాను ప్రచారకర్త హోదా నుంచి తప్పించింది. మిగతా కంపెనీలు కూడా ఇదే బాట పడితే అతనికి భారీనష్టం వాటిల్లే సూచనలు కనిపిస్తున్నాయి.

సీవోఏ కమిటీలో విభేదాలు!

పాండ్యా, రాహుల్ టాక్ షో వివాదంపై సుప్రీంకోర్టు నియమిత బీసీసీఐ పాలకుల కమిటీ(సీవోఏ) మరోసారి చీలిపోయింది. ఈ వివాదంపై విచారణను సత్వరమే జరిపించాలని సీవోఏ కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ కోరుతుండగా.. విచారణకు అంత తొందరేం లేదని సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ అభిప్రాయం వ్యక్తం చేసింది. మీటూ వివాదంలో సత్వర విచారణతో బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ బయటపడినట్లుగానే వీరిద్దరికీ క్లీన్‌చిట్ లభించే అవకాశం ఉంటుందని ఆమె హెచ్చరించారు.

వారిపై వేటు సరైందే : హర్భజన్ సింగ్



న్యూఢిల్లీ: కనీసం మిత్రులతో చర్చించలేని అంశాలను టాక్ షోలో అలవోకగా మాట్లాడి క్రికెటర్ల గౌరవాన్ని మంట గలిపారని యువ క్రికెటర్లు పాండ్యా, రాహుల్‌పై .. భారత సీనియర్ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. వీరిపై బీసీసీఐ వేటు వేయడం సరైన నిర్ణయమని సమర్థించారు. టాక్ షోలో మాట్లాడిన సందర్భంగా జట్టు సహచరుల గదుల్లోనూ సెక్స్ చేశారా అని ప్రశ్నించగా.. రాహుల్, పాండ్యా సానుకూలంగా స్పందించారు. జట్టు సంస్కృతి గురించి అసభ్యకరంగా మాట్లాడడానికి వీరెంత కాలం జట్టులో ఉంటున్నారో చెప్పాలని ప్రశ్నించాడు. వీరి మాటలతో సచిన్ అలాంటోడు.. హర్భజన్ ఇలాంటోడు అనుకునే ప్రమాదముందని హర్భజన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

ఫైనల్లో ముంబై రాకెట్స్

సెమీస్‌లో హైదరాబాద్ ఓటమి



బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ హంటర్స్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన రెండో సెమీస్‌లో 4-2 స్కోరుతో ముంబై రాకెట్స్ జట్టు విజయం సాధించి ఫైనల్ చేరుకుంది. సమీర్ వర్మ, ఆంటోన్‌సెన్ ఇద్దరూ పురుషుల సింగిల్స్‌లో విజయం సాధించడంతోపాటు లీ యోంగ్ డే, కిమ్ జింగ్ ఇద్దరూ మిక్స్‌డ్ డబుల్స్‌లో జట్టుకు గెలుపు అందించారు. హంటర్స్ జట్టు సింధు మ్యాచ్‌ను ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఈమ్యాచ్‌లో 15-6,15-5స్కోరుతో అంతగా అనుభవం లేని ముంబై షట్లర్ పర్దేశిని చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్ మినహా మిగిలిన అన్ని మ్యాచ్‌లను హైదరాబాద్ ఓడిపోయింది. దీంతో టైటిల్ నిలుపుకోవాలన్న హైదరాబాద్ ఆశలు గల్లంతయ్యాయి. ఆదివారం జరిగే ఫైనల్లో బెంగళూరు రాప్టర్స్, ముంబై రాకెట్స్ జట్లు తలపడనున్నాయి.

రెండో విడుత నామినేషన్లు
నేటితో ముగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండో విడుత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో నామినేషన్ల దాఖలుకు గడువు ఆదివారం సాయంత్రం ఐదు గంటలతో ముగుస్తుంది. రెండో విడుత నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభమయింది. మొదటి రోజున 4,135 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు 4,850 నామినేషన్లు దాఖలుకాగా.. 36,602 వార్డులకు 9,198 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండోరోజైన శనివారం నాడు సర్పంచ్ స్థానాలకు 5,595, వార్డు స్థానాలకు 20,973 నామినేషన్లు దాఖలైనట్టు అనధికార సమాచారం. కరీంనగర్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 199, వార్డు స్థానాలకు 970 నామినేషన్లు దాఖలయ్యాయి. మంచిర్యాల జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 174, వార్డు సభ్యులకు 457, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 192, వార్డు స్థానాలకు 626, జిగిత్యాల జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 244, వార్డు స్థానాలకు 838, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 267, వార్డు స్థానాలకు 1294 నామినేషన్లు దాఖలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 295, వార్డు స్థానాలకు 1065, నాగర్‌కర్నూల్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 176, వార్డు స్థానాలకు 701, వనపర్తి జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 170, వార్డు స్థానాలకు 509, జోగుళాంబ గద్వాల జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 109, వార్డు స్థానాలకు 502 నామినేషన్లు దాఖలయ్యాయి. సూర్యాపేట జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 157, వార్డులకు 706నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్మల్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 134, వార్డులకు 583, ఆదిలాబాద్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 151, వార్డులకు 519, నిజామాబాద్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 187, వార్డులకు 953, కామారెడ్డి జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 253, వార్డులకు 1017 నామినేషన్లు దాఖలయ్యాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 126, వార్డులకు 415 , భువనగిరి జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 141, వార్డు మెంబర్‌కు 256 నామినేషన్లు దాఖలయ్యాయి. రిటర్నింగ్ అధికారులు సోమవారంనాడు నామినేషన్లను పరిశీలించి, అదేరోజు అర్హత సాధించిన నామినేషన్ల జాబితాను విడుదలచేస్తారు.

రూ.42 వేల మద్యం సీజ్

పంచాయతీ ఎన్నికల సందర్భంగా శనివారంనాడు వివిధ ప్రాంతాల్లో మొత్తం రూ.42,410 విలువైన మద్యాన్ని సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. జగిత్యాల జిల్లాలో రూ.17,710, కరీంనగర్ జిల్లాలో రూ.7,330, రామగుండం కమిషనరేట్ పరిధిలో రూ.17,370 విలువైన మద్యాన్ని సీజ్‌చేసినట్లు వెల్లడించారు.

నేడు సూర్యాపేట జిల్లాలో నాగిరెడ్డి పర్యటన

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ఆదివారం సూర్యాపేట జిల్లాలో పర్యటిస్తారు. ఆయన మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కలెక్టర్, పంచాయతీ ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందితో సమావేశమవుతారు.



గ్రామ స్వరాజ్యం



రోజువారీగా లెక్కచూపాలి

- అందరికీ అందుబాటులో ఉంచాలి
- మార్గదర్శకాలు జారీచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు రోజువారీగా ప్రచారం లెక్కలు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. తొలి విడుత పంచాయతీపోరులో సోమవారం నుంచి ప్రచారపర్వం మొదలవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం మార్గదర్శకాలు జారీచేసింది. అభ్యర్థులు వెచ్చించే ప్రతిపైసా ఎన్నికల ప్రచారలెక్కల్లోకి వస్తుందని స్పష్టంచేసింది. మండలం పరిధిలో ఎంపీడీవోల దగ్గర లెక్కల వివరాలను నమోదుచేయాలని సూచించింది. ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోపు పూర్తిస్థాయి లెక్కలు సమర్పించకుంటే.. ఆయా అభ్యర్థులపై అనర్హత వేటువేస్తారని హెచ్చరించింది. సర్పంచ్, వార్డు సభ్యుల వ్యయ పరిమితిని పెంచినట్లు ప్రకటించిన ఎన్నికల సంఘం.. ఎన్నికల ఖర్చును బ్యాంకు ఖాతా నుంచే పెట్టాలన్న నిబంధన విధించింది.

సోపానం

సర్పంచ్ నుంచి ఎమ్మెల్సీ

- అంచెలంచెలుగా ఎదిగిన కూచకుళ్ల దామోదర్‌రెడ్డి



నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సర్పంచ్‌గానే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1981లో నాగర్‌కర్నూల్ మండలంలోని స్వగ్రామమైన తూడుకుర్తికి తొలిసారిగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1986లో రెండోసారి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన హయాంలో తూడుకుర్తి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. గ్రామ పంచాయతీ భవనం, బ్యాంక్, సబ్‌పోస్టాఫీస్ తీసుకొచ్చారు. 1989లో మండల వైస్‌ఎంపీపీగా పనిచేశారు. 1994లో టీడీపీ నుంచి ఎంపీపీగా ఎన్నికయ్యారు. 1999 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానానికి పోటీచేసి రెండో స్థానంలో నిలిచారు. 2004లో టీఆర్‌ఎస్ తరపున బరిలో నిలిచి 1500 ఓట్ల స్వల్పతేడాతో ఓటమి పాలయ్యా రు. 2006లో తాడూరు నుంచి కాంగ్రెస్ తరపున జడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేసినా విజయం వరించలేదు. 2014లో జరిగిన స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరారు. 'సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చే రూ.10 లక్షల ప్రోత్సాహంతోపాటు ఎమ్మెల్యేలు కూడా ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. దీంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చు. అందరూ కలిసి నిర్ణయాలు తీసుకొంటారు కాబట్టి ఎలాంటి గొడవలు ఉండవు' అని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు.

పంచాయతీలపై గులాబీ జెండా

మొదటి విడుతలో టీఆర్‌ఎస్ ఖాతాలో ఏకగ్రీవమైన 310 గ్రామాలు

రెండో విడుతలో కొనసాగుతున్న ఏకగ్రీవాల పర్వం

పల్లెల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళిక

కొత్త చట్టంతో మరింత పెరిగిన మద్దతు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామ పంచాయతీలపై గులాబీ జెండా ఎగురుతున్నది. పార్టీలతో సంబంధంలేకుండా జరిగే పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులకు ప్రజలు అండగా నిలుస్తున్నారు. స్థానిక సంస్థల బలోపేతం, గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళికతో రూపుదిద్దుకున్న కొత్త పంచాయతీరాజ్ చట్టం గ్రామ రాజకీయాలను మలుపు తిప్పుతున్నది. అన్నిరంగాల్లో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామనే నినాదంతో ప్రజలు ఒక్కటవుతున్నారు. ప్రభుత్వంతో అనుబంధంగా ఉండేవారిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు.

కొత్త చట్టంతో మారనున్న రూపురేఖలు

నూతన పంచాయతీరాజ్ చట్టంతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. ప్రతి గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం, తాగునీరు, ప్రజారోగ్యం, రోడ్ల అభివృద్ధితోపాటు పేదవర్గాల సంక్షేమానికి కొత్త చట్టంలో చాలా మార్పులు తీసుకొచ్చారు. తెలంగాణ తరహాలోనే ఆయా రాష్ట్రాలు పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేసుకోవాలని ఇటీవలే కేంద్ర మంత్రి ఓరమ్ సైతం సూచించారు. కొత్త చట్టంలో పంచాయతీల పాలకవర్గాలకు చాలా బాధ్యతలను అప్పగించడమే కాకుండా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకునే అధికారాన్ని కల్పించారు. ప్రతినెలా గ్రామసభలు నిర్వహించాలని స్పష్టంచేశారు. వరుసగా మూడుసార్లు గ్రామసభ నిర్వహించకుంటే సర్పంచ్‌పై వేటు వేయనున్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికను గ్రామసభల్లో తేటతెల్లం చేసి, ఆమోదించాల్సిందే. ప్రతి ఒక్కరినీ గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం చేసేలా గ్రామసభల్లో కోరం ఉండేలా చట్టంలో నిర్ణయించారు. ఇక గ్రామాభివృద్ధి కమిటీలకు ప్రాధాన్యం ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంస్థలను భాగస్వాములను చేశారు. దీంతో కొత్త చట్టం చాలా రోజుల నుంచి పార్టీల పేరుతో విడిపోయినవారిని కూడా అభివృద్ధి కోసం ఒక్కటిగా చేసింది. ఇన్నేండ్లు వెనుకబడి ఉన్న గ్రామాన్ని ఆదర్శంగా మార్చుకొనేందుకు పల్లెవాసులు ఏకతాటిపైకి వస్తున్నారు.

కూటమి నాయకులను తిరస్కరిస్తున్న ప్రజలు

ఇప్పటికే కోర్టులను ఆశ్రయించి పంచాయతీ ఎన్నికలు జరుగకుండా అడ్డుకొని రూ.కోట్ల నిధులు రాకుండా చేసిన కాంగ్రెస్, టీడీపీ కూటమి నేతలకు.. గ్రామాల్లో ఇప్పుడు విషమ పరీక్ష మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు గత ఏడాది ఆగస్టులోనే పూర్తికావాల్సి ఉండగా.. కాంగ్రెస్, కూటమి నేతలు కోర్టుకెక్కి కేసులు వేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలతో రిజర్వేషన్లను తగ్గించక తప్పని పరిస్థితి నెలకొన్నది. అయితే ఈ కారణంగా గ్రామాల అభివృద్ధి ఆగకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం 50 శాతంలోపు రిజర్వేషన్లు చేసింది. ఈ విషయాన్ని ప్రజలు మొదట్నుంచీ గమనిస్తూనే ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కండువాలు వేసుకొని రాజకీయాలు చేసేవారికి ప్రజలు కూడా సరైన గుణపాఠమే చెప్తున్నారు. 'అభివృద్ధిని అడ్డుకొనే నేతలు మీరు' అంటూ కాంగ్రెస్, టీడీపీ నాయకులపై మండిపడుతున్నారు. ఏకగ్రీవాల్లో ఆ పార్టీ మద్దతుదారుల ఊసే లేకుండా పోయింది. ఈ పరిణామాల్లో కాంగ్రెస్, టీడీపీ మద్దతుదారులమంటూ చెప్పుకునేందుకు కూడా అభ్యర్థులు జంకుతున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం రామచంద్రాపురంలో ఏకగ్రీవమైన టీఆర్‌ఎస్ మద్దతుదారు నారాయణ నరేందర్‌రెడ్డి

టీఆర్‌ఎస్ మద్దతుదారులకే అండగా ప్రజలు

గ్రామాల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులకు ప్రజలు అండగా నిలుస్తున్నారు. పార్టీ తరపున ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి నిధులు తీసుకొస్తారనే ఆశతో వారివెంట నడుస్తున్నారు. మొదటి విడుతలో రాష్ట్రంలో దాదాపు 340 పంచాయతీలకుపైగా ఏకగ్రీవం కాగా, ఇందులో 310 గ్రామాల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులే ఏకగ్రీవమయ్యారు. ఇప్పటికే పార్టీలో తిరుగుతున్న వారికి ఈసారి పంచాయతీల బాధ్యతలను అప్పగిస్తున్నారు. రాజకీయాలన్నీ పక్కనపెట్టి టీఆర్‌ఎస్‌వాదులను ఎన్నుకుంటున్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం వల్ల గ్రామాల అభివృద్ధి సాధించవచ్చని భావిస్తున్నారు. రెండో విడుతలోనూ ఇదే పర్వం కొనసాగుతున్నది.

అభ్యర్థుల్లో 'నోటా' టెన్షన్

తొలిసారిగా బ్యాలెట్‌లో నోటాకు స్థానం

- ఒక్కో బ్యాలెట్‌లో 10+1 గుర్తులు
- ఇది పంచాయతీ పోరు సిత్రం

భైంసా, నమస్తే తెలంగాణ(నిర్మల్ జిల్లా): గ్రామ పంచాయతీ పోరులో ఈసారి బ్యాలెట్ పేపర్‌లో నోటాను చేర్చారు. శాసనసభ, పార్లమెంటు తరహాలోనే పంచాయతీ ఎన్నికల్లోనూ నోటా గుర్తును జతచేశారు. పోటీలో అభ్యర్థుల్లో ఎవరు నచ్చకుంటే ఎవరూ కాదు (నోటా)కు ఓటు వేసే అవకాశం ఉన్నది. నోటాను చేర్చడంతో బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను చేర్చింది. ఈ ఆప్షన్‌ను సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లలో ముద్రించనున్నారు. ఒక్కో బ్యాలెట్‌లో పది గుర్తులతోపాటు నోటా గుర్తును పొందుపరుస్తున్నారు. ఆ విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే 10+1తో బ్యాలెట్లను ముద్రించింది. గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో పది మంది కంటే ఎక్కువగా పోటీ చేస్తే కొత్తగా బ్యాలెట్‌ను ముద్రిస్తారు. బ్యాలెట్ పేపరుపై అభ్యర్థుల పేర్లు, గుర్తులు మాత్రమే ఉంటాయి.



నోటా టెన్షన్..

నోటాను బ్యాలెట్‌లో చేర్చడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకుంటే నోటాకు ఓటు వేయవచ్చు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నోటాకు ఓట్లు భారీగానే పడుతుండటంతో అభ్యర్థుల్లో దిగులు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలలో గుర్తుపక్కనే అభ్యర్థుల ఫొటో ఉండగా.. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో బ్యాలెట్‌పై గుర్తులు మాత్రమే ఉంటాయి. వృద్ధులు, నిరక్షరాస్యులు నోటా కూడా ఓ అభ్యర్థి గుర్తు అనుకొని ఓటు వేసే ప్రమాదం లేకపోలేదనే చర్చ జరుగుతున్నది.

రేపటి నుంచి ప్రచారహోరు

నేడు తొలివిడుత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సోమవారం నుంచి పంచాయతీ ఎన్నికల ప్రచారం హోరెత్తనున్నది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత తొలి విడుత పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా విడుదలవుతుంది. దీనితోపాటే ఆయా అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను కూడా రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. తొలి విడుతలో నామినేషన్లు దాఖలుచేసిన అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకోవడానికి ఆదివారం మధ్యాహ్నం వరకు అవకాశం ఉన్నది. సోమవారం నుంచి తమకు కేటాయించిన గుర్తులతో అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకోనున్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మైకులతో ప్రచారం చేసుకోవచ్చునని.. అందుకు అనుమతి తప్పనిసరి అని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టంచేసింది.

మక్కా యాత్రకు 4,169 మంది ఎంపిక



శనివారం నాంపల్లిలోని హజ్ కార్యాలయంలో కంప్యూటరైజ్డ్ డ్రా ద్వారా ఎన్నికైన యాత్రికుల వివరాలు వెల్లడిస్తున్న ప్రత్యేకాధికారి ఎస్‌ఏ షుకూర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ఏడాది మక్కా సందర్శనకు 4,169 మంది వెళ్లనున్నారు. కంప్యూరైజ్డ్ డ్రా ద్వారా హజ్‌యాత్రకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను శనివారం హజ్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి ఎస్‌ఏ షుకూర్ మీడియాకు వెల్లడించారు. హజ్ యాత్రికుల ఎంపిక డ్రా ప్రక్రియను కేంద్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, రాష్ట్ర కోటా కింద 4,169 సీట్లను కమిటీ కేటాయించారని, ఇందులో రిజర్వు క్యాటగిరీలో 484 మంది 70 ఏండ్లు పైబడిన వారిని డ్రాలేకుండా ఎంపికచేసినట్టు తెలిపారు. రిజర్వు క్యాటగిరీ సీట్లు పోగా మిగిలిన 3,685 సీట్లకు రాష్ట్రవ్యాప్తంగా 12,884 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 8,116 దరఖాస్తులు రాగా, వారిలో 1,459 ఎంపికయ్యారని, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లా నుంచి నాలుగు దరఖాస్తులురాగా నలుగురూ ఎంపికైనట్టు చెప్పారు. ఎంపికైన యాత్రికుల వివరాలు www.hajcommitte.gov.in వెబ్‌సైట్‌లో పెట్టామని, వారి ఫోన్‌కు కూడా సమాచారం వస్తుందని పేర్కొన్నారు.



హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం శనివారం నిర్వహించిన కంప్యూటరైజ్డ్ డ్రాలో తమ వారికి అవకాశం రావడంతో హర్షం వ్యక్తంచేస్తున్న మహిళలు

ప్లాట్‌ఫాం దాటని హామీ!

- 35 ఏండ్లయినా నెరవేరని కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ
- పీవోఎస్ మాత్రమే వచ్చే అవకాశం
- ఏపీలో రైల్వేజోన్ ఏర్పడితే ఇక్కడ కొత్త డివిజన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : మూడున్నర దశాబ్దాలుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు హామీలకే పరిమితమైంది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపర్చినా మోక్షం లభి ంచడం లేదు. 1980లో అప్పటి ప్రధాని దివంగత ఇందిరాగాంధీ మెదక్ నుంచి ప్రాతినిధ్యం వహించిన సమయంలో మెదక్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామని హామీఇచ్చారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ప్రారంభమైనా.. కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ కలగానే మిగిలిపోయింది. కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటూ 1989లో స్థానిక నేతలు పక్షంపాటు నిరహారదీక్షలు చేపట్టారు. 1991లో కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు కాగా, డీజిల్ లోకోషెడ్ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించారు. అయితే పంజాబ్‌లో ఉవ్వెత్తున్న సాగిన ఖలిస్థాన్ ఉద్యమంలో పాల్గొంటున్న యువతను తీవ్రవాదం నుంచి తప్పించేందుకు ఉపాధి అవకాశాలు పెంచాలని అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఖాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీ కపుర్తాలకు బదిలీ అయ్యింది.

విభజన హామీతో చిగురించిన ఆశలు

రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఇస్తామన్న హామీ కేంద్రం నుంచి లభించింది. దీంతో మళ్లీ ఆశలు చిగురించాయి. రైల్వే కోచ్‌ఫ్యాక్టరీపై నిర్దిష్టంగా ఎలాంటి హామీ ఇవ్వలేదని ఇటీవల కేంద్ర హోంశాఖ కార్యదర్శి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ కచ్చితంగా ఇవ్వాల్సిందేనంటూ కేంద్రంపై ఒత్తిడి పెంచారు. ప్రధాని మోదీని కలిసి అనేకసార్లు విజ్ఞప్తి చేశారు. అయితే జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తరప్రదేశ్‌లో కోచ్‌ల నిర్మాణం జరుగుతున్నందున మిగతా చోట్ల ఫ్యాక్టరీ ఏర్పాటు అక్కరలేదని రైల్వేశాఖ చెప్తున్నది.

పీవోఎస్ మాత్రమే

వరంగల్ జిల్లాకు పీరియాడికల్ ఓవరాయిలింగ్ షెడ్ (పీవోఎస్) మాత్రమే వచ్చే అవకాశం ఉన్నది. దీనికి రైల్వేశాఖ ఇప్పటికే నిధులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు భూమి కేటాయిస్తే అప్పుడు ప్రక్రియ ప్రారంభిస్తామని రైల్వేశాఖ చెప్తున్నది. అయోధ్యాపురంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ భూములు సేకరించేందుకు నిధులు సైతం మంజూరు చేసింది.



డివిజన్‌గా కాజీపేట!

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా రైల్వేజోన్ ఏర్పాటుచేస్తే దక్షిణ మధ్య రైల్వేలో మార్పులు సంభవించే అవకాశం ఉండేది. అప్పుడు కాజీపేట రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ అయి.. ఇక్కడి నుంచే రైళ్లు ప్రారంభమవటంతోపాటు అనేక కార్యాలయాలు తరలివచ్చే అవకాశాలు ఉంటాయి.

ఉద్యాన పంటల లెక్కలు సేకరించాలి

అధికారులతో సమీక్షలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : క్రాప్‌కాలనీలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అనుగుణంగా కచ్చితమైన ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం వివరాలు సేకరించాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. జీడిమెట్లలోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌లో ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ అధికారులతో శనివారం సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట ఉత్పాదకతను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. క్రాప్ కాలనీ ద్వారా కొరత ఉన్న పంటల విస్తీర్ణం పెంచాలని సూచించారు. అధిక ఉత్పత్తి ఉన్న పంటల స్థానంలో ఇతర పంటలను సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 31లోగా సూక్ష్మ సేద్య పథకాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలుచేయాలని, సూక్ష్మసేద్య కంపెనీలు, అధికారులు పొరపాటు చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకులుడు ఎల్ వెంకట్రాంరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు కృషి

రైతులు పండించే ప్రతి వ్యవసాయ, ఉద్యాన పంటకూ కనీస గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి తెలిపారు. శనివారం సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, ఆహార శుద్ధి, ఉద్యాన వర్సిటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలకు ముడిసరుకు అందించే విధంగా పంట కాలనీలను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి ప్రవీణ్‌రావు, ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖ సంచాలకులు వెంకట్రామ్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ సంచాలకులు లక్ష్మీబాయి, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అఖిల్, భగవాన్ పాల్గొన్నారు.



శనివారం జీడిమెట్లలోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌లో ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

మహనీయుల ఆశయాలను నెరవేర్చాలి

- వివేకానంద విగ్రహావిష్కరణలో మాజీమంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: మహనీయుల ఆశయాలను నెరవేర్చాలని జడ్చర్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి పట్టణంలోని వాల్మీకీనగర్‌లో స్వామి వివేకానంద 156 జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాన్ని లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, వివేకానంద దేశ సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమి చైర్మన్ బాద్మి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషితో కేంద్రప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు డాక్టర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ సమావేశమయ్యారు.



శనివారం రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను కలిసి ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

వివేకానందుడి జీవితం ఆదర్శం

- జాతీయ యువజనదినోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వామి వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శమని, భారతీయ సంస్కృతికి ప్రతిరూపమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జాతీయ యువజనదినోత్సవం సందర్భంగా శనివారం శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆయన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. వివేకానందుడి బోధనలు అసాధారణమైనవని, కాలదోషం పట్టవని, అన్ని కాలాలకు వర్తించే నిరంతర గంగా ప్రవాహమని కొనియాడారు. భారతీయ సంస్కృతిలో తాత్వికమైన, సమీకృతమైన, సార్వత్రికమైన లక్షణాలు ఉన్నాయని, ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారాలు ఉన్నాయని వెంకయ్యానాయుడు అన్నారు. వైవిధ్యమైన మతాలను, సాంస్కృతిక నమ్మకాలను, వివిధ అభిప్రాయాలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి, వివిధ అభిప్రాయాల మధ్య చక్కని వారధి నిర్మించిన ఘనత వివేకానందుడి సొంతమని ప్రశంసించారు. 125 ఏండ్ల క్రితం చికాగో సర్వమత సమ్మేళనంలో వివేకానందుడి ప్రసంగం యావత్ ప్రపంచానికి దిశానిర్దేశం చేసిందని చెప్పారు. యువశక్తిని ప్రపంచానికి తెలియపరిచిన స్వామి వివేకానందుడి జీవితం అందరికి స్ఫూర్తిదాయమని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పేర్కొన్నారు.



శనివారం ముచ్చింతల్‌లో స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత ముఖాముఖిలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోటింగ్‌ను ఎంపీ వినోద్‌కుమార్ శనివారం ఉదయం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావులతో కలిసి బోట్‌లో విహరించారు.

- కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ

• సిరిసిల్లలో కైట్ ఫెస్టివల్



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మానేరు నదీ తీరాన ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌లో భారీ పతంగిని ఎగురవేస్తున్న యువకులు

నేటినుంచి ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నాలుగో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను ఆదివారం ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రారంభించనున్నారు. సంక్రాంతి సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించే ఈ వేడుకలో 20 దేశాలనుంచి 42 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పెద్దసంఖ్యలో సందర్శకులు పాల్గొంటారు. అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా 22 దేశాలు, దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన 1,200 రకాల స్వీట్లను అందుబాటులో ఉంచుతారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు కైట్ ఫెస్టివల్‌లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతరశాఖల సమన్వయంతో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్స్‌తో సమావేశం

బేగంపేటలోని పర్యాటకభవన్‌లో ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్స్‌తో శనివారం పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సమావేశమై పలుఅంశాలపై చర్చించారు. సమావేశంలో టూరిజం ఇంచార్జి కమిషనర్ దినకర్‌బాబు, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు





సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న స్వీట్ ఫెస్ట్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న టూరిజం శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, స్వీట్ ఫెస్ట్‌కు సిద్ధమైన వేదిక

టెలీమెట్రీ దిద్దుబాట

మళ్లీ అవే పాయింట్లపై సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా ప్రాజెక్టులపై టెలీమెట్రీ ఒక ప్రహసనంగా మారింది. 2015 జూన్‌లో కృష్ణా ప్రాజెక్టులద్వారా రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీలో కచ్చితత్వాన్ని తెల్చేందుకు టెలీమెట్రీ ఏర్పాటుచేయాలని కేంద్ర జలవనరులశాఖ ఆదేశాలతో 18 పాయింట్లలో.. రూ.2 కోట్లు ఖర్చుపెట్టి కృష్ణాబోర్డు ఏర్పాటుచేసిన తొలిదశ టెలీమెట్రీ విఫలంకావడంతో బోర్డు అధికారులు కండ్లు తెరిచి కేంద్రం అధీనంలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ సెంటర్)ను ఆశ్రయించారు. ఆ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు జనవరి 21-25 తేదీల్లో 11 పాయింట్లను పరిశీలించనున్నారు. ఈనెల 21న సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్డీ అత్కేకర్, పీఎస్ కుంజీర్, వీఎన్ కట్టె.. ప్రాజెక్టుల వద్ద టెలీమెట్రీ పరిశీలనకోసం హైదరాబాద్‌కు వస్తారు. వీరు శ్రీశైలం, నాగార్జునసాగర్ పరిధిలో పదకొండు పాయింట్లను పరిశీలిస్తారు. ఈనెల 21న రెండు రాష్ట్రాల ఇంజినీర్లతో కలిసి శాస్త్రవేత్తలు కేసీ కెనాల్‌ను పరిశీలిస్తారు. 22న ఉదయం పోతిరెడ్డిపాడు, మధ్యాహ్నం నాగార్జునసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తారు. 23న సాగర్ కుడికాల్వ, ఎడమ కాల్వతోపాటు పాలేరు వద్ద టెలీమెట్రీ పాయింట్లను పరిశీలిస్తారు. 24న తిరువూరు, సాగర్ ఎడమ కాల్వపై తెలంగాణ-ఏపీ సరిహద్దు ప్రదేశాన్ని పరిశీలించి విజయవాడకు వెళ్తారు. అదేరోజు పోలవరం కాల్వ కలిసే (కృష్ణా డెల్టా వద్ద) ప్రదేశాన్ని కూడా పరిశీలిస్తారు. 25న ప్రకాశం బరాజ్ తూర్పు, పడమర ప్రధాన కాల్వలు, గుంటూరు చానెల్‌ను శాస్త్రవేత్తలు పరిశీలిస్తారు.

ఎస్సెల్బీసీ పూర్తికి కసరత్తు

- పనుల వేగానికి చర్యలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదిక ఇచ్చిన రిటైర్డ్ ఇంజినీర్లు
- సరికొత్త ప్రతిపాదనలు సిద్ధంచేసిన నీటిపారుదలశాఖ



నల్లగొండ జిల్లా తెల్దేవరపల్లి వద్ద పూర్తి కావచ్చిన టన్నెల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్సెల్బీసీ) పథకం పనులను వేగంగా పూర్తిచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు మొదలెట్టింది. నత్తనడకన పనులు కొనసాగుతుండటానికి కారణాలు తెలుసుకొని, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిసారించింది. దీనిలోభాగంగా సంబంధిత ఏజెన్సీ కోరినట్టు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధమైనట్టు తెలిసింది. ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ జిల్లాకు తాగునీటిని తరలించే శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్సెల్బీసీ) పథకం చాలాకాలంగా కొనసాగుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో సొరంగమార్గం విషయంలో అప్పటి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇప్పుడది సాంకేతిక సవాలుగా మారింది. శ్రీశైలం డ్యాం దిగువన నిర్మించనున్న హెడ్‌రెగ్యులేటర్ నుంచి సుమారు 43.5 కిలోమీటర్ల మేర సొరంగ మార్గాన్ని తవ్వుతున్నారు. 4 వేల క్యూసెక్కుల డిశ్చార్జి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ సొరంగ మార్గం నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి గ్రామం వద్ద ముగుస్తుంది. ఇప్పటివరకు దాదాపు 34 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. తెల్దేవర్‌పల్లి వద్ద 7.5 టీఎంసీల సామర్థ్యంతో నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రిజర్వాయర్ నుంచి జలాల తరలింపునకు 7.25 కిలోమీటర్ల మేర చేపట్టిన మరో సొరంగం పనులు పూర్తయినప్పటికీ లైనింగ్ పనులు పూర్తికాలేదు. అదేవిధంగా దాదాపు 20 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ పనులు, పెండ్లిపాకల రిజర్వాయర్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ప్రత్యేక దృష్టిసారించిన ముఖ్యమంత్రి

ఇటీవల సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. రిటైర్డ్ ఇంజినీర్లను ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించాలని సూచించారు. ఎస్సెల్బీసీ పనులపై నివేదిక ఇవ్వాలన్న సీఎం సూచనల మేరకు.. రిటైర్డ్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నల్లమలలో తవ్వుతున్న సొరంగ మార్గంలో భారీ ఎత్తున సీపేజ్ వస్తుండటం, ఆ మేరకు డీవాటరింగ్ సామర్థ్యం లేకపోవడంతో పనులు నిలిచిపోయినట్టు తేల్చారు. బ్యాంకు గ్యారంటీ లేకుండా రూ.60 కోట్లు ఇస్తే పనులు వేగంగా జరిపేందుకు వెసులుబాటు లభిస్తుందన్న ఏజెన్సీ ప్రతిపాదనను రిటైర్డ్ ఇంజినీర్లు సీఎం కేసీఆర్‌కు నివేదించారు. సూత్రప్రాయంగా సీఎం కేసీఆర్ సుముఖత వ్యక్తంచేయడంతో.. ఏజెన్సీ కోరినట్టుగా నీటిపారుదలశాఖ ప్రతిపాదనలు సిద్ధంచేసినట్టు తెలిసింది.

టీటా గ్లోబల్ వర్కింగ్ కమిటీ ప్రకటన

- 2022 వరకు కొనసాగనున్న కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ గ్లోబల్ వర్కింగ్ కమిటీ (జీడబ్ల్యూసీ) బాధ్యులను శనివారం ప్రకటించారు. ఈ కమిటీ 2019- 2022 వరకు కొనసాగనుంది. రిటర్నింగ్ అధికారి సీ విఠల్ హైదరాబాద్‌లో మీడియాకు కమిటీ వివరాలను వెల్లడించారు. జీడబ్ల్యూసీలో 40 మంది సభ్యులు ఉంటారని వీరితోపాటు 20 దేశాలకు చెందిన టీటా అధ్యక్షులు సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. కమిటీ సభ్యులు వచ్చేవారం బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. టీటాకు సంబంధించి ఈ కమిటీ ప్రపంచ వ్యాప్తంగా నిర్ణయాలు తీసుకొంటుందని తెలిపారు. పెట్టుబడుల విషయంలో ఎన్నారైలకు సూచనలివ్వడం, వివిధ దేశాల్లోని వీసాల సమస్యల పరిష్కారానికి సమన్వయపర్చడం, డిజిటల్ లిటరసీ సహా పలుఅంశాలపై ఈ కమిటీ మార్గదర్శనం చేస్తుందని వివరించారు. కొత్త కమిటీతో కార్యకలాపాలను మరింత వేగవంతం చేస్తామని, వచ్చేవారం కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామని టీటా గ్లోబల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు.

22న హైదరాబాద్‌కు అమిత్‌షా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెల 22న హైదరాబాద్‌కు వస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తొలిసారిగా హైదరాబాద్ పర్యటనకు వస్తుండటం గమనార్హం. పార్టీ సీనియర్ నేతలు, పార్లమెంటరీ ఇంచార్జిలతో ఆయన భేటీ అవుతారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ మీడియాకు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం చవిచూసిన నేపథ్యంలో జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు అమిత్‌షా నగరానికి వస్తున్నట్టు సమాచారం. 118 స్థానాల్లో బీజేపీ పోటీ చేయగా కేవలం ఒక్క స్థానంలో మాత్రమే ఆ పార్టీ గెలిచింది. 103 స్థానాల్లో డిపాజిట్లను కోల్పోయిన సంగతి తెలిసిందే.

పాపం చిట్టినాయుడు..!

- కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కావడంతో లోకేశ్‌కు నిద్ర దూరం
- టీడీపీ రాజకీయాలపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సెటైర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీడీపీ రాజకీయాలు, మంత్రి లోకేశ్‌పై ఎంపీ, వైసీపీ ప్రధాన కార్యదర్శి వై విజయసాయిరెడ్డి సెటైర్లు వేశారు. 'తెలంగాణలో కేటీఆర్ టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయినప్పటినుంచి లోకేశ్‌కు నిద్ర పట్టడం లేదు. తండ్రి అర్జంటుగా తప్పుకొని సీఎం కుర్చీని లేదా పార్టీ బాధ్యతలను తనకు అప్పగిస్తే బాగుండని కలలుకంటున్నాడు. చంద్రబాబు ఈ విషయంలో కొడుకును కూడా నమ్మడని తెలియదు పాపం చిట్టినాయుడికి..' అంటూ ఎద్దేవాచేశారు. ఏపీ సర్కారు పనితీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఆయన పేర్కొన్నారు. 'తూర్పుగోదావరి జిల్లా కట్టమూరులో మంత్రి లోకేశ్‌ను మహిళలు తరిమికొట్టారు. వచ్చే మూడునెలలు పచ్చ పార్టీ నేతలకు ఇటువంటి పరాభవాలు తప్పవు.' అంటూ వరుస ట్వీట్లలో సెటైర్లు వేశారు.





శనివారం ఉదయం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ వద్ద దట్టమైన పొగమంచు కారణంగా ఒకదానికి ఒకటి ఢీకొన్న వాహనాలు

పొగమంచుతో రోడ్డు ప్రమాదం

ఒకదానికొకటి 12 వాహనాలు ఢీ • రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ వద్ద ఘటన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/నందిగామ: పొగమంచు కారణంగా వాహనాలు వరుసగా ఒకదానికొకటి ఢీకొట్టడం మనకు విదేశాల్లోనో, ఉత్తర భారత దేశంలోని ఢిల్లీ, హర్యానాల్లో జరిగినట్టు తెలుసు. కానీ హైదరాబాద్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. పొగమంచు కమ్ముకోవడంతో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ వద్ద బైపాస్ రోడ్డుపై 12 వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో అన్ని వాహనాలు ధ్వంసమవగా ప్రాణనష్టమేమీ జరుగలేదు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం 7:15 గంటలకు దట్టమైన పొగమంచుతో ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న రెండు బస్సులు, మూడు లారీలు, రెండు ఆటోలు, ఐదు కార్లు ఒకదానికొకటి వెనుకనుంచి ఢీకొన్నాయి. మొదట ఓ ఆర్టీసీ బస్సు ముందున్న వాహనాన్ని ఢీకొనడంతో మొదటి ప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో బస్సు రోడ్డుపై ఆగిపోవడంతో వెనుకాల నుంచి వచ్చిన వాహనాలు వరుసగా ఢీకొట్టుకున్నాయి. స్వల్పంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

ఔటర్‌పై వేగానికి కళ్లెమేద్దాం!

- ప్రమాదాలు అరికట్టడంపై పోలీస్‌శాఖ దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఔటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్)పై మితిమీరిన వేగంతో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడంపై పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. రయ్‌మంటూ దూసుకుపోతున్న వాహనాల వేగాన్ని కట్టడిచేసేందుకు ఇప్పటికే లేజర్ స్పీడ్‌గన్ కెమెరాలను వినియోగిస్తూ.. కేసులు నమోదుచేసి, భారీగా జరిమానా వసూలు చేస్తున్నది. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంగుళూరు - రావిర్యాల మధ్య ఓఆర్ఆర్‌పై అంబులెన్స్‌ను కారు అతివేగంగా ఢీకొట్టడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనవేగం గంటకు వంద కిలోమీటర్లు దాటితే రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నారు. అవసరమైతే జరిమానా మొత్తాన్ని మరింత పెంచాలని ఆలోచిస్తున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరిన్ని సైన్‌బోర్డుల ఏర్పాటుతో పాటు డ్రైవర్‌ను అలర్ట్ చేసేకోవటంపై అధికారులు చర్చించారు.

వైసీపీకి పొత్తులు అవసరం లేదు

- పవన్ వ్యాఖ్యలపై వైసీపీ అధికార ప్రతినిధి సుధాకర్‌బాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైసీపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరంలేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. తమ కోసం అలాంటి ప్రయత్నం చేయాల్సిన అవసరం టీఆర్ఎస్‌కు లేదని స్పష్టంచేశారు. జనసేనకు తగిన సంఖ్యలో సీట్లురావని గతంలో చెప్పినవారే.. ఇప్పుడు తమతో కలిసిరావాలంటూ టీఆర్ఎస్ నేతలతో మాట్లాడిస్తున్నారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆయన శనివారం ఈ వివరణ ఇచ్చారు.

ఎన్ఐఏ కస్టడీకి జగన్‌పై దాడి కేసు నిందితుడు


- నిందితుడు కోరితే న్యాయవాది సమక్షంలోనే విచారించాలన్న కోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక భద్రత నడుమ విజయవాడ ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షల అనంతరం విచారణ నిమిత్తం శ్రీనివాసరావును హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయానికి తరలించారు. జగన్‌పై దాడికేసును ఏపీ పోలీసుల నుంచి ఎన్ఐఏకు బదిలీచేసిన విషయం తెలిసిందే. నిందితుడు శ్రీనివాసరావును విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని ఎన్ఐఏ అధికారులు విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో పిటిషన్ వేయగా షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. శ్రీనివాసరావుకు మూడు రోజులకోసారి వైద్య పరీక్షలు చేయించి నివేదిక ఇవ్వాలని, అతడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించ వద్దని, నిందితుడు కోరితే న్యాయవాది సమక్షంలోనే విచారణ జరుపాలని ఆదేశించింది. నిందితుడిని ఎక్కడకు తీసుకెళ్లారో సమాచారం ఇవ్వాలని విజయవాడ సెషన్స్ కోర్టులో శ్రీనివాసరావు తరఫు న్యాయవాది సలీం శనివారం పిటిషన్ దాఖలు చేయగా విచారణకు స్వీకరించిన కోర్టు, నిందితుడి తరఫు న్యాయవాదులకు సమాచారం ఇవ్వాల ఆదేశించింది.

సికింద్రాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
- కారు, ఆటో, రెండు బైకులు ధ్వంసం
- బ్రేకులు పడలేదంటున్న బస్సు డ్రైవర్ అహ్మద్
- బ్రేక్ సరిగానే ఉందన్న ఆర్టీసీ అధికారులు









సికింద్రాబాద్ గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పాస్‌పోర్టు కార్యాలయం ముందు మెట్రోపిల్లర్‌ను ఢీకొన్న బస్సు.. అంతకుముందు బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన కారు, ఆటో. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన బస్సు పాదచారుడిని ఢీకొట్టి డివైడర్ దాటుకొని ఎదురుగా వస్తున్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పాదచారి అక్కడికక్కడే మృతిచెందగా.. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్లాక్‌టవర్ వద్ద శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకొన్నది. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ డిపో-2కు చెందిన బస్సు జేఎన్టీయూ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్నది. క్లాక్‌టవర్ వద్దకు రాగానే అదుపుతప్పి గుర్తుతెలియని పాదచారిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం డివైడర్ దాటుకొని ఎదురుగా వస్తున్న వాహనాలపైకి దూసుకెళ్లి ధ్వంసం చేస్తూ మెట్రో పిల్లర్ నంబర్ 24ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఆటోలో ఉన్న ఇద్దరికి, బైక్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకొన్న గోపాలపురం, మార్కెట్ పోలీసులు గాయపడినవారిని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకొన్నారు. బ్రేకులు ఫెయిలవటం తోనే బస్సును కంట్రోల్ చేయలేకపోయానని బస్సు డ్రైవర్ అహ్మద్ చెప్పారు. కాగా, సంఘటనాస్థలానికి వచ్చిన ఆర్టీసీ ఆర్ఎం రమాకాంత్.. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఆరేండ్ల క్రితం కొనుగోలు చేసిన ఈ బస్సు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నదని, బ్రేక్ మీటర్‌లో ఎయిర్ ప్రెషర్ ఆరు పాయింట్లు చూపిస్తున్నందున బ్రేకులు ఫెయిల్ కాలేదని మెకానిక్‌లు తేల్చినట్టు చెప్పారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందిస్తామని, గాయపడినవారి వైద్యఖర్చులు భరించేందుకు అధికారులకు నివేదిస్తానని హామీఇచ్చారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం 13 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

టీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలి...అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్మారు కాబట్టే తాజా ఎన్నికల్లో పార్టీకి ఘన విజయాన్ని కట్టబెట్టారని అన్నారు సీనియర్ సినీ నటుడు నరేష్. రెండోసారి 90 సీట్లు గెలువడమనేది కేసీఆర్ పనితీరు, పరిపాలన విధానం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని ప్రశంసల్ని కురిపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, తెలుగు సినీ పరిశ్రమకు కేసీఆర్ అందిస్తున్న తోడ్పాటును గురించి నరేష్ 'జిందగీ'తో పంచుకున్న ముచ్చట్లివి..



సమర్థత..నమ్మకం..
కేసీఆర్

కుల, మత, ప్రాంతీయ భేదాలకు తావులేకుండా సుఖ సంతోషాల మధ్య ప్రజలు భద్రతతో కూడిన జీవనం సాగించడానికి కేసీఆర్ అన్నివిధాలుగా తోడ్పాటును అందిస్తున్నారు. రైతుబంధుతో పాటు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల తాలూకు నగదు నేరుగా పేద ప్రజలకు అందుతున్నది. ఆంధ్రాలో కేసీఆర్‌కు అభిమానులు ఉన్నారు. సోషల్‌మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజలు అన్ని విషయాల్ని గమనిస్తున్నారు. విజ్ఞతతో ఆలోచిస్తున్నారు. మంచి పరిపాలన కావాలనే కోరిక అందరిలో ఉంది. ఎలాంటి లోపాలు లేని మంచి పాలనను కేసీఆర్ అందిస్తాడని అన్ని ప్రాంతాలవారు నమ్ముతున్నారు.

తండ్రికి తగ్గ తనయుడు కేటీఆర్

కేసీఆర్‌కు పెద్ద వరం కేటీఆర్. తండ్రికి తగ్గ తనయుడిగా కేటీఆర్ పనితీరు, ప్రవర్తన ఆయన తీసుకునే నిర్ణయాలు, భాషాప్రావీణ్యత, విదేశీ వ్యవహారాల పట్ల ఆయనకున్న పరిజ్ఞానం అద్భుతం అననసామాన్యం. కేటీఆర్‌కు టీఆర్ఎస్ పార్టీ పగ్గాలు అప్పచెప్పడం శుభసూచకం. కేటీఆర్ రూపంలో మనకు మంచి యువనాయకుడు ఉన్నాడని భవిష్యత్ తరాలు గర్వంగా చెప్పుకోవచ్చు.

రైతుబిడ్డగా కేసీఆర్

ప్రకృతి విపత్తులు, ఇతర సమస్యల కారణంగా గత ప్రభుత్వాల పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ రైతుబిడ్డ, రైతుపక్షపాతిగా కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతాల్లో ఇదివరకు బాల్యవివాహాలు జరిగేవి. కల్యాణ లక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత బాల్యవివాహాలు చాలా వరకు ఆగిపోయాయి. ఈ పథకం వల్ల సమాజానికి మంచి జరుగుతున్నది. పెళ్లి అనేది ఆర్థికంగా భారంగా పరిణమించిన తరుణంలో కల్యాణలక్ష్మి పథకం వేలాది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నది. అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి పనులు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యారు కేసీఆర్. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఉపయోగకరంగా ఉంటున్నాయి. ప్రాంతీయ విభేదాలతో సంబంధం లేకుండా తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమకు చెందిన వారందరూ ఇక్కడే ఉండాలని, సినీ పరిశ్రమ హైదరాబాద్‌లోనే స్థిరపడాలని కేసీఆర్ కోరుకుంటున్నారు. కేసీఆర్ కళాప్రియులు. కళాకారులంటే ఆయనకు చాలా అభిమానం. సినీ పరిశ్రమకు సంబంధించి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు, కల్పించిన సదుపాయాలు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అందిస్తున్న ప్రోత్సాహం పట్ల ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ సంతృప్తితో ఉన్నారు.

ఉన్నతమైన నగరంగా హైదరాబాద్..

హైదరాబాద్ నగరానికి ఐదు వందల యేండ్ల చరిత్ర ఉంది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్ని మతాలు, భాషాల వారు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. కేసీఆర్ పరిపాలనలో నగరం మొత్తం ప్రశాంతంగా ఉంది. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. హైదరాబాద్‌లో అద్భుతమైన అభివృద్ధి జరిగింది. రాజుకు మంచి సేనాధిపతులు ఉండటం ముఖ్యం. అలా కేసీఆర్‌గారు హైదరాబాద్ అభివృద్ధి కోసం మంచి అధికారులను నియమించారు. భవన నిర్మాణరంగం, ఫార్మాతో పాటు అన్ని రంగాల్లో హైదరాబాద్ ముందంజలో నిలుస్తున్నది. దేశంలోనే ఉన్నతమైన నగరాల్లో ఒకటిగా నిలిచింది.

ఏకైక నాయకుడు కేసీఆర్

ప్రస్తుతం దేశ రాజకీయ పరిణామాల పట్ల ప్రజల్లో అభద్రతా భావం నెలకొన్నది. కాంగ్రెస్ వస్తే పరిస్థితి ఏమిటి? బీజేపీకి సంపూర్ణ మెజారిటీ వస్తుందా? రాదా? అనే అనుమానాలు మొదలయ్యాయి. సింగిల్ పార్టీ అధికారంలోకి రావడం ప్రస్తుతం కష్టంగా మారింది. వివిధ పార్టీలను కలుపుకొంటూ పోయే బలమైన థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు ఆవశ్యకంగా మారింది. ఈ తరుణంలో అందరి బంధువుగా ప్రతి ఒక్కరినీ కలుపుకొనిపోగల సమర్థత, నమ్మకం కలిగిన ఏకైక వ్యక్తిగా కేసీఆర్ కనిపిస్తున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న నాయకులతో పోలిస్తే కేసీఆర్ ఒక్కరే ఆ శక్తిసామర్థ్యాలు కలిగిన నాయకుడిగా ఉన్నారు. ప్రాంతీయ పార్టీలను కలుపుకొంటూ వ్యూహాత్మకంగా దేశానికి బలం చేకూర్చగలిగే సత్తా కేసీఆర్‌కు ఉంది. తెలంగాణలో ఘనవిజయం తర్వాత దేశంలోని చాలామందిలో కేసీఆర్ పట్ల ఒక ఆశ నెలకొంది. కచ్చితంగా అది నెరవేరుతుందని నమ్ముతాను. కేంద్ర రాజకీయాల్లో గొప్ప రాజనీతిజ్ఞుడిగా కేసీఆర్ నిలుస్తాడు. అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చే దమ్ము అయనలో ఉంది.

47యేండ్ల నట ప్రయాణం..

నేను ఇండస్ట్రీలో అడుగుపెట్టి 47 యేండ్లు అవుతుంది. హీరోగా పలు సక్సెస్‌లు చూసిన నేను సహాయనటుడిగా మారిన తర్వాత ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. చాలా రోజుల విరామం తర్వాత చిత్రసీమలోకి పునరాగమనం చేయడంతో నాకు ఎలాంటి పాత్రలు సరిపోతాయో తెలియని సందిగ్ధంలో ఎవరూ అవకాశాలు ఇవ్వలేకపోయారు. ఆ ఇబ్బందుల్ని దాటుకొని సక్సెస్‌లను అందుకోవడానికి పదేళ్లు పట్టింది.

మూడు తరాల దర్శకులతో..

జంధ్యాల, బాపు నుంచి వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల వరకు మూడు తరాల దర్శకులతో పనిచేసే అవకాశం నాకు దొరికింది. స్వతహాగా నేను దర్శకుడి నటుడిని. ఇమేజ్‌లకు కట్టుబడడం నచ్చదు. పాత్రకు కావాల్సిన నటనను ప్రదర్శించి దర్శకుడిని సంతృప్తిపరుచడానికే ప్రయత్నిస్తాను. విశ్వనాథ్, జంధ్యాల, విజయనిర్మల వంటి గొప్ప దర్శకులతో ఏ విధంగా భయం, భక్తితో పనిచేశానో అలాగే కొత్త దర్శకులతో పనిచేస్తాను.


తెలుగు నటుల కొరత ఉంది..

ఇండస్ట్రీలో తెలుగు నటుల కొరత చాలా ఉంది. పరాయి భాషల నుంచి నటుల్ని దిగుమతి చేసుకొనే పద్ధతి నాకు నచ్చదు. మన భాషా, భావోద్వేగాలపై ఇతరులకు అంతగా పట్టు ఉండదు. నటుడిగా ఎస్వీ రంగారావు నాకు ఆదర్శం. ఆయనలా ఎలాంటి పాత్రనైనా తెలుగునటులు చేయగలరని నిరూపించుకోవాలని ఉంది. దృశ్యం, గుంటూరు టాకీస్ నుంచి రంగస్థలం, మహానటి వరకు నవరసాల్ని పడించే అవకాశం దొరికింది. వైవిధ్యమైన పాత్రల వల్లే వరుస విజయాలు దక్కుతున్నాయి. ప్రస్తుతం చాలామంది రచయితలు, దర్శకులు నన్ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాత్రల్ని సృష్టిస్తున్నామని చెప్పడం గర్వంగా ఉంది. ఆ మాటలకు మించిన అవార్డ్ ఏదీ లేదు.

తుది శ్వాసవరకు..

సినిమా వాతావరణంలోనే పుట్టి పెరిగాను. కెమెరా, మేకప్‌లతోనే నా జీవితం గడుస్తున్నది. ఇతర వ్యాపకాలు నాకు లేవు. ఉదయం నిద్రలేచింది మొదలు నిద్రపోయేవరకు కథలు వినడం, మంచి పాత్రలు చేయడం, అలాంటి వాటి కోసం ఎదురుచూడడంతోనే గడిచిపోతుంది. ఆ పాత్రలకు లభిస్తున్న ప్రశంసలు వింటూ సంతోషపడుతుంటాను. ఆఖరి శ్వాస వరకు నటిస్తూనే ఉంటాను.

...నరేష్ నెల్కి
సీఎం ప్రవీణ్‌కుమార్



చిన్నసాయం.. పెద్ద సమస్యకు పరిష్కారం

ఆ విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి నానా కష్టాలు పడేవాళ్లు. రోడ్డు మార్గం లేని ఆ గ్రామస్తులు నదిలో సాహసం చేయాల్సి వచ్చేది. ఇదంతా చూసిన జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇంతకీ ఆమె ఏం చేసిందంటే..






పోతే మళ్లీ తిరిగి వస్తామో రామో తెలియదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాలి. ఛత్తీస్‌గఢ్‌లోని బాలోడ్ జిల్లా అరాజ్‌పురి గ్రామం. ఆ ఊరు నుంచి వేరే ఊరికి వెళ్లాలంటే నది దాటాలి. అది విద్యార్థులైనా, వృద్ధులైనా. రోడ్డు మార్గమే ఉండదు. పడవ ప్రయాణమే దిక్కు. విద్యార్థులు పక్క ఊర్లో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు గ్రామస్తులు ఖాళీ నూనె డబ్బాలు, కట్టెలతో పడవను తయారు చేసుకున్నారు. దాని ద్వారనే నది దాటి గమ్యం చేరేవారు. ఒక రోజు ఆ జిల్లా కలెక్టర్ కిరణ్ కౌషల్ గ్రామంలో పర్యటించారు. ఈ సమస్యను చూసిన ఆమె చలించిపోయారు. స్కూల్‌కి వెళ్లిన విద్యార్థులు తిరిగి వచ్చే సరికి నది ఒడ్డున బహుమతిని పెట్టారు. దాన్ని చూసిన చిన్నారుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. కలెక్టర్ చేసిన చిన్న సాయం వల్ల పెద్ద సమస్యకు పరిష్కారం లభించింది. విద్యార్థుల కోసం, గ్రామస్థుల కోసం మోటార్ బోటును, లైఫ్ జాకెట్లను ఏర్పాటు చేయించారు. హోంగార్డ్‌లను నియమించారు. దీంతో పాటు గ్రామస్తుల కోరిక మేరకు మరిన్ని ఫైబర్ బోట్లను కూడా పదిహేను రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు కలెక్టర్ కౌషల్.

సిరిముగ్గు

20 చుక్కలు
4 వరుసలు
4 వచ్చే వరకు



మీరు ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం-10, హైదరాబాద్-500034.
zindagi.nt@gmail.com



దొంతం స్వప్న
సిరిముగ్గు,
నల్లగొండ

మరక మంచిదే!

పార్టీలు, ఫంక్షన్‌లకి నచ్చిన దుస్తులు వేసుకుంటాం. పార్టీల్లో భాగంగానే ఐస్‌క్రీమ్, జ్యూస్ లంటూ అన్ని తినాలనుకుంటాం. పొరబాటున చేయి జారి బట్టలపై పడుతుంది. ఈ మరకలు అంత సులువుగా వదలవు. ఈ చిట్కాలు పాటిస్తే బట్టలపై మరకలు పోయి తిరిగి కొత్తవాటిలా మెరుస్తాయి.



- షర్ట్ మీద పడ్డ చాక్లెట్ మరకలను తొలిగించడం తేలికే. ఎలా అంటే మరక ఉన్న షర్ట్‌ని డిటర్జంట్‌తో మృదువుగా ఉతుకాలి. ఆ తర్వాత చల్లని నీటిలో 15 నిమిషాల పాటు ఉంచి మళ్లీ ఉతుకాలి. దీంతో మరక వదులుతుంది.
- వేడినీటిలో వెనిగార్, డిటర్జంట్ పౌడర్‌ని వేయాలి. అందులో కాఫీ మరక ఉన్న షర్ట్‌ని నానబెట్టాలి. 15 నిమిషాల తర్వాత డిటర్జంట్‌తో బాగా ఉతుకాలి.
- బట్టలపై ఇంకు మరకలు పడితే తొలిగించడం చాలా కష్టం. బట్ట మీద ఇంక్ పడగానే టిష్యూతో తుడవాలి. మొత్తం ఇంక్ ఇంకిపోయే వరకు తుడుస్తూనే ఉండాలి. ఆ తర్వాత డిటర్జంట్‌తో ఉతుకాలి.
- గ్రీజ్ మరక పడితే దాని మీద బేబీ పౌడర్ వెయ్యాలి. గ్రీజ్‌లో ఉన్న ఆయిల్‌ని ఈ పౌడర్ పీల్చుకుంటుంది. తర్వాత 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టి డిటర్జంట్‌తో ఉతికితే సరిపోతుంది.

నమస్తే తెలంగాణ

సింగిడి

[హైదరాబాద్]

ఆదివారం 13 జనవరి 2019

ట్రాన్స్‌లేట్ లవ్!

అబ్బాయేమో ఇటాలియన్, అమ్మాయేమో బ్రిటిషర్. ఒకరి భాష ఒకరికి రాదు. అయినా వీళ్లు రెండేళ్ల నుంచి ప్రేమలో ఉన్నారు. త్వరలో పెండ్లి కూడా చేసుకోబోతున్నారు. ఒకే భాషలో మాట్లాడుకునే ప్రేమికులే సరిగా మాట్లాడుకోలేక లవ్‌కు బ్రేకప్ చెబుతుంటే.. వీరేమో భాషలు వేరైనా ప్రేమలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇంతకీ వీళ్లు ఎలా మాట్లాడుకుంటున్నారో తెలుసా?



ఈ మధ్య టీవీ యాడ్స్‌లో.. వాయిస్ కమాండింగ్‌తో పనిచేసే గూగుల్ ట్రాన్స్‌లేట్ యాడ్ బాగా పాపులర్ అయింది. వేరే దేశానికి చెందిన వ్యక్తి.. మరో దేశానికి చెందిన వ్యక్తితో ఈ గూగుల్ ట్రాన్స్‌లేట్ ద్వారా మాట్లాడుకోవడం, సందేహాలు నివృత్తి చేసుకోవడం మనం చూస్తున్నాం. అచ్చం అలాగే.. గూగుల్ ట్రాన్స్‌లేట్‌తో వేర్వేరు దేశాలకు చెందిన ఓ ప్రేమజంట ఒక్కటైంది. అంతేకాదండోయ్ రెండేళ్లుగా గాఢంగా ప్రేమించుకుంటున్నారు కూడా. లండన్‌కు చెందిన 23 యేండ్ల ఛ్లోయి స్మిత్, ఇటలీకి చెందిన 25 యేండ్ల డానియేల్ మార్సికో మోడ్రన్ లవర్స్‌కు కేరాఫ్‌గా మారారు. వీరు స్పెయిన్‌లోని ఇబిజ దీవిలో ఓ పార్టీలో కలుసుకున్నారు. డానియేల్‌ను చూడగానే లవ్ ఎట్ ఫస్ట్ సైట్ మాదిరి మనసు పారేసుకున్నది ఛ్లోయి. ఎలాగైనా డానియేల్‌తో మాట్లాడాలని విశ్వప్రయత్నం చేసింది. కారణం ఇద్దరి భాషలు వేరు కావడమే. చివరిగా గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌తో డానియేల్ సెల్ నంబర్ తీసుకుంది. తర్వాత అతనిపై తనకున్న ప్రేమను ట్రాన్స్‌లేట్ యాప్ ద్వారా వ్యక్తపరిచింది. అంత అందమైన యువతి, అందులోనూ వేరే దేశస్థురాలు లవ్ ప్రపోజ్ చెయ్యడంతో ఓకే అనేశాడు డానియేల్. ఇలా ఇద్దరూ హావభావాలు, వస్తువులు, పదార్థాలు, భాష.. వాటి గురించి తెలుసుకునేందుకు సబ్ టైటిల్స్ వచ్చే పాత సినిమాలు బాగా చూసేవారు. క్రమంగా ఇద్దరూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని పెండ్లికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ లండన్‌లోనే ఉంటున్నారు. మొత్తానికి ప్రేమకు కుల మతాలు, ప్రాంతాలు, దేశాలు, భాషలు అడ్డుకాదని ఈ జంట నిరూపిస్తున్నది.



మొహం పచ్చడి చేసింది!

'ఫ్లూటు జింక ముందు ఊదు.. సింహం ముందు కాదు..' లెజెండ్ సినిమాలో ఈ డైలాగ్ చాలా ఫేమస్. ఇప్పుడేం సందర్భం వచ్చిందనేగా మీ సందేహం? ఈ దొంగ పరిస్థితి కూడా అంతే. బొమ్మ తుపాకీ పట్టుకొని.. ఫైటింగ్ చాంపియన్‌ను బెదిరించాడు. ఆమె ఊరుకుంటదా..?! ఇలా మొహం పచ్చడి పచ్చడి చేసి పోలీసులకు అప్పగించింది.

ఇంతకీ ఏం జరిగిందంటే.. బ్రెజిల్‌కు చెందిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) ఫైటర్ పోల్యానా వియనా.. తన ఇంటి బయట ఉబర్ క్యాబ్ కోసం ఎదురుచూస్తున్నది. ఇంతలో ఈ దొంగ వచ్చి ఆమెకు సమీపంలో కూర్చున్నాడు. కొద్దిసేపు అయ్యాక 'టైం ఎంతైంది' అని అడిగాడు. ఆమె టైమ్ చెప్పింది. అయినా దొంగ అక్కడి నుంచి కదల్లేదు. దీంతో అతడిపై వియానాకు అనుమానం కలిగింది. వెంటనే తన పర్స్, ఫోన్ దాచే ప్రయత్నం చేస్తుండడంతో.. అతను తుపాకీ తీసి బెదిరించే ప్రయత్నం చేశాడు. 'నా దగ్గర గన్ ఉంది. ఇక్కడ ఏమీ జరగనట్లే ఉండు. కదిలావంటే కాల్చి పడేస్తా.. నీ దగ్గర ఉన్న డబ్బులు, ఫోన్ నా చేతిలో పెట్టి వెళ్లిపో' అంటూ జులాయి సినిమాలో బ్రహ్మానందంలా బెదిరించాడు. అయితే, అతని చేతిలో ఉన్న గన్.. డమ్మీదని గుర్తించింది వియానా. వెంటనే సివంగిలా రెచ్చిపోయింది. మార్షల్ ఆర్ట్స్ రింగ్‌లో ప్రత్యర్థిపై విరుచుకుపడ్డట్లు.. పంచ్‌ల వర్షం కురిపించింది. తనకు వచ్చిన అన్ని పంచ్‌లను అతడిపై ప్రయోగించింది. దీంతో అతగాడి రూపురేఖలే మారిపోయాయి. ముఖం నుంచి కాళ్ల వరకు రక్తం కారేలా కొట్టింది. ఒక్కమాటలో చెప్పాలంటే పచ్చడి చేసింది. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చింది. 26 యేండ్ల వియానా అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ (యూఎఫ్‌సీ) ఫైటర్. ఆమె ఫైటింగ్ రింగులోకి దిగితే ఎదుర్కోవడం ఎవరి తరం కాదు. ఇప్పటి వరకు ఆమె 12 పోటీల్లో పాల్గొని 10సార్లు విజేతగా నిలిచింది.

56 భాషలు మాట్లాడతాడు!

మూడు నాలుగు భాషల్లో మాట్లాడాలంటేనే నానా హైరానా పడుతుంటారు కొంతమంది. అలాంటిది ఈయన మాత్రం ఏకంగా 56 భాషలను మాట్లాడగలడు ఎక్కడా గుక్క తిప్పుకోకుండా. ఇన్ని భాషలు ఎలా నేర్చుకున్నాడో అనేగా మీ సందేహం. యూట్యూబ్ ద్వారానే అది సాధ్యమైందని చెబుతున్నాడు మహమ్మద్ మెసిక్.



టెజ్లాకు చెందిన మహమ్మద్ అసాధారణ ప్రతిభను చూసి అందరూ ముక్కున వేలేసుకోవాల్సిందే. చాలా మంది ఒక కొత్త భాషను నేర్చుకోవటానికే కిందా మీదా పడుతుంటారు. అలాంటిది మహమ్మద్ మెసిక్ మాత్రం ఏకంగా 56 భాషలను టకటకా ఎటువంటి పాజ్‌లు లేకుండా మాట్లాడేయగలడు. ఉపన్యాసాలు దంచేయగలడు. అలాగే 70 దాకా భాషలను అర్థం చేసుకోగలడు కూడా. చిన్నతనంలోనే, అంటే ఐదేండ్ల వయసులోనే అతను టూర్‌కి వెళ్లిన ప్రాంతానికి చెందిన భాషను నేర్చుకుని తల్లిదండ్రులను అబ్బురపరిచాడు. ఆ తరువాత కొత్త భాషలను నేర్చుకోవడం అతనికి అలవాటుగా మారింది. దాంతో తల్లిదండ్రులు అతణ్ని వైద్యునికి చూపించగా అతనికి ఉన్న ఆటిజమే బహుభాషాకోవిదుడుగా మారడానికి తోడ్పడిందని చెప్పారు. మరి ఇతను అన్ని భాషలనూ స్వయంగా వినే నేర్చుకోలేదు. ఆన్‌లైన్‌లో, యూట్యూబ్, పుస్తకాలు, కార్టూన్ల ద్వారా మహమ్మద్ కొన్ని కొత్త భాషలను నేర్చుకున్నాడంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగక మానదు.





కోడీ ఐస్ క్లింబింగ్ ఫెస్టివల్

అమెరికా సంయుక్త రాష్ట్రమైన వ్యోమింగ్‌లోని కోడీలో ఈ ఫెస్టివల్ జరుగుతుంది. పర్వతం నుంచి జాలువారే మంచు గడ్డకడుతుంది. ఆ స్నోఫాల్ ఆధారంగా ఆ పర్వతాన్ని అధిరోహించడం దీని ప్రత్యేకత. ఇది వినోదభరితమైన ఫెస్టివల్. స్థానికులు, పర్యాటకులు ఎంతో ఉత్సాహంతో ఇందులో పాల్గొంటారు. ఫిబ్రవరి రెండోవారంలో ఇది ప్రారంభమవుతుంది.

మంచు కురిసే వేడుకలు!

ఉదయం పూట మంచు 8 గంటల వరకూ ఉంటేనే మనం ఇబ్బంది పడుతుంటాం. అలాంటిది మంచు కురిస్తే వీళ్లకు పండగే. గడ్డ కడితే.. ఇక వాళ్ల ఆనందానికి హద్దే ఉండదు. ఎందుకంటే మంచు కురిస్తే చాలు.. వీరంతా పండగలు జరుపుకుంటారు. అదికూడా మామూలుగా కాదు.. నెల రోజులకు పైనే. మంచుతోనే అద్భుత కట్టడాలు, కోటలు, పెద్ద పెద్ద మంచు శిల్పాలు నిర్మిస్తారు. వాటికి అందమైన లైటింగ్ పెట్టి.. పిల్లలు, పెద్దలంతా కలిసి పెద్ద వేడుకలా జరుపుకుంటారు. ఈ జనవరి నెలలో ప్రపంచంలో పలుచోట్ల జరుగుతున్న ఐస్ ఫెస్టివల్స్ ప్రత్యేకతలేంటో తెలుసుకుందామా?

ఐస్ మ్యూజిక్ ఫెస్టివల్

నార్వేలోని గెయిలో జరిగే ఈ ఐస్ మ్యూజిక్ ఫెస్టివల్ సరికొత్త అనుభూతిని పంచుతుంది. ముఖ్యంగా సంగీత ప్రియులకు ఇది ఫేవరెట్ ఫెస్టివల్. ఒక పక్క అందమైన మంచు శిల్పాలు, మరో పక్క వీనుల విందైన సంగీతం కొత్త లోకాన్ని పరిచయం చేస్తాయి. జనవరి వచ్చిందంటే చాలు.. సంగీత ప్రియులు ఇక్కడ వాలిపోతుంటారు.





ఐస్ మ్యాజిక్ ఫెస్టివల్

కెనడాలోని బన్నఫ్‌లో లేక్ లూయిస్ ప్రాంతంలో ఈ వేడుక జరుగుతుంది. ఇక్కడ గడ్డ కట్టి ఉండే మంచును రకరకాల రూపాల్లో చెక్కుతారు. ఈ సందర్భంగా నిర్వహించే పోటీలు దాదాపు 36 గంటల పాటు సాగుతాయి. వీటిని రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరిస్తారు. ఈ పోటీలు సందర్శకులకు ఐస్ యాక్టివిటీలన్నీ ఫ్రీ. స్లెడింగ్, హాకీ.. తదితర ఆటలు ఉచితంగా ఆడేసుకోవచ్చు. వీటితోపాటు ఎడ్మాటన్ సిటీలో 'ఐస్ ఆన్ వెటే ఫెస్టివల్' వేడుక జరుగుతుంది. రష్యా, న్యూజిలాండ్, మలేషియాకు చెందిన కళాకారులు స్థానిక కళాకారులతో పోటీ పడతారు. అబ్బురపరిచే మంచు శిల్పాలను చూడాలనుకునేవారు తప్పకుండా సందర్శించాల్సిన ప్రాంతం ఇది. దాదాపు 155,000 పౌండ్ల బరువుండే 500 బ్లాకుల ఐస్‌తో ఇక్కడ ప్రత్యేక ప్రపంచాన్ని తయారు చేస్తారు.

సప్పారో స్నో ఫెస్టివల్

జపాన్ దేశంలోని సప్పారోలో ఈ ఐస్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. ఇది ఫిబ్రవరి నెలలోని మొదటి వారంలో ప్రారంభమవుతుంది. కేవలం ఏడు రోజులే దీనిని నిర్వహిస్తారు. మంచుగడ్డలతో రూపొందే కళాఖండాలు చూస్తే.. ఔరా! అనక మానరు. ప్రతియేటా కొత్తకొత్త కళాఖండాలను ఆవిష్కరిస్తారు. ఇది 1950లో ప్రారంభమైంది. ప్రతియేటా 2 మిలియన్‌ల మంది ప్రజలు ఈ వేడుకలు చూడ్డానికి వస్తారు.






ఇంటర్నేషనల్ హర్బిన్ ఐస్ ఫెస్టివల్

చైనాలో 1980లో తొలిసారి ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రపంచంలోనే అత్యంత పెద్ద మంచు కళాఖండాలు ఇందులో ప్రదర్శిస్తున్నారు. ఇది అన్ని ఫెస్టివల్స్ కంటే చాలా ప్రత్యేకం. ఈ వారంలోనే ఈ ఇంటర్నేషనల్ ఐస్ ఫెస్టివల్ ప్రారంభమైంది. కళ్లు మిరుమిట్లు గొలిపే లైట్ ప్రత్యేక ఆకర్షణ. ఏటా వివిధ దేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. దాదాపు 1,20,000 ఘనపు మీటర్ల మంచు, స్నో ఫాల్‌తో ఈ ఐస్ వరల్డ్ నిర్మించారు. ఇక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 35 సెంటీగ్రేడ్స్‌కు పడిపోయాయి. ఆర్టిస్టులు నెలపాటు బాగా శ్రమించి ఇలా మంచు నగరాన్ని నిర్మించారు. ఇక్కడ ఈత పోటీలు కూడా జరుగుతాయి. దాదాపు 300 మంది ఈ పోటీలో పాల్గొంటారు.

హవచాన్ సాన్చియోన్ ఐస్ ఫెస్టివల్

దక్షిణ కొరియాలోని హవచాన్ సాన్చియోన్‌లో జరిగే ఈ ఐస్ ఫెస్టివల్ చాలా ప్రత్యేకం. ఎందుకంటే స్థానిక బుఖాన్‌గంగ్ నదిలో చేపలు పట్టడమే ఈ ఫెస్టివల్ స్పెషల్. ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే ఈ ఫెస్టివల్‌కు జనవరి చివరి వారం నుంచే హడావుడి, టూరిస్టుల కోలాహలం మొదలవుతుంది. ఫిబ్రవరి మొదటివారంలో బుఖాన్‌గంగ్ నది పూర్తిగా గడ్డకట్టుకుపోతుంది. దీంతో గాలాలతో ఎక్కువ చేపలు పట్టిన వారికి బహుమతులు ఉంటాయి. మరీ ముఖ్యంగా చేతులతో పట్టే వారికి ప్రత్యేక బహుమతులు ఉంటాయి.





బెల్జియంలో ఐస్ వండర్‌లాండ్ స్కల్ప్చర్ ఫెస్టివల్

బెల్జియంలోని బ్రుగ్స్‌లో జరిగే 'ఐస్ వండర్‌లాండ్ స్కల్ప్చర్ ఫెస్టివల్' పాశ్చాత్య యూరప్ అంతటికి పెద్ద వేడుక. దీనిని తిలకించేందుకు ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. జనవరిలో ప్రారంభమ్యే ఈ ఫెస్టివల్‌లో జానపద కథల ఆధారంగా మంచు విగ్రహాలు తయారు చేస్తారు. ప్రతియేటా వందల మంది కళాకారులు ఎంతో కష్టపడి మంచు కళాఖండాలు రూపొందిస్తారు.

పారిస్ స్నో ఫెస్టివల్

ఫ్రాన్స్ నగరంలో ఏటా జనవరి నెలలో ఈ వేడుక జరుగుతుంది. దాదాపు రెండు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ వేడుకను చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తారు. అంతర్జాతీయ స్థాయి కళాకారులు చెక్కే మంచు శిల్పాలు చూపు తిప్పుకోనివ్వవు.



ఐస్ స్కల్ప్టింగ్ ఫెస్టివల్

ఇంగ్లండ్ దేశంలోని లండన్‌లో ప్రతి యేటా ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. మంచు గడ్డలతో కళాఖండాలు ఎలా తయారు చెయ్యాలో.. కళాకారులు నేర్పుతారు. ఔత్సాహికులైన స్థానికులకు, పర్యాటకులకు శిక్షణ కూడా ఇస్తుంటారు.

...✍ డప్పు రవి

గుడ్లు తెగ తినేస్తున్నారు..!

ఏమండోయ్ ఇది విన్నారా? మన హైదరాబాద్‌లో రోజుకు 55 లక్షల కోడి గుడ్లు తింటున్నారట తెలుసా? ఒక్క హైదరాబాదే కాదండోయ్.. తెలంగాణలోని పట్టణ ప్రాంతాల్లో కోడి గుడ్డు వినియోగం బాగా పెరిగిపోయిందట. దీంతో గుడ్లు వినియోగంలో తెలంగాణ టాప్‌లోకి వచ్చేసింది.



కోడిగుడ్ల వినియోగంలో తెలంగాణ ముందంజలో ఉంది. నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (నెక్) నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలోనే కోడి గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో కోడిగుడ్ల తలసరి వినియోగం ఏడాదికి 180 అని తేల్చింది నెక్ నివేదిక. ఇది జాతీయ పౌష్టికాహార సంస్థ(ఎన్ఐఎన్) చెప్పిన తలసరి వినియోగానికి సమానం అని తన నివేదికలో పేర్కొంది నెక్. ఈ నివేదిక ప్రకారం కోడిగుడ్ల వినియోగంలో తెలంగాణ టాప్‌లో నిలిచింది. ఇక దేశ వ్యాప్తంగా రోజుకు 22 కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతుండగా.. అందులో తెలంగాణ వాటా 3.2 కోట్లు అని నెక్ తెలిపింది. తెలంగాణలో రోజుకు 1.7 కోట్ల కోడిగుడ్లను వినియోగిస్తుండగా.. అందులో హైదరాబాద్‌లోనే 55 లక్షల కోడిగుడ్లను లాగించేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంది. మరోవైపు పక్కనే ఉన్న ఏపీలో మాత్రం కోడిగుడ్ల తలసరి వినియోగం 119 మాత్రమేనని నెక్ నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో 123 కోడిగుడ్ల తలసరి వినియోగంతో తమిళనాడు రెండో స్థానంలో ఉండగా మూడోస్థానంలో ఏపీ, తర్వాతి స్థానాల్లో కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లు నిలిచాయి. చివరిగా తలసరి 12 కోడిగుడ్ల వినియోగంతో రాజస్థాన్ ఈ జాబితాలో చివరన ఉంది.

సుడోకు

డైలీ సుడోకు 28 సమాధానం

4	8	2	6	5	7	9	1	3
7	5	1	2	9	3	8	4	6
9	3	6	8	1	4	5	2	7
3	9	8	4	7	1	6	5	2
1	6	5	3	8	2	4	7	9
2	7	4	9	6	5	1	3	8
5	2	9	1	3	8	7	6	4
6	1	3	7	4	9	2	8	5
8	4	7	5	2	6	3	9	1

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -29

		6	2				3	
	5			6	1			2
9		3			8	1		
			8		9			6
5		4	1					8
8	7	2					4	
4	6	1		5				

ట్వీట్



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిత్రాన్ని ఓ చిన్నారి తన స్కూల్‌లో ప్రాజెక్ట్ వర్క్‌గా చేసింది. ఏ భాషలో చెప్పినా మీటూ అనేది విశ్వవ్యాప్తంగా ఉన్న సమస్య. ఆ చిత్రంలో కనిపిస్తున్న కళ్లు నావే. నేను ఆ చిన్నారితో మాట్లాడాను. మీటూ సమస్య మీద నేను మాట్లాడినందుకు డబ్బింగ్ యూనియన్ నుంచి నాపై నిషేధం ప్రకటించారు. అయినా సరే నేను ప్రశ్నించడం ఆపను.

చిన్మయి శ్రీపాద
@Chinmayi



చిన్మయిని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

9,99,689

కామన్‌మ్యాన్ వాయిస్

జోకులు ఎదుటివాళ్ల మీద వేస్తే బాగా ఎంజాయ్ చేస్తాం. అవే జోకులు మన మీద వేస్తే తట్టుకోలేం మరి. ఇది ఎవరూ కాదనలేని నిజం.
–Vanaja Srinivas

ఎన్టీఆర్ సినిమా విజయాలలో తోడుగా ఉన్న కాంతారావుని బయోపిక్‌లో లేకుండా చేశారు. పాపం ఆయన తెలంగాణ వాడు కావడమే ఆయన దురదృష్టం.
– Venkat Boodida

నాదెండ్ల లీక్స్‌పై పచ్చ చానెల్స్ ఎందుకు డిబేట్స్ పెట్టడం లేదు. మేధావులు ఎక్కడున్నారు?
–Ram Jonnalagadda

వైరల్ వీడియో



'రంగుల పుట్టిల్లూ.. తెలుగూ లోగిళ్లూ, ముగ్గులతో వాకిట విరిసే హరివిల్లూ' అంటూ మంగ్లీ పాడిన సంక్రాంతి పాట యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది. మైక్‌టీవీ ద్వారా విడుదలైన ఈ పాటను ఎక్కువ మంది చూస్తున్నారు.

Sankranthi Song 2019 || Mangli || Hanmanth Yadav || Mittapalli Surendar || Full Song || Mictv || HD

Total views : 433,443+

Published on Jan 11, 2019

నమస్తే తెలంగాణ
అల్లరి
[హైదరాబాద్]
ఆదివారం 13 జనవరి 2019

జతపరుచండి

1. గూగుల్
2. ఫేస్‌బుక్
3. వాట్సప్
4. ట్విటర్
5. ఇంస్టాగ్రామ్

A. జాన్ కౌమ్
B. కెవిన్ సిస్ట్రోమ్
C. సుందర్ పిచాయ్
D. మార్క్ జూకర్‌బర్
E. జాక్ డోర్సే

1 Google 2 facebook 3 WhatsApp 4 twitter 5 Instagram

ప్రముఖ సోషల్ మీడియా సీఈవోలను వారి సంస్థలతో జతపరుచండి




బ్లడ్ రిలేషన్స్



1. బాబాయ్ అక్క కొడుకు కూతురు మీ ఆయనకేమవుతుంది?
2. పెద్దమ్మ చెల్లి కోడలి అన్న కొడుకు నీకేమవుతాడు?
3. పెదనాన్న బావమరిది అక్క కూతురు మీ నాన్నకేమవుతుంది?
4. మీ వదిన అన్న భార్య మీ అన్నకేమవుతుంది?
5. మరదలు అన్న భార్య మీ అమ్మకేమవుతుంది?

గొర్రెను గుర్తించండి





13 యేండ్లకే సాఫ్ట్‌వేర్ కంపెనీ!

స్కూల్ ఎప్పుడు అయిపోతుందా అని కొంత మంది చూస్తుంటారు. ఇంటికి వెళ్లగానే తిని ఏ ఆట ఆడుదాం అని ఇంకొంతమంది ఆలోచిస్తారు. కానీ ఈ అబ్బాయి ఏకంగా సాఫ్ట్‌వేర్ కంపెనీనే ప్రారంభించాడు.

ఇతని పేరు ఆదిత్యన్ రాజేష్.. వయసు 13 యేండ్లు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించాడు. కంపెనీ స్థాపించాలంటే యజమానికి కనీసం 18 యేండ్లు నిండి ఉండాలి. అంత వయసు లేకపోయినా ముగ్గురు స్నేహితులతో కలిసి ఓ కంపెనీ స్టార్ట్ చేశాడు. ఇప్పటికే 12 మంది క్లయింట్స్ ఉన్నారు. ప్రస్తుతం డిజైనింగ్, కోడింగ్ సేవల్ని వారికి ఉచితంగా అందిస్తున్నారు. ట్రైనెట్ సొల్యూషన్ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించిన ఆదిత్యకు చిన్నప్పటి నుంచీ టెక్నాలజీ అంటే చాలా ఇష్టం. దాంతో కంపెనీల లోగోలు, వెబ్‌సైట్స్ క్రియేట్ చేసేవాడు. తొమ్మిదేండ్ల వయసులో తొలి మొబైల్ అప్లికేషన్‌ని రూపొందించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆదిత్య కేరళలోని తిరువిల్లాలో పుట్టాడు. ఐదేండ్లు ఉన్నప్పుడు ఆదిత్య కుటుంబం కేరళ నుంచి దుబాయ్‌కి మారింది. అదే సమయంలో బీబీసి టైపింగ్ అనే వెబ్‌సైట్ గురించి తన తండ్రి ద్వారా తెలుసుకున్నాడు. ఇది చిన్నారులు టైపింగ్ నేర్చుకోవడానికి ఉపయోగపడే సులువైన వెబ్‌సైట్. అలా టైపింగ్.. ఆ తర్వాత ఇంటర్నెట్‌ని నేర్చుకొని ఒక కంపెనీనే ప్రారంభించే స్థాయికి ఎదిగాడు. భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆదిత్యన్ చెబుతున్నాడు.

గుహలాంటి ఐస్ హోటల్!



హోటల్ అంటే వచ్చామా.. తిన్నామా.. రెండు రోజులు ఉన్నామా అన్నట్లు ఉంటాయి. మరికొన్ని హోటల్స్ మాత్రం ప్రత్యేకంగా నిర్మితమై ఉంటాయి. వాటిలో మాత్రం రోజుల తరబడి ఉండాల్సినిపిస్తుంది. అలాంటిదే ఈ హోటల్ కూడా. పర్యాటక స్థలంలా మారిన.. దీనికి చాలా ప్రత్యేకతలున్నాయి. ఈ హోటల్ ఇటుకలు, రాళ్లతో కట్టలేదు. అద్దాలతో అంతకన్నా కాదు. పెద్దపెద్ద కొండలను పగులకొట్టి గుహలు, శిల్పాలుగా చేయడం చూశాం. ఈ హోటల్‌ని ఎలా కట్టారో తెలిస్తే నోరెళ్లబెడుతారు. మంచుగడ్డలతో ఈ హోటల్‌ని తయారు చేశారు. ఈ



ఐస్‌హోటల్ జుక్కాస్‌జర్వీలోని స్వీడిష్ గ్రామానికి చెందిన ఆర్కిటిక్ సర్కిల్‌కి ఉత్తరంగా 200 కి.మీ ల దూరంలో ఉన్నది. 2018 డిసెంబర్ 14న సందర్శకుల కోసం హోటల్ తలుపులు తెరుచుకున్నాయి. చలికాలంలో మాత్రమే ఈ హోటల్‌ని తెరుస్తారు. దీనిని 1989లో స్థాపించారు. 28 సంవత్సరాలు పూర్తి చేసుకొని 29లోకి అడుగుపెడుతూ డిసెంబర్ 14న సెలబ్రేషన్స్‌లు కూడా జరిగాయి. 60 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ హోటల్‌కి ఎంతమంది టూరిస్టులు వచ్చినా ఉండడానికి అన్ని వసతులు కల్పిస్తున్నది. హోటల్ లోపల గుడిసెల్లాంటి ఇగ్లూని ఏర్పాటుచేశారు. ఐస్‌హోటల్‌ని చూడ్డానికి వచ్చిన వారెవ్వరూ వెంటనే తిరిగి వెళ్లరు. రెండు మూడు రోజులుండి అక్కడ జరిగే వినోదాలనూ చూసి ఆనందంగా గడుపుతారు.

లోపల ఇలా ఉంది..

ఈ హోటల్‌ని నిర్మించిన అతనికి మామూలు హోటల్ ఉండేది. దాంట్లో ప్రత్యేకత ఏముందనిపించింది. అందుకే.. మంచుతో ఇలా నిర్మాణం చేపట్టాడు. హోటల్ లోపల విగ్రహాలు, కార్లు, బొమ్మలను చాలా అందంగా చెక్కారు. డిసెంబర్ నాటికి మంచు బాగా ఉంటుంది. ఆ సమయంలో టూరిస్టులను ఆకటుకునేలా మంచుగడ్డలతో గది నిర్మాణాలు, లోపల ఉండాల్సిన అందమైన శిల్పాలను చేయాలన్న ఆలోచన మార్చిలో మొదలైనది. అయితే అప్పుడు మంచు ఉండదు కదా నవంబర్ వరకు ఆగాడు. నవంబర్ మొదలవ్వగానే అక్కడ దొరికే 5,500 టన్నుల మంచుని తీసుకొచ్చి ఒకచోట చేర్చి పెద్ద మంచుగడ్డలా చేశాడు. వాటిని శిల్పాలుగా చెక్కడానికి వందమంది పనివాళ్లని పెట్టాడు. అందులో సగం మంది కళాకారులే.

ఒక్కోదానికి ఒక్కో ప్రత్యేకత..

ఒక్కొక్క గదికి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఒక గదిలోని మంచం మంచుగడ్డతోనే చేశారు. అది బాగా చల్లగా ఉంటుంది. చలిని తట్టుకోవడానికి దాని మీద జింక చర్మంతో చేసిన వస్త్రాన్ని పరిచారు. చలికి తట్టుకునేలానే తగు ఏర్పాటు చేశారు. దీన్ని కెనడాకి చెందిన క్రిస్టోఫర్ పాస్కో, జెన్నీ ఓకిఫ్ఫే రూపొందించారు. పక్కనే మరొక గదిలో 'లివింగ్ ఓషియన్'ని ఏర్పాటు చేశారు. మహాసముద్రాలను కాపాడాలి, దాని ప్రాముఖ్యతను సందర్శకులకు గుర్తుచేసేలా ఉండాలని కళాత్మకంగా చెక్కాడు. మరొక గదిలో సొరచేప ఈత కొడుతున్నట్లుంటుంది. జంతు హక్కులని నాశనం చేయవద్దని తెలియజేస్తుంది. ఇంకొక గదేమో 'హవెన్' సూట్ గదిలో రెండు జంతువులు ఎదురెదురుగా ఉంటాయి. దీనికి అర్థం కాంతి, ప్రకాశించడం, ప్రతిబింబం మన ఆలోచన నుంచి సృష్టికి విముక్తి కలిగించడానికి ఇది ఒక కలలా అనిపిస్తుంది. 'ఐస్ ఉమెన్' గది దీనిని స్వీడన్స్ లిండ రూపొందించాడు. ఈతకొట్టడానికి సిద్ధమయిన మహిళగా దీన్ని చెక్కాడు.

తట్టుకుంటేనే..

టోపీ ధరించి, పళ్లకి క్యాండీ అనే తీపి పదార్థాన్ని పెట్టారు. దీన్ని చూడ్డానికి వచ్చిన సందర్శకులు క్యాండీ రుచి చూసి మంచి అనుభూతిని పొందుతున్నారు. హోటల్ లోపల –5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. చలికి తట్టుకునేలా చేతికి గ్లౌసులు, వస్త్రధారణ ఉంటుంది. ఈ గదులతోపాటు ఆడుకోవడానికి ఒక గదిని ఏర్పాటు చేశారు. స్నోషూయింగ్, స్నోమొబైల్ సఫారీలు, డాగ్ స్లీడింగ్, రుచిగల ఆహారం, పానీయాలు అమర్చారు. మార్చి వరకు ఈ హోటల్ ఉంటుంది. తరువాత ఎండకి అంతా కరిగిపోతుంది. మరింకెందుకు ఆలస్యం మీరు కూడా ఈ చలికాలంలోనే స్వీడన్ వెళ్లి ఐస్‌హోటల్‌ని సందర్శించి ఆ మధురానుభూతులను ఆస్వాదించండి.

వనజ వనిపెంట

పజిల్



1 + 4 = 5
2 + 5 = 12
3 + 6 = 21
8 + 11 = ?

చుక్కలు కలుపండి!




పదాలు సరిచేయండి!



పది తేడాలు గుర్తించండి



పదాలు కలుపండి!



1. బాగుంది హిందీలో?
2. రామ్‌చరణ్ నటించిన ఓ సినిమా?
3. ఒకరిని సరదాగా పిలువడానికి ఈ పేరుని వాడుతారు.
4. వాట్సప్ లోగో ఏ రంగులో ఉంటుంది?
5. మొండి పట్టు పట్టడం ?
6. పిల్లాడిని ఇలా కూడా పిలుస్తారు?

జవాబులు

పదాలు కలుపండి :1. అచ్చ 2. రచ్చ 3. మచ్చ 4. పచ్చ 5. కచ్చ 6. బచ్చ
బ్లడ్ రిలేషన్స్ :1.కూతురు 2.కొడుకు 3.కూతురు 4.అక్క లేదా చెల్లి 5.కూతురు
జతపరుచండి : 1.C, 2.D, 3.A, 4.E, 5.B
పజిల్ : 40

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

నవోదయ విద్యాలయలో 251 ఖాళీలు

మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ పరిధిలోని నవోదయ విద్యాలయ సమితి దేశవ్యాప్తంగా హెడ్‌క్వార్టర్/రీజినల్ ఆఫీస్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పీజీటీ, ప్రిన్సిపాల్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- మొత్తం పోస్టులు: 251
- **పోస్టులవారీగా అర్హతలు:**
- ప్రిన్సిపాల్–25– ఏదైనా మాస్టర్ డిగ్రీ 50 శాతం మార్కులతోపాటు బీఈడీ ఉత్తీర్ణత. సెంట్రల్/స్టేట్ లేదా అటానమస్ సంస్థల్లో వైస్‌ప్రిన్సిపాల్ లేదా అసిస్టెంట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్/లెక్చరర్/పీజీటీగా పనిచేసి ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 78,800–2,09,200/–
- అసిస్టెంట్ కమిషనర్–3– ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో ఎనిమిదేండ్ల అనుభవం.
- **పేస్కేల్:** రూ. 67,700–2,08,700/–
- అసిస్టెంట్/ కంప్యూటర్ ఆపరేటర్–5 ఖాళీలు– ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 25,500–81,100/– (అసిస్టెంట్ పోస్టులకు రూ. 35,400/– 1,12,400/–)
- పీజీటీ–218 (బయాలజీ–16, కెమిస్ట్రీ–25, కామర్స్–21, ఎకనామిక్స్–37, జాగ్రఫీ–25, హిందీ–11, హిస్టరీ–21, మ్యాథ్స్–17, ఫిజిక్స్–34, ఐటీ–11)
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత మెథడాలజీ (సబ్జెక్టు)లో బీఈడీ పూర్తిచేసి ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 47,600–1,51,100/–
- **వయస్సు:** పీజీటీ పోస్టులకు 40, అసిస్టెంట్/కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు 30, అసిస్టెంట్ కమిషనర్‌కు 45, ప్రిన్సిపాల్‌కు 50 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు ఫీజు:** ప్రిన్సిపాల్, అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు రూ. 1500/–, పీజీటీ పోస్టులకు రూ.1000/–, మిగతా పోస్టులకు రూ. 800/– ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- పోస్టులను బట్టి వేర్వేరుగా రాతపరీక్షలో తేడాలు ఉన్నాయి. రాతపరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- పీజీటీ మొత్తం 180 ప్రశ్నలకు ఒక మార్కు చొప్పున 180 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. మూడు గంటల్లో పూర్తిచేయాలి. దీనిలో జనరల్ ఇంగ్లిష్–20, జనరల్ హిందీ–20, జనరల్ అవేర్‌నెస్–30, జనరల్ ఇంటెలిజెన్స్, న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్–30, టీచింగ్ ఆప్టిట్యూడ్–20, సంబంధిత సబ్జెక్టు–60 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 14
- **రాతపరీక్ష తేదీ:** మార్చి చివరి వారంలో
- **వెబ్‌సైట్:** www.nvsrect2019.org

డీఐపీపీలో ఎగ్జామినర్లు

న్యూఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ ఖాళీగా ఉన్న ఎగ్జామినర్ (కాపీరైట్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **పోస్టు పేరు:** ఎగ్జామినర్ (కాపీరైట్స్)
- **మొత్తం పోస్టులు:** 20
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. అడ్వకేట్ రంగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ (ఈ–మెయిల్)లో (j.swaroop60@nic.in లేదా registrar.copyrights@gov.in)
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 16
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 8, 9
- **వెబ్‌సైట్:** www.cgpdtmrecruitment.in

ఐసీఎంఆర్‌లో

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్- నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రిసెర్చ్ (ఎన్ఐఎన్ క్యాంపస్) అడ్మినిస్ట్రేటివ్/టెక్నికల్ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నికల్ అసిస్టెంట్, ఎంటీఎస్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

- **మొత్తం ఖాళీలు:** 24
- **విభాగాలవారీగా:** అసిస్టెంట్–2 (జనరల్), అప్పర్ డివిజన్ క్లర్క్–2 (జనరల్), టెక్నికల్ అసిస్టెంట్ (లైఫ్ సైన్సెస్–3 (ఓబీసీ–2 జనరల్–1), కంప్యూటర్ సైన్స్–1 (జనరల్), ల్యాబొరేటరీ అటెండెంట్–12 (జనరల్–9, ఓబీసీ–2, ఎస్టీ–1), మల్టీ టాస్కింగ్ స్టాఫ్–4 (జనరల్–3, ఓబీసీ–1)
- అర్హతలు, వయస్సు, ఎంపిక తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **చివరితేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** www.icmr.nic.in

నార్త్ సెంట్రల్ రైల్వేలో

అలహాబాద్‌లోని నార్త్ సెంట్రల్ రైల్వే కార్యాలయం స్పోర్ట్స్ కోటాలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 21
- **గ్రేడ్ పే రూ. 1900/2000/– పోస్టులు:** 16 (క్రికెట్–8, బ్యాడ్మింటన్–2, రెజ్లింగ్–1, హాకీ–4, అథ్లెటిక్స్–1)
- **గ్రేడ్ పే రూ. 2400/2800/– పోస్టులు:** 5 (జిమ్నాస్టిక్స్–2, టేబుల్ టెన్నిస్–2, రెజ్లింగ్–1)
- **అర్హత:** పదోతరగతి/ఇంటర్/ఐటీఐ ఉత్తీర్ణత. వరల్డ్‌కప్, వరల్డ్ చాంపియన్స్, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, సౌత్ ఏషియన్ గేమ్స్, నేషనల్ గేమ్స్‌లో పాల్గొని ఉండాలి.
- **ఎంపిక:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 28
- **వెబ్‌సైట్:** www.rrcald.org

జూనియర్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్

న్యూఢిల్లీలోని నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ ఖాళీగా ఉన్న జూనియర్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ పోస్టుల (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

NCW Recruitment

- జూనియర్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్–8 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ లేదా ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ 40,000/–
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 23
- **వెబ్‌సైట్:** http://ncw.nic.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
ఆదివారం 13 జనవరి 2019

అసలేం జరిగింది?

ఎక్సోడస్ మీడియా పతాకంపై కె. నీలిమా నిర్మిస్తున్న చిత్రం 'అసలేం జరిగింది?'. ఒకరికి ఒకరు, రోజాపూలు ఫేమ్ శ్రీరామ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమాతో కెమెరామెన్ ఎన్‌వీఆర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర పోస్టర్‌ను శనివారం టీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌కుమార్ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శ్రీమతి నీలిమా నిర్మిస్తున్న ఈ చిత్రం విజయవంతం కావాలి. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరూ తీయని సరికొత్త ప్రదేశాల్లో సినిమా చిత్రీకరణ జరుపాలనుకోవడం బాగుంది. ఇందుకోసం చిత్రబృందం ఆరు నెలల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం అభినందనీయం' అని తెలిపారు. నిర్మాత కె. నీలిమా మాట్లాడుతూ 'ఫిబ్రవరి 11 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తిచేస్తాం. 'భైరవగీత' సినిమాలో ప్రతినాయకుడిగా నటించిన విజయ్‌రామ్ ఈ సినిమాలో విలన్‌గా కనిపించనున్నారు. నెర్రపల్లి వాసు అద్భుతమైన కథను అందించారు' అని చెప్పారు. ఈ చిత్రానికి పాటలు: చిర్రావూరి విజయ్‌కుమార్, డాక్టర్ చల్లా భాగ్యలక్ష్మి, వెంకటేష్, సంగీతం: మహావీర్, గాయనీగాయకులు: విజయ్ ఏసుదాస్, విజయ్ ప్రకాష్, యాజిన్ నిజార్, రాంకీ, భార్గవి పిళ్లై.


నాని


విజయ్, వాసు, ఎన్‌వీఆర్, మహావీర్, సంతోష్, నీలిమా, శ్రీకర్

అర్జున్.. వయసు 36


'అర్జున్ వయసు ముప్ఫై ఆరు ఏళ్లు. ప్రొఫెషనల్స్ స్పోర్ట్స్ నుంచి రిటైర్ అయ్యే వయసు అది. ఆ ఏజ్‌లో క్రికెటర్‌గా గొప్ప పేరుతెచ్చుకోవాలని కలలుకంటాడతడు. పిల్లలను ఆడించే వయసులో ఈ ఆటలు ఎందుకని స్నేహితులంతా అర్జున్‌ని నిరుత్సాహపరుస్తారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా క్రికెటర్‌గా మారాలన్న తన కలను అర్జున్ ఎలా సాకారం చేసుకున్నాడో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జెర్సీ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. శనివారం టీజర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో క్రికెటర్‌గా గుర్తింపు కోసం ఆరాటపడే వ్యక్తిగా నాని కనిపిస్తున్నారు. 'ఆపేసి ఓడిపోయినవాడు ఉన్నాడు. కానీ ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు' అంటూ టీజర్‌లో నాని చెప్పిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. క్రికెట్ నేపథ్యంలో 1996-97 కాలంనాటి కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. ఏప్రిల్‌లో సినిమా విడుదలకానుంది.


లావణ్య

ఉండిపోరాదే ప్రేమిక

తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. గోల్డ్ టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై డాక్టర్ లింగేశ్వర్ నిర్మిస్తున్నారు. నవీన్ నాయని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. వినూత్నమైన కథ, కథనాలతో రూపొందిస్తున్నాం. ఓ జంట ప్రేమప్రయాణానికి అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. రాజమండ్రిలో తొలి షెడ్యూల్‌ను చిత్రీకరించాం. తదుపరి షెడ్యూల్‌ను ఈ నెల 28 నుండి బెంగళూరు, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్‌లో తెరకెక్కిస్తాం. ప్రేమ, వినోదం, సెంటిమెంట్ అంశాల సమాహారంగా ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య హంగులు పుష్కలంగా ఉంటాయి. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది' అని తెలిపారు. కేదార్ శంకర్, సత్యకృష్ణన్, అల్లు రమేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాబు వర్గీస్, కెమెరామెన్: శ్రీను విన్నకొట.

ఫిబ్రవరి 17న టీఎస్ఆర్ అవార్డ్స్


మీనా, సుబ్బిరామిరెడ్డి, నగ్మా

టీఎస్ఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకను ఫిబ్రవరి 17న వైజాగ్‌లో నిర్వహించబోతున్నట్లు టి. సుబ్బిరామిరెడ్డి ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో టీఎస్ఆర్ అవార్డుల జ్యూరీ కమిటీ పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా జ్యూరీ ఛైర్మన్ సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ '2010 నుండి ఈ అవార్డుల్ని ప్రదానం చేస్తున్నాం. నిర్విఘ్నంగా ఈ వేడుకను కొనసాగించడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 17న జరుగనున్న ఈ కార్యక్రమంలో 2017, 2018 సంవత్సరాల్లో విడుదలైన చిత్రాల నుంచి ప్రతిభను చాటిన వాటికి పురస్కారాలను అందజేయనున్నాం. ఈ ఏడాది శ్రీదేవి మెమోరియల్ పురస్కారాన్ని విద్యాబాలన్‌కు అందజేస్తాం. ఈ అవార్డుల వేడుకకు రజనీకాంత్, చిరంజీవి, సూర్య, బాలకృష్ణ, వెంకటేష్, విక్రమ్‌తో పాటు పలువురు దక్షిణాది నటీనటులు హాజరుకానున్నారు' అని పేర్కొన్నారు. భారతీయ కళలు, సంస్కృతులకు సుబ్బిరామిరెడ్డి ఎనలేని సేవ చేస్తున్నారని సీనియర్ నటి నగ్మా తెలిపింది. త్వరలో తన తండ్రి టి. సుబ్బిరామిరెడ్డి ఆటోబయోగ్రఫీని విడుదల చేయనున్నట్లు పింకీరెడ్డి చెప్పింది. ఈ కార్యక్రమంలో జీవిత, కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ బయోపిక్ అలనాటి రోజుల్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టి ఆ రోజుల్లో మాట్లాడుకున్న మాటల్నే పెట్టాం. ఆ మాటల వెనకున్న అర్థం 'హైదరాబాద్‌లో వున్నది రాళ్లు రప్పలు కాదు హైదరాబాద్ అంతా స్వర్ణమయమని చెప్పడం. ఆ డైలాగ్ చూసిన చాలా మంది అక్కడే ఆగిపోయి ఆలోచనలు చేస్తున్నారు. ఆ తరువాత సినిమాలో ఉన్న సంభాషణలు చూడటం లేదు' అన్నారు క్రిష్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'ఎన్టీఆర్ కథానాయకుడు'. బాలకృష్ణ ఎన్టీఆర్ పాత్రలో నటించిన ఈ చిత్రంలో నిర్మాత నాగిరెడ్డి పాత్ర ధారి ప్రకాష్ రాజ్ చెప్పిన 'హైదరాబాద్‌లో ఏముంది? బ్రదర్ రాళ్లు రప్పలే కదా' అనే డైలాగ్‌పై విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో దర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా నమస్తే తెలంగాణతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.


క్రిష్

రాళ్లు రప్పలు కాదు.. అంతా స్వర్ణమయం!

- దర్శకుడు క్రిష్

'ఎన్టీఆర్ కథానాయకుడు' మీ అంచనాలకు అనుగుణంగానే ఆకట్టుకుంటోందా? సినిమాకు ఎలాంటి స్పందన లభిస్తోంది?

• ప్రేక్షకుల స్పందన అమోఘం. నలుమూలల నుంచి ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సాధారణంగా ఎవరైనా మాట్లాడినా, పొగిడినా అవి గుండెలోతుల్లోంచి వచ్చాయా? లేదా? అనేది తెలిసిపోతుంటుంది. కానీ ఈ సినిమా గురించి ఫోన్ చేసిన వారంతా తమ గుండెలోతుల్లోంచి వచ్చిన మాటలతో, సంతృప్తి చెందిన హృదయంతో మాట్లాడుతుండటం ఓ దర్శకుడిగా అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యేలా చేస్తోంది.

ఇలాంటి బయోపిక్‌కు దర్శకత్వం వహించడం అనేది ప్రతి దర్శకుడికీ ఓ ఛాలెంజ్. దర్శకుడు తేజ మధ్యలో తప్పకున్న చిత్రాన్ని భుజాలమీదకి ఎత్తుకోవడం రిస్క్ చేస్తున్నాను అనే భావన మీలో కలగలేదా?

• తొలి అడుగు నుంచే దీన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై పెద్ద ప్రణాళికను సిద్ధం చేసుకున్నాం. దీనికి తోడు చాలా మంది నేతల బయోగ్రఫీల గురించి నేను చాలా కాలంగా చదువుతున్నాను. ఐ వెంకట్రావుగారు రాసిన రామారావు గారి కథ కూడా చాలా కాలం క్రితమే చదివాను. దాంతో రామారావుగారి జీవితంపై నాకు అవగాహన ఏర్పడి బయోపిక్‌పై పూర్తి స్పష్టత వచ్చింది.

బాలీవుడ్ చిత్రం 'మణికర్ణిక' ను మధ్యలోనే వదిలేసి 'ఎన్టీఆర్' కోసం వచ్చారని తెలిసింది?

• 'మణికర్ణిక' కోసం 108 రోజులు షూటింగ్ చేశాను. చిత్రీకరణ దాదాపుగా పూర్తయింది. నాలుగు రోజులు మాత్రమే షూటింగ్ మిగిలి వుంది. దాన్ని పక్కన పెట్టి నేను ఈ సినిమా కోసం వచ్చాక నాలుగు రోజుల షూట్ కాస్తా పెద్దదిగా మారింది. అనేక నాటకీయ పరిణామాల తరువాత సోనూసూద్ సినిమా నుంచి తప్పుకోవడంతో 'మణికర్ణిక' చిత్రీకరణ పార్టు పెరిగిపోయింది. ఆగస్టు 15న విడుదల కావాల్సింది. చిత్రీకరణ ఆలస్యం కావడంతో విడుదల వాయిదాపడింది. ఇక 'ఎన్టీఆర్' చిత్రాన్ని అంగీకరించిన తరువాత 'మణికర్ణిక'ను పూర్తిగా వదిలేయడం జరిగింది.

'ఎన్టీఆర్' కథ దాదాపుగా అందరికి తెలిసిందే. దీన్ని భార్యభర్తల అనుబంధం నేపథ్యంలో చెప్పాలన్న ఆలోచన ఎవరిది?

• ప్రతిదానికి ఓ చిక్కుముడి వుంటుంది. అది విడిపోతేనే కథనం సాఫీగా సాగుతుంది. రామారావు గారి కథ ఏంటనేది అందరికి తెలిసింది. అయితే ఆయన జీవితంలోని ఏ అంశాల్ని తీసుకుని సినిమా చేయాలనే ఆ నేపథ్యంలో కథ చెప్పాలనుకున్నాను. ఈ సినిమాతో రామారావుగారి అంతరంగాన్ని ఆవిష్కరించాలనుకున్నాను. రామారావు గారు ఆయన ఏమిటన్నది ఒక్క బసవతారకంగారికే తెలుసు. ప్రతీ అడుగులోనూ అడుగై నడిచారామె. అందుకే ఆమె పంథాలో సినిమా నడిపించాలనుకున్నాను. ఆ విషయంలో నేను అదృష్టవంతుడిని అనుకుంటున్నాను.

> **సినిమాపై ప్రశంసలు ఏ స్థాయిలో వున్నాయో విమర్శలు కూడా అదే స్థాయిలో వినిపిస్తున్నాయి. దీనిపై మీరు మంటారు?**
>
> ఒక భాగమే విడుదలైంది. అప్పుడే అలా మాట్లాడితే ఎలా. రెండవ పార్టు కూడా చూడాలి కదా?. చాలా మంది సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారని అంటున్నారు కానీ అవేవీ నా దాకా రాలేదు. విమర్శలు చేయడం చాలా సులువు.

ఈ చిత్ర కథలో 'కుబుసం' దర్శకుడు శ్రీనాథ్‌గారి సహకారం వుంది. ఆయన ఇన్‌పుట్స్‌ని ఎంత వరకు తీసుకున్నారు?

• రామారావుగారి జీవితంపై రీసెర్చ్ చేసిన శ్రీనాథ్ గారు టూకీగా కథ చెప్పారు. అయితే దాన్ని తీసుకుని పూర్తిగా నేను రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని రూపొందించాను.

సినిమాలో ప్రకాష్‌రాజ్ పాత్రతో 'హైదరాబాద్‌లో ఏముంది రాళ్లు రప్పలు తప్ప' అనే డైలాగ్ చెప్పించారు ఎందుకని?

• ఎన్టీఆర్ సినిమా అలనాటి రోజుల్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టి ఆ రోజుల్లో మాట్లాడుకున్న మాటల్నే పెట్టాం. ఆ మాటల వెనకున్న అర్థం ఏంటంటే హైదరాబాద్‌లో వున్నది రాళ్లు రప్పలు కాదు హైదరాబాద్ అంతా స్వర్ణమయమని చెప్పడం. ఆ డైలాగ్ చూసిన చాలా మంది అక్కడే ఆగిపోయి ఆలోచనలు చేస్తున్నారు. ఆ తరువాత వున్న మాటలు చూడటం లేదు.

బయోపిక్‌లో రామారావుగారి పాత్రను ఓ మహానటుడిగా చూపిస్తూనే ఆయన్ని దైవాంశ సంభూతుడిగా కీర్తించినట్లుగా కనిపిస్తోంది?

• ఈ సినిమా చూసి కాల్ చేసిన మొట్టమొదటి వ్యక్తి దర్శకుడు పూరిజగన్నాథ్. రామారావుగారి మీద అభిమానంతో ఆయన ఓ సందర్భంలో గుండు కూడా కొట్టించుకున్నానని, రామారావు గారి ఇంటికి వెళ్లి ఆటోగ్రాఫ్ తీసుకున్నానని చెప్పారు. ఎన్టీఆర్ దైవాంశ సంభూతుడు ఈ విషయం వేల మందికి తెలుసు. కాబట్టి ఆయన్ని అలా చూపించడంలో ఎలాంటి తప్పులేదు. దాన్ని ఎవరు ఒప్పుకుంటారు? ఎవరు ఒప్పుకోరు అన్నది వాళ్ల వాళ్ల మనస్థత్వాన్ని బట్టి వుంటుంది. సినిమాలో నేను చూపించిన ప్రతి అంశం నిజజీవితంలో జరిగినవే.

బయోపిక్ అంటే ప్లస్‌లతో పాటు మైనస్‌లు కూడా చూపిస్తుంటారు. కానీ ఇందులో కేవలం ప్లస్‌ల గురించే ఎక్కువగా ప్రస్తావించినట్లున్నారు?

• నేను చూసిన కథని చెప్పాలి కానీ ఎవరో ఒకరు ఊహించిన కథని, అనుకున్న కథని చూపించలేం కదా!. ఒక వ్యక్తిని కించపరచడం కోసం సినిమా తీయమంటే అది తప్పవుతుంది.

సినిమాలో బాలకృష్ణగారు వున్నా మీ మ్యాజిక్ డామినేట్ చేసిందని అంటున్నారు?

• బాలకృష్ణగారు అద్భుతమైన నటనతో మహాద్భుతాన్ని సృష్టించారు. ఆయన చేసిన పాత్రలు ఎక్కడా తగ్గకుండా పరిపూర్ణత తీసుకురావడానికి నా వంతు కృషి నేను చేశాను. ఈ సినిమా వంద శాతం ఫలితాన్ని సాధిస్తే అందులో సగ భాగం క్రెడిట్ నాది. సగం బాలకృష్ణది.

రెండవ భాగం ఎలా వుండబోతుంది?

• ఇప్పుడు చెబితే థ్రిల్ వుండదు పైగా చూసే విధానం మారిపోతుంది. రెండవ భాగంలో ఎన్టీఆర్ బాల్యంతో పాటు చాలా విషయాలు చూపించబోతున్నాం.

ఈ సినిమా మీరు తీసి వుండకపోతే ఈ స్థాయిలో వచ్చేది కాదంటున్నారు.

• ఆ మాటలు విన్నప్పుడు నా జన్మధన్యమైంది అనే అనుభూతి కలుగుతోంది. రాఘవేంద్రరావు గారు ఫోన్ చేసి 'ఈ సినిమాతో నీ జన్మ ధన్యమైంది క్రిష్' అన్నారు. ఆయనలాగే కొన్ని వేల మంది ఫోన్, వాట్సప్ ద్వారా చెప్పారు. ఈ సినిమాకు వచ్చిన పేరు ఇంత వరకు నేను తీసిన ఏ సినిమాకు రాలేదు. ఆ నమ్మకంతో వున్నాను.